జనాల్లో గాలి మారింది. మంగళవారం టంగుటూరులో సీఎం, ఒంగోలులో లోకేష్.. మద్దిపూడి, ఎస్‌ఎన్‌పాడులో సినీహీరో బాలకృష్ణ కార్యక్రమాలను చూస్తే ఈవిషయం స్పష్టమైంది. టీడీపీ కూటమిపై ప్రజల్లో ఉన్న సానుకూలత, వైసీపీ పట్ల ఉన్న వ్యతిరేకత తేటతెల్లమైంది. ఒంగోలులో లోకేష్ వద్ద టీడీపీలో చేరేందుకు వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు క్యూకట్టగా.. గిద్దలూరు, మార్కాపురం, దర్శి, వైపాలెం, కనిగిరి టీడీపీ అభ్యర్థుల వద్ద చేరికలు భారీగా జరిగాయి. ఇక జగన్ పాల్గొన్న టంగుటూరు సభకు కేవలం 5 నుంచి 6వేల మంది ప్రజలు హాజరుకాగా బాలకృష్ణ పాల్గొన్న రోడ్‌షోకు 15వేల మందికిపైగా రావడం విశేషం. దీంతో మంగళవారం రెండు పార్టీల కార్యక్రమాలను నిశితంగా పరిశీలించిన విశ్లేషకులు జనంనాడి టీడీపీ కూటమి వైపు మారిపోయిందనేందుకు దర్పణం పట్టిందని వ్యాఖ్యానిస్తున్నారు.


లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, ధనమ్మ, కార్పొరేటర్లు నాగభూషణం, నరసయ్య, నేతలు రమేష్, గుప్తా, రాంబాబు (కుడి నుంచి ఎడమకు)

గాలి మారింది!

- మారిన జననాడికి దర్పణం
- ఒంగోలులో లోకేష్ వద్దకు క్యూకట్టిన వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు
- పశ్చిమ నియోజకవర్గాల్లో అదేతంతు
- కొండపిలో జగన్ సభకు 5వేలు.. బాలయ్య సభకు 15వేల మంది హాజరు
- జిల్లా అవసరాలను ప్రస్తావించని జగన్
- స్పష్టమైన హామీలిచ్చిన లోకేష్



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు/టంగుటూరు/కొండపి)

జిల్లాలో మంగళవారం ప్రధాన రాజకీయపార్టీల ప్రచార కార్యక్రమాలను పరిశీలిస్తే జననాడి అధికార వైసీపీకి వ్యతిరేకంగా మారిందనే విషయం తేలిపోయింది. ఇటు అధికార వైసీపీ, అటు టీడీపీ కూటమి పార్టీల తరపున కొందరు ముఖ్య నాయకులు జిల్లాలో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారికి తోడు ఆయా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారాలు నిర్వహించారు. అధికార వైసీపీ తరపున సీఎం జగన్ టంగుటూరు సభలో పాల్గొనగా.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఒంగోలులో యువగళం కార్యక్రమానికి హాజరయ్యారు. ఇంకోవైపు సినీనటుడు నందమూరి బాలకృష్ణ రోడ్ షోలలో పాల్గొన్నారు.

లోకేష్ వద్ద క్యూకట్టిన వైసీపీ కార్పొరేటర్లు

ఒంగోలులో మంగళవారం సాయంత్రం యువగళం పేరుతో విద్యార్థులతో చర్చాగోష్టి నారా లోకేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వద్ద టీడీపీలో చేరేందుకు పలువురు వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు పోటీపడ్డారు. ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరానికి చెందిన వారి చేరికలు జరిగాయి. వైసీపీ కార్పొరేటర్లు నాగభూషణం, బెంగళూరు నర్సయ్య అనే వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఇప్పటికే 37డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ పార్టీలో చేరారు. ఆయన బాటలోనే మరో ఇద్దరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికితోడు మరో ముగ్గురు కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నట్లు సమాచారం పంపారు. వారిని పార్టీ మారకుండా సామ, దాన, భేద దండోపాయంతో వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డి అడ్డుకున్నారనే ప్రచారం జరిగింది. తీరా చూస్తే మంగళవారం మంచిది కాదు కాబట్టి తాము రేపు లేక ఎల్లుండి పార్టీలో చేరుతామని ఆ ముగ్గురు కార్పొరేటర్లు దామచర్లకు హామీ ఇచ్చినట్లు సమాచారం. వారిలో ఒకరు ముస్లిం కాగా, రెడ్డి సామాజికవర్గానికి చెందిన మరో కార్పొరేటర్ ఉండటం చర్చనీయాంశం. వీరికితోడు రానున్న రోజుల్లో కార్పొరేషన్‌లో కీలకపాత్ర పోషించేవారు టీడీపీలో చేరే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

సింగరాజు, గుప్తా చేరిక

గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగరాజు రాంబాబు టీడీపీలో చేరారు. వైసీపీలో ఉంటూ బాలినేని అనుచరుల నుంచి దాడికి గురై రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కిన ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన సుబ్బారావు గుప్తా టీడీపీలో చేరారు. సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఆయా వర్గాలకు చెందిన తటస్థవాదులు ఇతర మరికొందరు లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన నాయకుడు పోతినేని శ్రీనివాసరావు(పీఎస్‌ఆర్) పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరితోపాటు ఇటీవల టీడీపీలో చేరిన కాపు సామాజికవర్గానికి చెందిన పలువురు నాయకులు కూడా లోకేష్‌ను కలిసి వారి అనుచరులు పలువురిని టీడీపీలో చేర్చారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు పార్టీలో చేరేవారికి కండువాలు కప్పే పనిలో లోకేష్ మునిగిపోయారు.



గిద్దలూరు, వైపాలెంలోనూ..

గిద్దలూరులో ఎంపీ అభ్యర్థి మాగుంట, ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డి సమక్షంలో పెద్దసంఖ్యలో వైసీపీ నాయ కులు, శ్రేణుల టీడీపీలో చేరారు. వైపాలెం నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పలుగ్రామాల వైసీపీ నాయకులు ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. మార్కాపురంలో కందుల నారాయణరెడ్డి, రాఘవరెడ్డిల సమక్షంలో 70 వైసీపీ కుటుంబాల వారు పార్టీ మారారు. దర్శిలో మంగళవారం రాత్రి పడమర కాశీపురం గ్రామంలో 40 వైసీపీ కుటుంబాల వారు టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సమక్షంలో టీడీపీలో చేరారు. కనిగిరి టీడీపీ అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి హెచ్‌ఎం పాడు మండలం, హజీపురానికి వెళ్లగా గ్రామంలోని వైసీపీ ముఖ్యనాయకులు ఆ పార్టీకి చెందిన పలు కుటుంబాల వారు బహిరంగంగా మద్దతు ప్రకటించారు.

జగన్ సభకు 5 వేలు.. బాలయ్య సభకు 15వేలు

టంగుటూరులో జరిగిన సీఎం జగన్ సిద్ధం సభకు 5వేల మంది హాజరయ్యారు. వచ్చిన వారి సంఖ్య 7వేలు ఉండవచ్చని మరికొందరు అంటున్నారు. అదే కొండపి నియోజకవర్గం మద్దిపూడిలో టీడీపీ కూటమి తరపున ప్రచారం చేసిన సినీహీరో బాలకృష్ణ సభకు సుమారు 15వేల మంది హాజరయ్యారు. పోలీసు శాఖకు చెందిన స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది కొంచెం అటు ఇటుగా ఈ సంఖ్యను నిర్ధారించారు కూడా.

పచ్చిఅబద్ధాలు చెప్పిన సీఎం

టంగుటూరు సభలో మాట్లాడిన జగన్ వెలిగొండ జలాలు జిల్లాకు అందించామని పచ్చి అబద్ధం చెప్పడం మినహా జిల్లా అభివృద్ధి అంశాలను, ప్రధాన సమస్యలను ప్రస్తావించ లేదు. గత ఐదేళ్ల తమ ప్రభుత్వంలో జిల్లాకు ఏంచేసిందో ప్రత్యేకించి ఆయన ఏనియోజకవర్గం వస్తే అక్కడ సాధించిన ప్రగతి గురించి చెబుతారని ఆ పార్టీశ్రేణులు కూడా ఊహించారు. జగన్ అలాంటి అంశాలు ఏమీ ప్రస్తావించలేదు. మరోవైపు ఒంగోలు కార్యక్రమంలో లోకేష్ ఉమ్మడి ప్రకాశం జిల్లాకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఏం చేసిందో వివరించారు. ఆయన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా జిల్లాలోని పశ్చిమప్రాంతం ప్రజలకు ఊరూరా మంచినీరు అందించే పథకాన్ని గుర్తుచేశారు. దీన్ని ఈ ప్రభుత్వం అటకెక్కించిన విషయాన్ని ప్రస్తావించారు. అంతవరకే పరిమితం కాకుండా భవిష్యత్తులో టీడీపీ ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధికి చేయబోయే ప్రధాన అంశాలను వివరించారు. దీంతో ఇటు జగన్ అటు లోకేష్ ప్రసంగాల్లోని ప్రధాన వ్యత్యాసాలను ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.



కొండపి, ఎస్‌ఎన్‌పాడుల్లో బాలయ్య సందడి

సినీ హీరో నందమూరి బాలకృష్ణ కూడా మంగళవారం జిల్లా పర్యటనకు రాగా ప్రజానీకం, ప్రత్యేకించి తెలుగు తమ్ముళ్లు బ్రహ్మరథం పట్టారు. కొండపి నియోజకవర్గంలోని మద్దిపూడి, సంతనూతలపాడుల్లో జరిగిన సభల్లో బాలకృష్ణ పాల్గొనగా రెండుచోట్లా జనం పోటెత్తారు. మద్దిపూడిలో టీడీపీ యువనేత దామచర్ల సత్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ మండలంతోపాటు, పలు ఇతర మండలాల్లోని గ్రామాల నుంచి వేలాది మంది ప్రజానీకం పాల్గొన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ స్వామి, సత్యలు బాలకృష్ణతోపాటు ప్రత్యేక వాహనంపై ర్యాలీలో పాల్గొన్నారు. ఆసందర్భంగా బాలకృష్ణ ప్రసంగిస్తూ రాష్ట్రంలో జగన్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శేషాచలం అడవులను మింగేసి నల్లమల కోసం వచ్చిన గజదొంగ వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అందిన కాడికి దండుకొని అక్రమాలు, అవినీతికి కేరాఫ్‌గా మారిన దొంగ ఆదిమూలపు అని మండిపడ్డారు. పొట్టివాడైనా గట్టివాడు స్వామి అంటూ ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తారు. అభివృద్ధి కోసం స్వామి, మాగుంటలను గెలిపించాలన్నారు.

జనసంద్రమైన సంతనూతలపాడు

మద్దిపూడి నుంచి రోడ్డుమార్గాన ఎస్‌ఎన్‌పాడుకు చేరిన బాలకృష్ణకు అక్కడ అసెంబ్లీ అభ్యర్థి బీఎన్‌విజయ్‌కుమార్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మైనంపాడు డొంక వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించగా రాత్రి 7.45 సమయంలో సంతనూతలపాడుకు బాలకృష్ణ చేరుకున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బీఎన్ విజయ్‌కుమార్, టి.కృష్ణప్రసాద్‌లు ప్రత్యేక వాహనంలో అక్కడికి చేరుకోగా వేలాది మంది ప్రజలతో సంతనూతలపాడు నిండిపోయింది. దీంతో బాలకృష్ణ మరింత ఉత్సాహంతో ప్రసంగించారు. ఎన్టీఆర్ పేదల కోసం తెచ్చిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతోపాటు భవిష్యత్‌తరాల కోసం చంద్రబాబు దూరదృష్టితో అమలుచేసిన కార్యక్రమాలను ప్రత్యేకంగా వివరించారు. జగన్ అరాచకపాలనకు చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. కాగా తూర్పు ప్రాంతంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేరోజు ఒకేసమయంలో ఇటు అల్లుడు లోకేష్, అటు మామ బాలకృష్ణలు చేపట్టిన కార్యక్రమాలు టీడీపీ కేడర్‌లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. ఆ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు ప్రత్యేకించి యువకులు, మహిళలు భారీగా పాల్గొన్నారు.

ఫార్మా హబ్‌గా ప్రకాశం

- మరోసారి ప్రకటించిన లోకేష్
- అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే వెలిగొండ నీరు
- వందరోజుల్లోపే నిమ్జ్‌లో పరిశ్రమలు
- జిల్లా అభివృద్ధిపై స్పష్టమైన హామీలు
- యువతకు భరోసా ఇస్తూ సాగిన 'యువగళంతో లోకేష్'
- బాలినేనిపై ధ్వజం, జనార్దన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి
- మద్దిపూడి, ఎస్‌ఎన్‌పాడుల్లో బాలయ్యకు బ్రహ్మరథం
- తెలుగు తమ్ముళ్లలో మరింత ఉత్సాహం పెంచిన మామాఅల్లుడి పర్యటనలు

ఒంగోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ఉపాధి ఉద్యోగ అవకాశాల పెంపునకు టీడీపీ-జనసేన ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే తమ విధానం అన్నారు. ఒక్కో జిల్లాలో ఒక్కో రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాను గతంలో యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాను ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. యువతతో యువగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎన్నికల సమరభేరిని లోకేష్ ఒంగోలు నుంచి ప్రారంభించారు. స్థానిక గుంటూరు రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యువజన సదస్సులో ఆయన పాల్గొన్నారు. యువతీ, యువకులతో ముఖాముఖి నిర్వహించారు. రాష్ట్రంలో పరిస్థితులు, జగన్ అరాచక పాలన అంతమై తిరిగి టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం, రాష్ట్ర రాజధాని నిర్మాణం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు ఇతర పలుఅంశాలపై యువతీ, యువకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆ సందర్భంగా జిల్లా అభివృద్ధి అంశాలపై స్పష్టమైన హామీలు ఇచ్చారు.




ఒంగోలులో యువతతో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న లోకేష్

ఒంగోలు నుంచే మార్పు మొదలైంది

రాష్ట్రంలో జగన్ అవినీతి, అరాచక పాలనపై ఒంగోలు నుంచి మార్పు మొదలైందని లోకేష్ అన్నారు. ఇక్కడ నిర్వహించిన మహానాడును ప్రజానీకం సక్సెస్ చేయడం రాష్ట్రానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. పౌరుషాల పురిటిగడ్డ అయిన ఒంగోలు స్ఫూర్తితో జగన్ అరాచక పాలనపై రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. అంతేకాక 2019 ఎన్నికల్లో రాష్ట్రం అంతా ఒకగాలి వీస్తే ఇక్కడ ప్రజలు టీడీపీ వైపు నిలిచి ఆదరించారన్నారు. అలాంటి ప్రకాశం జిల్లాను ప్రత్యేక దృష్టితో చూసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే వెలిగొండను పూర్తిస్థాయిలో నిర్మించి నీరిస్తామన్నారు. నిమ్జ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు తాను స్వయంగా బాధ్యత తీసుకుంటానన్నారు. ఆయా అంశాలపై పలువురు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించగా.. యువతకు భరోసాతోపాటు ఆలోచించే విధంగా సమాధానాలను లోకేష్ ఇవ్వడంతో ఉత్సాహంగా కార్యక్రమం సాగింది.

బెట్టింగ్ మాస్టర్ బాలినేని, స్మగ్లర్ చెవిరెడ్డిని ఓడించాలి

ఒంగోలు అభివృద్ధి అనేది టీడీపీ ప్రభుత్వ హయాంలో దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే తప్ప వైసీపీ పాలనలో ఏమీలేదని లోకేష్ విమర్శించారు. బెట్టింగ్ మాస్టర్ అయిన ఇక్కడి ఎమ్మెల్యే బాలినేని విదేశాలకు వెళ్లి పందేలు కాస్తూ, పేకాట ఆడుతూ వాటి కోసం ఇక్కడ డబ్బులు వసూలు చేయడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. అదే జనార్దన్ రెండున్నరవేల కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. అలాంటి జనార్దన్‌ను కాకుండా బాలినేనిని గత ఎన్నికల్లో గెలిపించిన ప్రజలు వాస్తవం ఆలోచించి ఈసారి దామచర్లకు మద్దతుగా నిలిచి బాలినేనిని ఓడించాలని కోరారు. అలాగే ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలని కోరారు. పేకాట కోసం విదేశాలకు వెళ్లే బాలినేని, ఎర్రచందనం దొంగ చెవిరెడ్డిలు కావాలో.. ప్రజల కోసం పనిచేసే జనార్దన్, మాగుంట కావాలో ఆలోచించాలన్నారు.



గరుడ వాహనంపై చెన్నయ్య వైభోగం

మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశ స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువలా జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామివారు మంగళవారం వేకువజామున మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై చెన్నయ్యను దర్శించుకుని పులకించి పోయారు. బుధవారం వేకువజామున గజవాహన సేవ ఉంటుంది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వస్వామి రథోత్సవం వైభవంగా జరగనుంది.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా సురేష్‌కుమార్



ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 30 : వైద్యారోగ్యశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా డాక్టర్ డి.సురేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.పద్మావతి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ రాజ్యలక్ష్మి మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆస్థానంలో జిల్లా లెప్రసీ/టీబీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సురేష్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కొత్తగా డీఎంహెచ్‌వోను నియమించే వరకూ ఆయన కొనసాగనున్నారు.

యువత భవిష్యత్తు కోసం ఫార్మాహబ్‌గా 'ప్రకాశం'

- జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ జెండా ఎరగాలి
- యువగళంలో నారా లోకేష్
- ఎంపీగా మాగుంట, ఎమ్మెల్యేగా దామచర్లను గెలిపించాలని పిలుపు



సభలో ప్రసంగిస్తున్న లోకేష్, పక్కన దామచర్ల జనార్దన్, హాజరైన విద్యార్థులు, యువత

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 30: యువత భవిష్యత్తు కోసం టీడీపీ అధికారంలోకి రాగానే ప్రకాశం జిల్లాను ఫార్మాహబ్‌గా మార్చి వేలాది ఉద్యోగాలు కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఎన్నికల పర్యటనలో భాగంగా మంగళవారం యువగళం కార్యక్రమాన్ని ఆయన ఒంగోలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక గుంటూరురోడ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువతతో ముఖా ముఖిగా మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం యువత పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ళుగా వైసీపీ అరాచక పాలన సాగిస్తుండగా, యువత భవిష్యత్ అంధకారమైందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని తీసుకొచ్చి ఎందరో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. అయితే నేడు సైకో జగన్ పాలనలో రాష్ట్రంలో రౌడీయిజం, గంజాయితో యువత భవిష్యత్‌ను నాశనం చేశారన్నారు. సైకో జగన్‌ను శాశ్వతంగా ఇంటికి పంపాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే యువత కోసం అవసరమైన ఆర్థిక వనరులు తీసుకొస్తామని, జిల్లాను ఫార్మా హబ్‌గా తీర్చిదిద్ది ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్ళకుండా ఇక్కడే వారి ప్రతిభను ఉపయోగించుకోవడం జరుగుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రముఖ కంపెనీలన్నీ పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇక నెల రోజుల్లో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. ఒక్కో జిల్లాను ఒక్కో విధంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధికారంలోకి ఉండగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక కంపెనీలు ముందుకు వచ్చాయని, సైకో జగన్‌తో అవి వెనక్కు వెళ్ళాయన్నారు. అనంతపురంలో కియా కంపెనీ కూడా వెనక్కు వెళ్ళే పరిస్థితిలో టీడీపీ అండగా నిలిచి కియా కంపెనీ స్థాపనకు కృషి చేసిందన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో అన్నీ నియోజకవర్గాల్లో తెలుగుదేశం జెండా ఎగరాలని, ఆ బాధ్యత యువతపై ఉందని, రాబోయే రోజుల్లో యువత బంగారు భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారెంటీ అని లోకేష్ పేర్కొన్నారు.

దామచర్ల.. మాగుంటలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని, ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని లోకేష్ కోరారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువత బాగు కోసం విజన్ కలిగిన చంద్రబాబును సీఎం చేయాలని, అందుకోసం సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజధాని లేని రాష్ట్రంలో ఉంటున్నందుకు సిగ్గుగా ఉంది - ప్రణయ్, ఐటీ ఉద్యోగి, బెంగళూరు



జిల్లాకు చెందిన వేలాది మంది నిరుద్యోగులు తాము చదువులకు ఇక్కడ ఉద్యోగాలు లేక పొరుగు రాష్ట్రాలకు వెళుతున్నారు. గడిచిన ఐదేళ్ళలో ఒక్క ఉద్యోగం కూడా లేదు. ముఖ్యంగా కనీసం క్యాపిటల్ లేని రాష్ట్రంలో ఉన్నామని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రాజధాని తీసుకొస్తారా.. లేక వైసీపీ మాదిరిగా వదిలేస్తారా? అని ఐటీ ఉద్యోగి ప్రణయ్ ప్రశ్నించారు.

దీనిపై లోకేష్ సమాధానమిస్తూ అధికారంలోకి రాగానే ఆగిపోయిన రాజధాని పనులు పూర్తి చేస్తాము. రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేసిన వైసీపీకి భిన్నంగా అభివృద్ధి చేస్తాము. జిల్లాలో ఫార్మా రంగాన్ని అభివృద్ధి చేసి, జిల్లా ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వెళ్ళకుండా ఉపాధి కల్పిస్తామని హామీ యిచ్చారు.

ఐదేళ్లలో అరాచకాలు పెరిగాయి.. టీడీపీ వస్తే అదేబాటలో వెళతారా? - సాయిప్రియ



గడిచిన ఐదేళ్ళలో వైసీపీ పాలనలో అరాచకాలు, దాడులు, హత్యలు, దౌర్జన్యాలు పెరిగాయని అంటున్నారు. అలాగే అధికారంలోకి రాగానే వారికి సినిమా చూపిస్తామని మీరే చెబుతున్నారు. మీరు కూడా అదే బాటలో కక్ష్య సాధింపు చర్యలు చేపడతారా? అని సాయి ప్రియ అనే విద్యార్థిని ప్రశ్నించారు.

దీనిపై స్పందించిన లోకేష్ మాట్లాడుతూ సినిమా చూపిస్తామంటే.. వైసీపీ తరహాలో దాడులకు దిగబోమని, అయితే కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి, రాజ్యాంగాన్ని విస్మరించి కేసులు పెట్టారని, అలాంటి వారిపై చట్టపరగంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారులు ఏకపక్షంగా కాకుండా తమ విధులు వారు స్వతంత్రంగా నిర్వహించుకునేలా చేస్తామన్నారు.

జిల్లాలో ఫార్మాకే ప్రాధాన్యత ఇస్తారా? ఇతర పరిశ్రమలు తెస్తారా? - వంశీ

టీడీపీ అధికారంలోకి రాగానే జి ల్లాను ఫార్మ హబ్‌గా చేస్తామని హా మీ ఇచ్చారు. ఇంజనీరింగ్, ఇతర ఉన్నత చదువులు, టెక్నికల్ చదువు లు చదువుకున్నవారి పరిస్థితి ఏమిటి ? వారి కోసం ఏ విధమైన చర్యలు తీసుకోబోతున్నారని వంశీ అనేన విద్యార్థి ప్రశ్నించారు.

దీనిపై స్పందించిన లోకేష్ మాట్లాడుతూ తాను యువగళం పాదయాత్రలో ముందే చెప్పామని, ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు మొదటగా ఫార్మా రంగాన్ని అభివృద్ధి చేసి, ఐదేళ్ళలో ఇతర పరిశ్రమలు స్థాపించి, యువతకు ఉజ్వల భవిష్యత్ అందిస్తామని తెలిపారు.

షర్మిలకు ట్విట్ చేయడంలో రాజకీయం ఉందా? - రామకృష్ణారెడ్డి



క్రిస్మస్ సందర్భంగా వైఎస్.షర్మిల్ గ్రీటింగ్స్ చెబితే అందుకు ప్రతిగా మీరు ట్విట్ చేసి, గ్రీటింగ్ చెప్పారు. అప్పటికే షర్మిల, జగన్‌ల మధ్య దూరం ఉంది. ఇది మీకు ముందే తెలిసి చేశారా? రాజకీయం ఏమైనా ఉందా.. అని రామకృష్ణారెడ్డి అనే యువకుడు ప్రశ్నించాడు.

దీనిపై లోకేష్ స్పందిస్తూ రాజకీయం వేరు. వ్యక్తిగతం వేరు. షర్మిల మమ్మల్ని గుర్తించి కేక్ పంపించడం మంచి సంప్రదాయం. మేము హెరిటేజ్ తరుపు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రంలోని రాజకీయనాయకులకు 1992 నుంచి మా అమ్మ భువనేశ్వరీ హెరిటేజ్ ఫుడ్స్ పంపిస్తుంటారు. ఇలా ఇచ్చి పుచ్చుకోవడం, గౌరవించుకోవడం మంచి సంప్రదాయం. ఇలాంటివి మానవత్వంతో చూడాలన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో భరోసా

- టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్


మద్దిరాలపాడు లో ప్రచారం చేస్తున్న బీఎన్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 30: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చేకూరపాడు, మద్దిరాలపాడు గ్రామాల్లో టీడీపీ గ్రామ అధ్యక్షులు కరణం మోహనరావు, పెనుబోతు సునీల్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు, మహిళలు బీఎన్‌పై పూలవర్షం కురిపిస్తూ, హారతులిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. మద్దిరాలపాడులోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తానన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, తేనేటి కృష్ణప్రసాద్‌ను ఎం పీగా గెలిపించాలని కోరారు. కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, సర్పంచ్‌లు కొమ్మినేని రమేష్ బాబు, స్వర్ణ అనురాధ, గుమ్మడి సాయిబాబా, షేక్ ఖాజావలి, నెప్పల శివకృష్ణ, నెప్పల కృష్ణమూర్తి, పాలడుగు మురళి, తాళ్ళూరి ఆంజనేయులు, నెప్పల శ్రీకాంత్, రాయపూడి శ్రీనివాసరావు, అంచుపోగు మత్తయ్య ఇంటూరి శ్రీనివాసరావు, మెట్టు సుబ్బయ్యనాయుడు, స్వర్ణ కిషోర్, జనసేన నాయకులు కొంజేటి ధనుష్, సాయి పాల్గొన్నారు.

డాక్టర్ భగవాన్‌నాయక్ సేవలు అభినందనీయం


భగవాన్‌నాయక్ దంపతులను సత్కరిస్తున్న వైద్యులు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 30 : పేదల ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడటంతో డాక్టర్ భగవాన్‌నాయక్ సేవలు అభినందనీయమని జీజీహెచ్ వైద్యులు, వైద్యాధికారులు, సిబ్బంది కొనియాడారు. ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్‌నాయక్ సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ భగవాన్ నాయక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీజీహెచ్ వైద్యులు డాక్టర్ భగవాన్‌నాయక్, పద్మాబాయి దంపతులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భగవాన్ నాయక్ కుమారుడు నాగఅశుతోష్, కుమార్తె జాగృతి, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ సుధాకర్, జీజీహెచ్ సీఆర్ఎంఓ డాక్టర్ చైతన్య, వైద్యులు నామినేని కిరణ్‌కుమార్, బాలాజీనాయక్, తిరుమలరావు పాల్గొన్నారు.

ఒంగోలు అసెంబ్లీ బరిలో 26మంది

- అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన ఆర్వో

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 26మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నారు. 29మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 26మంది ఎన్నికల బరిలో ఉండటంతో వారందరికీ ఆర్వో సుబ్బారెడ్డి గుర్తులు కేటాయించారు.

పేరు	పార్టీ	గుర్తు
తురకపల్లి నాగలక్ష్మి	కాంగ్రెస్	హస్తం
తాటిపర్తి వెంటకస్వామి	బీఎస్పీ	ఏనుగు
దామచర్ల జనార్దన్	టీడీపీ	సైకిల్
బాలినేని శ్రీనివాసరెడ్డి(వాసు)	వైసీపీ	సీలింగ్ ఫ్యాన్
కోలా సతీష్‌కుమార్	నవరంగ్‌కాంగ్రెస్ పార్టీ	బకెట్
బిళ్లా బ్రహ్మానాయుడు	రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా	రింగ్
మిట్నసల చైతన్యప్రసాద్	లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ	బావి
ఎ.యోగానంద్	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	వేణువు
వల్లంరెడ్డి రాజగోపాల్‌రెడ్డి	జైభారత్ నేషనల్ పార్టీ	బ్యాటరీ టార్చ్
అక్కరాజు నిర్మల్	స్వతంత్ర అభ్యర్థి	క్యాన్
పి.అనిత	స్వతంత్ర అభ్యర్థి	అల్మారా
ఆలా నారాయణరావు	స్వతంత్ర అభ్యర్థి	ఇమ్మర్షన్‌రాడ్
అనోది శంకర్‌రెడ్డి	స్వతంత్ర అభ్యర్థి	గాజులు
సుంకర కల్యాణి	స్వతంత్ర అభ్యర్థి	బెండకాయ
తేళ్ల కిరణ్‌కుమార్	స్వతంత్ర అభ్యర్థి	గదికూలర్
దాసరి సుందరం	స్వతంత్ర అభ్యర్థి	టెలిఫోన్
పటాపంజుల శ్రీను	స్వతంత్ర అభ్యర్థి	బెలూన్
తిరుపతిస్వామి మక్కెన	స్వతంత్ర అభ్యర్థి	లోలకం
మన్నం సుధీర్‌కుమార్	స్వతంత్ర అభ్యర్థి	హెల్మెట్
ఎస్‌కే.ముంతాజ్	స్వతంత్ర అభ్యర్థి	చెవిరింగులు
చప్పిడి రవిబాబు	స్వతంత్ర అభ్యర్థి	ఆటో రిక్షా
వజ్రాల మహేశ్వరరెడ్డి	స్వతంత్ర అభ్యర్థి	టైర్లు
వెంకట్రావ కొల్లా	స్వతంత్ర అభ్యర్థి	టీవీ రిమోట్
మందపల్లి వెంకటేశ్వర్లు	స్వతంత్ర అభ్యర్థి	బాట్స్‌మన్
పాతపాటి శ్రీనివాసరావు	స్వతంత్ర అభ్యర్థి	స్టెతస్కోప్
ఎస్‌కే.హుస్సేన్‌బీ	స్వతంత్ర అభ్యర్థి	సీసీటీవీ కెమెరా

జగన్నాటకాలను నమ్మి మోసపోవద్దు!

జగన్‌ని గద్దెదించటానికి జనం అంతా సంసిద్ధం • అవినీతికి మారుపేరైన నాగార్జున ఇక్కడేం పీకటానికి వచ్చారు..

బీఎన్, కృష్ణప్రసాద్‌లను భారీ మెజార్టీతో గెలిపించండి • సంతనూతలపాడు సభలో బాలకృష్ణ పిలుపు


సభలో పచ్చకండువాతో అభివాదం చేస్తున్న బాలకృష్ణ, పక్కన కృష్ణప్రసాద్, బీఎన్

చీమకుర్తి, ఏప్రిల్30 : సీఎం జగన్ జగన్నాటకాలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. సర్వజనహితంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో ఉందన్నారు. మంగళవారం సాయంత్రం సంతనూతలపాడు బస్టాండ్‌సెంటర్‌లో జరిగిన స్వర్ణాంధ్ర సాకారయాత్రలో బాలకృష్ణ పాల్గొని ప్రసంగించారు. బాలకృష్ణకు మైనంపాడు డొంకవద్ద కూటమి శ్రేణులు అఖండ స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీగా బస్టాండ్‌సెంటర్‌కు చేరుకున్న బాలకృష్ణ ఉత్తేజభరిత ప్రసంగాన్ని దాదాపు 45 నిమిషాలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక, అవినీతి, దౌర్జన్య పాలనకు చరమగీతం పాడటానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని, జనసునామీలో జగన్ కొట్టుకుపోవటం ఖాయమని చెప్పారు. వైసీపీ మేనిఫెస్టో మేడిపండుచందంగా ఉందన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి పింఛను రూ.4వేలు ఇస్తారని, బీసీలకు 50 ఏళ్లకే పింఛను అందిస్తారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి కలుగుతుందన్నారు. సిద్ధం సభలో పేరుతో వందలకోట్ల ప్రజాధనం వృధా చేశారని విమర్శించారు. నిన్ను నమ్మి మోసపోయిన ప్రజలకు, మీ చెల్లెళ్లు అడిగే ప్రశ్నలకు జవాబు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నావా జగన్ అన్ని ఆయన ప్రశ్నించారు.

మంత్రి నాగార్జునపై విమర్శనాస్త్రాలు

అవినీతి, అక్రమాలకు మారుపేరుగా నిలిచిన మంత్రి మేరుగ నాగార్జునను వేమూరు నుంచి సంతనూతలపాడుకు పంపించారని, అక్కడ జగనన్న భూస్కాంలో కూరుకుపోయి ప్రజల వ్యతిరేకతను కూడగట్టుకున్నారని బాలకృష్ణ ఆరోపించారు. ఇక్కడ ఏమి పీకటానికి వచ్చావని ఎద్దేవా చేశారు. నాగార్జున వైజాగ్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నపుడు ఎస్సీ, ఎస్టీలకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని లంచాలు తిని వారిని మోసం చేయటంతో పోలీసులు బాదుకుంటూ జీపు ఎక్కించిన విషయాలు వైజాగ్‌వాసులకు అందరికీ తెలుసన్నారు. వైసీపీ దౌర్జన్య సంస్కృతి అన్నారు. అన్న నందమూరి తారకరామారావు కారణజన్ముడని, సంస్కరణలకు ఆద్యుడని కొనియాడారు. విజనరి నాయకత్వం ఉన్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధి చెందినట్లే ఆంధ్రా కూడా గాడిలో పడుతుందన్నారు. ప్రపంచం మెచ్చిన నాయకుడు చంద్రబాబునాయుడుకు అందరూ మద్దతు పలకాలన్నారు. చివరలో బాలకృష్ణ నటించిన సినిమాలోని డైలాగ్‌లు చెప్పి జనాన్ని ఉత్సాహపరిచారు. తన బాల్యమిత్రుడు, క్లాస్‌మేట్ అయిన తేనేటి కృష్ణప్రసాద్, ప్రజల మనిషి బీఎన్. విజయ్‌కుమార్‌ని గెలిపించాలని బాలకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


లోకేష్‌తో దామచర్ల జనార్దన్, సత్య


బాలకృష్ణకు బొకే ఇస్తున్న దామచర్ల

తెలుగు తమ్ముళ్లలో జోష్..!

లోకేష్ రాకతో ఉత్సాహంలో శ్రేణులు

వైసీపీకి భారీ షాక్.. టీడీపీలోకి ముఖ్య నేతలు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 30 : వైసీపీకి ఊహించని విధంగా వరుస షాక్‌లు తగులుతున్నాయి. వైసీపీకి చెందిన పలువురు ఇప్పటికే ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి క్యూ కడుతుండగా, ఆ పార్టీలో ముఖ్యులు వైసీపీని వీడి వలసలు పోతున్నారు. ఈమేరకు మంగళవారం ఒంగోలు విచ్చేసిన నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ టీడీపీలో చేరగా, అదే బాటలో వైసీపీ నుంచి పలువురు ముఖ్యులు వైసీపీ వద్దేవద్దు అంటూ ఆ పార్టీని వీడారు. మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ శింగరాజు రాంబాబు, సీహెచ్.రాంబాబు, దమ్మాలపాటి రమేష్, సోమిశెట్టి సుబ్బారావుగుప్తా, వైసీపీ తరుపున గెలుపొందిన 10వ డివిజన్‌కు చెందిన బెంగుళూరి నరసయ్య, 16వ డివిజన్‌కు చెందిన నాగభూషణం తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే పెదకొత్తపల్లికి చెందిన పీఎస్ఆర్ (పోతినేని శ్రీనివాసరావు) తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరి ఆధ్వర్యంలో వీరి అనుచరులు మరి కొంతమంది తెలుగుదేశం పార్టీలో చేరడంతో టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్, దామచర్ల జనార్దన్‌లు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా యువనేత నారా లోకేష్ ఒంగోలు రాకతో తెలుగు తమ్ముళ్ళు, యువతలో నూతనోత్సాహం కనిపించింది. ఈ సందర్భంగా నగరంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే యువత లోకేష్‌తో కరచాలనం చేసేందుకు యువత పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపారు. ఇదిలా ఉండగా పార్టీ శ్రేణుల్లోనూ నూతనోత్సాహం కనిపించింది. లోకేష్ ప్రసంగం చేస్తున్న సమయంలో డీజే జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. భారీగా హాజరైన యువతతో ప్రాంగణంలో సందడి వాతావరణం కనిపించింది. అలాగే ముందుగా దామచర్ల జనార్దన్, దామచర్ల సత్యలు నారా లోకేష్‌ను కలిసి బొకేలు అందజేశారు.


లోకేష్, దామచర్ల ఫ్లెక్సీకి దండం పెడుతున్న విద్యార్థులు

బాలయ్యను కలిసిన దామచర్ల

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ కలిసి బొకే అందజేశారు. బాలకృష్ణ ఒంగోలు రాకతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించిందని, ఆయన జిల్లాకు రావడం సంతోషమని వారు తెలిపారు.

తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల
- నగరంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 30: తెలుగుదేశం కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. మంగళవారం నగరంలోని 12వ డివిజన్ మరాఠిపాలెంలో, 14వ డివిజన్‌లోని రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాల్లో జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కరువయ్యాయని చెప్పారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆధారపడి జీవించే చేతి వృత్తులు, అలాగే కులవృత్తులు అంతరించిపోయాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు సైకో ప్రభుత్వం ఒక్కపైసా నిధులు ఇవ్వకుండా ఘోరంగా మోసం చేసిందని విమర్శించారు. జగన్ పాలనలో పన్నుల పెంపుతో జనం నష్టపోయారని తెలిపారు. మద్యం నిషేధిస్తామని చెప్పి జగన్ బ్రాండ్‌లతో ప్రజల ప్రాణాలు తీశారని ఆరోపించారు. విజ్ఞులైన ఓటర్లు వాస్తవాలు గుర్తించి, విజన్‌గల చంద్రబాబు నాయుడును రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసుకుందామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, యువతకు నిరుద్యోగ భృతి, పింఛనుదారులకు నెలకు రూ. 4వేలు ఇంటివద్దకే అందజేస్తామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒంగోలు నగరాన్ని అన్నీ విధాలుగా అభివృద్ధి చేశానని, రహదారులు, బ్రిడ్జిలు, సబ్‌స్టేషన్ల నిర్మాణం, తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని దామచర్ల ప్రజలను కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, బీజేపీ నాయకులు యోగయ్యయాదవ్, కార్పొరేటర్ అంబూరి శ్రీను, చంద్ర, కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాస రావు, బడారు మదన్, కపిల్‌బాషా, కామేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి దామచర్లకు ఘన స్వాగతం లభించింది.

అవీ..ఇవీ..

69,918 మందికి ఇంటికే పింఛన్

రూ.20 కోట్లు డ్రా చేసిన సచివాలయం సిబ్బంది

2.22 లక్షల మందికి బ్యాంకు ఖాతాలకు జమ కానున్న సొమ్ము

ఒంగోలు నగరం, ఏప్రిల్ 30: జిల్లాలోని 69,918 మందికి మాత్రమే ఇంటికి పింఛన్లు అందజేయనున్నారు. బుధవారం సచివాలయం సిబ్బంది వీరికి ఇంటింటికి తిరిగి పింఛను సొమ్మును అందజేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి పింఛన్లను లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని నిర్ణయించింది. లబ్ధిదారులు బ్యాంకులకు వెళ్లి పింఛన్ సొమ్మును డ్రా చేసుకోవాల్సి ఉంది. అయితే నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి బ్యాంకు ఖాతాలకు కాకుండా నేరుగా పింఛన్ సొమ్మును అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మిగిలిన లబ్ధిదారులకు సంబంధించిన ఆధార్‌కార్డుతో లింకు అయిన బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్మును జమ చేయనున్నారు. ఆధార్‌కార్డుతో బ్యాంకు లింకు కాని వారు, మంచాన ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మొత్తం 69,918 మంది ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరికి పింఛన్లను ఇంటి వద్దనే అందించేందుకు బుధవారం సచివాలయం సిబ్బంది బ్యాంకుల నుంచి రూ.20 కోట్లు డ్రా చేశారు. వీరు పోను మిగిలిన 2,22,604 మందికి పింఛన్ సొమ్మును బుధవారమే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు వైఎస్సార్ కేపీ, డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా దుర్గాదేవి

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 30: ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా దుర్గాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ గతనెల 30న ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో డాక్టర్ దుర్గా దేవి బాధ్యతలు చేపట్టారు. బెంగళూరు రామయ్య మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన దుర్గా దేవి, సైకాలజీలో ఎండీ పూర్తి చేశారు. అనంతరం ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్ హెచ్‌వోడీగా పనిచేస్తున్నారు. భగవాన్‌నాయక్ రిటైర్‌మెంట్‌తో ఆమెకు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించారు.

టీడీపీలోకి ఎం.ముప్పాళ్ల సర్పంచ్


లోకేష్ సమక్షంలో పార్టీలో చేరుతున్న పద్మశ్రీ, వీరాంజనేయులు

నాగులుప్పలపాడు ఏప్రిల్ 30 : అధికార వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. నాగులుప్పలపాడు మండలం ఎం.ముప్పాళ్ల గ్రామ సర్పంచ్ దంపతులు వైసీపీని వీడి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామచర్ల జనార్థన్, మాజీ మంత్రి బాచిన చెంచుగరటయ్య ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో వీరు టీడీపీలో చేరారు. మంగళవారం నారా లోకేష్ పర్యటనకు రాగా వీరు పార్టీలో చేరారు. వారితో పాటు మాజీ సర్పంచ్ మండవ లక్ష్మయ్య, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెట్టి జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలను రీ షెడ్యూల్ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: జిల్లాలో ఉష్ణోగ్రతలు, వడగాల్పులు అధికంగా ఉన్నందున వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు/కార్మికుల పనివేళలను రీ షెడ్యూల్ చేయాలని కార్మికశాఖ ఉప కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రోజువారీ భవన నిర్మాణ కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల రక్షణకు ఇటుకల బట్టీలు, దుకాణాలు, సంస్థలు, పరిశ్రమల యజమానులకు పలు మార్గదర్శకాలు, సూచనలు జారీ చేశారు. పని ప్రదేశాలలో అవసరాల మేరకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులకు అత్యవసర ఐస్ ప్యాక్స్ అందించాలని చెప్పారు. ఆరోగ్యశాఖ సమన్వయంతో కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆయన కోరారు.

బాలకృష్ణ సభకు తరలిన శ్రేణులు


ర్యాలీగా వెళుతున్న నాయకులు

మద్దిపాడు, ఏప్రిల్ 30: సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సంతనూతలపాడు పర్యటన సందర్భంగా మంగళవారం మద్దిపాడు నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో 200 మోటార్ సైకిళ్లు, 100 కార్లు ఇతర వాహనాలతో సాగిన ఈ ర్యాలీలో భారీస్థాయిలో నాయకులు పాల్గొన్నారు.

డీసెట్ నోటిఫికేషన్ విడుదల : డీఈవో

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 30: ప్రభుత్వ డైట్‌లు, ప్రైవేటు డీఈడీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎఈడీ)లో ప్రవేశాలకు ప్రవేశపరీక్ష నిర్వహించేందుకు డీసెట్-24 నోటిఫికేషన్ విడుదలైనట్లు డీఈవో సుభద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 8 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను 9 వరకు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. మే 15నుంచి 20 వరకు పరీక్ష హాల్‌టిక్కెట్లను సిద్ధం చేస్తారు. 21న హాల్ టిక్కెట్లను జారీ చేస్తారు. 24న డీసెట్ పరీక్ష నిర్వహిస్తారు. మే 30న ఫలితాలు ప్రకటిస్తారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాల వివరాలు 29న ప్రకటిస్తారు. డీఈఎల్‌ఈడీలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు జూన్ 6నుంచి 8 వరకు పెట్టుకోవాలి. 10న ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను, ర్యాంకులను వెల్లడిస్తారు. జిల్లా డైట్‌లలో అభ్యర్థుల సర్టిఫికెట్లను 12నుంచి 15వ తేదీవరకు పరిశీలించి అభ్యర్థులకు తుది అడ్మిషన్ లెటర్‌ను జారీ చేస్తారు. 20వతేదీ నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తారని డీఈవో వివరించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : ఐజీ

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 30: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం ఒంగోలులోని పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్‌తో కలిసి పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. కోడ్‌ను పాటిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికలు శాంతియుతగా జరిగేందుకు సమర్థవంతగా పనిచేయాలని తెలిపారు. గ్రామాలను సందర్శించి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఆశోక్‌బాబు, డీఎస్పీ, సీఐలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 30: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమని, దానిని ఓటర్లు స్వేచ్ఛగా ఉపయోగించుకునే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పోలీస్ వ్యవస్థపై ఉందని సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకులు ఖాజా సింగ్ పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడులో ఎన్నికల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేళ పోలీస్ భద్రతా సిబ్బంది నిర్వర్తించే విధి నిర్వహణ ఎంతో కీలకమన్నారు. కులం, మతం, ప్రాంతం తారతమ్యం లేకుండా, పోలింగ్ కేంద్రాల దగ్గర ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

మత్స్యకారులను ఉపాధి పనులతో ఆదుకోవాలి : పీడీ

కొత్తపట్నం(ఒంగోలు నగరం)ఏప్రిల్ 30: చేపల వేటపై నిషేధం ఉన్న కారణంగా మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా వారికి ఉపాధి హామీ పనులను కల్పించి ఆదుకోవాలని డ్వామా పీడీ బి.అర్జునరావు ఆదేశించారు. మండలంలోని మోటుమాల, పాదర్తి, కె.పల్లెపాలెం గ్రామాల్లో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కె.పల్లెపాలెంలో పీడీ మత్స్యకారులతో మాట్లాడుతూ ప్రతి మత్స్యకార కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆదేశించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయించి రూ.300లు కూలి తగ్గకుండా చూడాలన్నారు. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలకు పనిచేసే చోట తగిన వసతులు కల్పించాలని ఆదేశించారు. మోటుమాలలో హార్టికల్చర్ కింద ఉపాధి నిధులతో సాగు చేస్తున్న మామిడి తోటలను, నర్సరీని పరిశీలించారు. కార్యక్రమలో ఏపీడీ వెంకటస్వామి, ప్లాంటేషన్ మేనేజర్ సంజీవరావు, ఏపీవో రత్నజ్యోత్స్న, ఈసీ పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కేసులే : ఎస్ఐ

మద్దిపాడు, ఏప్రిల్ 30: ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో ఎవరైనా గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దొడ్డవరం, వెల్లంపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఓటర్లు సహకరించాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.


సీఎం సభ జరుగుతుండగానే వెళ్లిపోతున్న జనం

ఉపన్యాసం ప్రారంభంతో వెనుతిరిగిన జనం

టంగుటూరు, ఏప్రిల్ 30 : ముఖ్యమంత్రి జగన్ తన ఉపన్యాసం ప్రారంభించగానే సభనుంచి జనం వెనుతిరిగారు. మంగళవారం టంగుటూరులో సీఎం ఎన్నికల ప్రచార సభ ఒకటిన్నరగంట ఆలస్యంగా ప్రారంభమయ్యింది. ఉదయం 10 గంటలకు సభ జరగాల్సి ఉండగా 11.30గంటల తరువాతనే ప్రారంభమయ్యింది. ఆయన వచ్చేలోపే ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఉపన్యసించారు. సభకు ఆలస్యంగా హాజరైన జగన్ తాను వచ్చీరాగానే ఉపన్యాసం ప్రారంభించారు. ఆ ఉపన్యాసం కొనసాగుతుండగానే జనం పలాయనం చిత్తగించారు. సభను వదలివెళ్లే వారిని ఆపేందుకు పార్టీ అధిష్ఠానం ఎలాంటి ప్రయత్నం చేయకున్నా సభలో నిలబడ్డ ముఖ్యకార్యకర్తలు బయటకు వెళ్తున్న వారిని నిలువరించేందుకు విఫలయత్నం చేశారు. ఎవరో పిలిచిన్నట్లుగా జనం వరుసబెట్టి వెళ్లిపోవడం కనిపించింది. ఒక వైపున జనం వెళ్తున్నా సరే జగన్ తన ఉపన్యాసాన్ని కొనసాగించారు.

సభకు ఆశించిన స్థాయిలోరాని జనం

టంగుటూరులో మంగళవారం జరిగిన ముఖ్యమంత్రి జగన్ సభకు వైసీపీ అధిష్ఠానం ఆశించిన స్థాయిలో జనం హాజరుకాలేదు. వేలాదిగా జనం వస్తారని పార్టీ ప్రచారం చేసింది. అయితే సభకు కేవలం 6, 7వేలకు మించి జనం హాజరుకాలేదు. భగభగమండే ఎండలకు జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఈపరిస్థితుల్లో సభకు జనం రావడం కష్టతరంగా మారింది. ఉదయం 11గంటల వరకు కూడా సభావేదిక వద్దకు జనం రాలేదు. ఒక దశలో సభకు జనం వస్తారా రారా, వస్తే ఎంతమంది వస్తారు అని పార్టీ అధిష్ఠానం ఆలోచనలో పడింది. జనం లేకపోగా వచ్చిన వారు కూడా సభ ప్రారంభం కాగానే వెనుదిరగడంతో పార్టీ నాయకులు బిత్తపోయారు.



గుర్తింపు కార్డులను ఇస్తున్న దినేష్‌కుమార్

బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలకు అదనంగా పంపించే బ్యాలెట్ యూనిట్లకు మొదటి విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం రాజకీయ పార్టీల సమక్షంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య 15కు మించి ఉన్నందున కంట్రోలు యూనిట్‌కు రెండో బ్యాలెట్ యూనిట్‌ను అనుసంధానం చేయాల్సి ఉండటంతో అందుబాటులో ఉన్న బ్యాలెట్ యూనిట్లతో ఈప్రక్రియను చేపట్టారు. ఒంగోలు లోక్‌సభ, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాలలో కూడా 15 మంది కంటే ఎక్కువగా అభ్యర్థులు పోటీలో ఉన్నందున బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో లేకపోవడంతో వాటిని సమకూర్చుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని బెంగళూరులోని బెల్ సంస్థ వద్దకు పంపినట్లు తెలిపారు. అలాగే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు, వారి ప్రతినిధులకు కలెక్టర్ ప్రత్యేక గుర్తింపుకార్డులను అందజేశారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్(వైసీపీ), కాలేషాబేగ్(టీడీపీ), రసూల్, కోటేశ్వరరావు(కాంగ్రెస్), బి.రాజశేఖర్(బీజేపీ), లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థులు దేవిరెడ్డి బాలాంజనేయులు, రాయపాటి జగదీష్, వేసపోగు గురువబాబు, ధరణికోట లక్ష్మీనారాయణ, కె.యోహాన్, కోటా వంశీకృష్ణ, బొడ్డు క్రాంతికుమార్, కోటా సూర్యతేజ, పొదిలి రాంబాబు తదితరులు పాల్గొనానరు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు, లోక్‌సభకు పోటీ చేస్తున్న అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను తెరిచి పటిష్ట బందోబస్తు మధ్య మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాలకు 649 బ్యాలెట్ యూనిట్లను పంపారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు 696మంది విద్యార్థులు ఎంపిక

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 30: బాలలకు ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం జిల్లాలోని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో 1వతరగతిలో ప్రవేశానికి లాటరీ విధానంలో 696 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు డీఈవో డి.సుభద్ర మంగళవారం తెలిపారు. వీరిలో బీసీలు 234 మంది, ముస్లింలు 53మంది, ఓసీలు 147, ఎస్సీలు 244, ఎస్టీలు 18 మంది ప్రవేశాలకు ఎంపికయ్యారు. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో ఈనెల 10వతేదీలోపు సంబంధిత పత్రాలు సమర్పించి ప్రవేశం పొందాలి. ఎంపికపై వచ్చిన మండల స్థాయి అభ్యంతరాలను 11న ఎంఈవోలు పరిష్కరించాలి. వారి ద్వారా వచ్చిన అభ్యంతరాలను 14న డీఈవో సమక్షంలో పరిష్కరించాలి. డీఈవోల ద్వారా వచ్చిన అభ్యంతరాలను 15న సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సమక్షంలో ఎస్‌పీడీ కార్యాలయంలో, రాష్ట్ర కార్యాలయం 17న అభ్యంతరాలన్నింటిని పరిష్కరిస్తారు. లాటరీలో మొదట విడత అడ్మిషన్ పొందిన విద్యార్థులు 10వ తేదీలోపు పాఠశాలల్లో చేరకపోతే వారి అడ్మిషన్లు రద్దు అవుతాయి. మొదటి విడతలో మిగిలిపోయిన సీట్లను రెండో విడతలో లాటరీలో ఎంపికైన విద్యార్థులతో భర్తీ చేస్తామని డీఈవో సుభద్ర వెల్లడించారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బీరంగుంటలో టీడీపీ ప్రచారం

కొత్తపట్నం(ఒంగోలు నగరం)ఏప్రిల్ 30: బీరంగుంట గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడు పురిణి శ్రీనివాసరెడ్డి, గొట్టి కోటేశ్వరరావు, మేరుగ ఆంజనేయులు, కోటిరెడ్డి పలువురు కార్యకర్తలతో ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందంటూ ప్రచారం నిర్వహించారు. ఉప్పురైతులకు తగిన ప్రోత్సాహం ఇస్తుందని వారు చెప్పారు. ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్‌ను గెలిపించుకుందామని వారు కోరారు.

చంద్రబాబు విజన్ ప్రపంచదేశాలకే ఆదర్శం

మర్రిపూడి బహిరంగ సభలో బాలయ్య

మర్రిపూడి, ఏప్రిల్ 30 : చంద్రబాబు విజన్ ప్రపంచ దేశాలకే ఆదర్శ ప్రాయమని హిందుపురం శాసన సభ్యులు, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ చెప్పారు. మంగళవారం స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా మర్రిపూడిలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషా విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ అంటే భగభగ మండే ఓ అగ్నికణం అని సామాజిక విప్లవానికి ఆద్యుడని, మహిళా సాధికారతను సాధించిన మహోన్నత వ్యక్తి అని కీర్తించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతి పరుగులు పెట్టిందని గుర్తు చేశారు. తెలుగు గంగ, గాలేరు - నగరి, హంద్రీనీవా వంటి ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను రూపొందించిన అభినవ భగీరథుడు ఎన్టీఆర్


మర్రిపూడిలో మాట్లాడుతున్న బాలకృష్ణ, హాజరైన జనం


స్వామి, దామచర్ల సత్యలను అభినందిస్తున్న బాలకృష్ణ

అని కొనియాడారు. చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకు సమంగా అందించారని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో దళితులకు, వెనుకబడిన వర్గాలకు మహిళలకు, మైనార్టీలకు పూర్తి భద్రత ఉండేదని, నేడు వైసీపీ పాలనలో ఆయా వర్గాలు నిత్యం భయభ్రాంతులతో జీవించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్కు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడనే ముద్రవేసి చంపేశారని అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు దళిత బిడ్డను హత్యచేసి డోర్‌డెలివరీ చేశాడంటే శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఇసుక దందా జరుగుతుందని ప్రశ్నించిన నేరానికి వరప్రసాదుకు శిరోముండనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత అక్కను వేధిస్తున్నారని అడిగినందుకు చిన్నపిల్లవాడని చూడకుండా సజీవ దహనం చేసి పైసాచిక ఆనందం పొందారని అన్నారు.

టీడీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు అంబేద్కర్ విదేశీ విద్య పథకం ద్వారా ఎందరికో అత్యున్నత స్థానం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. దళిత జాతి ముద్దుబిడ్డగా పేరొందిన బాలయోగిని లోకసభ స్పీకర్‌గా, దళిత మహిళ ప్రతిభా భారతిని అసెంబ్లీ స్పీకర్‌గా ఎంపిక చేసి దళితుల పట్ల టీడీపీకి ఉన్న గౌరవాన్ని తెలుసుకోవాలని చెప్పారు. ప్రజల మానప్రాణ చోరకుడు జగన్ అని వండిపడ్డారు. గత ఎన్నికల్లో గొడ్డలిపోటు, కోడి కత్తి డ్రామాలతో వ ంంద ంక ం వచ్చిన జగన్ ఈసారి గులకరాయి డ్రామా ఆడారని ఎద్దేవా చేశారు. మేము సినిమాలలో నటిస్తుంటే జగన్‌మోహన్ రెడ్డి నిజజీవితంలో నటిస్తున్న గొప్ప నటుడని అభివర్ణించారు. నవరత్నాల పేరుతో నవనాడులను కుంగదీశాడని ధ్వజమెత్తారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులను అవమాన పరచడమే కాకుండా రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మిగిల్చారని మండిపడ్డారు. జే బ్రాండ్ మద్యంతో నిరుపేదల జీవితాలు గాలిలో కలిసిపోయి ఎందరో మహిళలు తాళిబొట్లుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతనంగా ప్రవేశ పెట్టిన లాండ్ చట్టంతో రైతుల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే అటువంటి చట్టాన్ని రద్దు చేస్తామని అన్నదాతలకు భరోసా ఇచ్చారు. రూ. 12 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని విమర్శించారు. కొండపి నియోజకవర్గంలో బీసీ కులానికి చెందిన మాల్యాద్రి టీడీపీ సానుభూతిపరుడనే నెపంతో చిరు దుకాణాన్ని ధ్వంసం చేయడం వైసీపీ హింసా ప్రవృత్తిని తేటతెల్లం చేసిందని విమర్శించారు. సేవా తత్పరులైన మాగుంట శ్రీనివాసుల రెడ్డిని పార్లమెంట్ అభ్యర్థిగా, పొట్టివాడు గట్టివాడైన డోల శ్రీబాల వీరాంజనేయ స్వామిని శాసన సభ అభ్యర్థులుగా అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. స్వామి విజయాన్ని భుజస్కందాలపై వేసుకొని అహరహరం శ్రమిస్తున్న యువనేత దామచర్ల సత్యను బాలయ్య అభినందించారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే స్వామిని, సత్యను హత్తుకొని సభికులను ఉత్సాహపరిచారు. శాసన సభలో దీటుగా మాట్లాడుతూప్రభుత్వ ప్రజా వ్యతిరేకతపై నిత్యం గళమెత్తుతూ స్పీకర్‌నే ఎదిరించే ధీశాలి స్వామి అని అభినందించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా సంక్షేమాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తామని హామీఇచ్చారు.

నాకు ఎదురొచ్చినా.. నేను ఎదురైనా..

నాకు ఎదురొచ్చినా.. నేను ఎదురైనా వారికే రిస్క్ అంటు సినిమా పంచ్‌లతో సభికులను అలరించారు. ఈ సందర్భంగా అన్నదాతలు పొగాకుతో చేసిన భారీ గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. బాలయ్య బాబు సభకు ఎంఆర్‌పీఎస్ నాయకులు డప్పు వాయిద్యాలతో జెండాలను చేబూని సభా స్థలానికి తరలి వచ్చారు. వారిని చూసిన బాలయ్య ఎస్సీ వర్గీకరణకు టీడీపీ కట్టుబడి ఉందని స్పష్టమైన హామీ ఇచ్చారు. పొగాకు దండతో స్వాగతం పలకడంపై వీరసింహారెడ్డి గుర్తొస్తున్నాడని ఆనందం వ్యక్తం చేశారు. హెలిపాడ్ వద్ద బాలయ్యతో ఫొటోలు దిగేందుకు మహిళలు, పిల్లలు ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా వేచి చూశారు. జైబాలయ్య.. జైజై బాలయ్య అంటూ మర్రిపూడి నినాదాలతో మారుమోగిపోయింది. బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు జనసమూహం పోటెత్తింది. 15 వేలమంది సభకు తరలి వచ్చినట్లు అంచనా వేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కనిగిరి డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్సైలు, 150 మంది సిబ్బంది పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ సమన్వయకర్త రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహారావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్థానికుల ఉత్సాహం మేరకు వారితో బాలకృష్ణ

బెట్టింగ్ స్టార్ బాలినేనిని ఓడించాలి

- చంద్రగిరి.. చెవిరెడ్డి.. చెవులో పువ్వు
- లోకేష్ విమర్శలు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 30 : ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోని బెట్టింగ్‌స్టార్ బాలినేని శ్రీనివాసరెడ్డినిఈ ఎన్నికల్లో ఓడించాలని, అభివృద్ధికి చిరునామా అయిన డీజే (దామచర్ల జనార్దన్)ను ఎమ్మెల్యేగా గెలిపించాలని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గుంటూరురోడ్‌లో ఏర్పాటు చేసిన యువగళంలో లోకేష్ ప్రసంగిస్తూ సీనియర్ అంటూ చెప్పుకునే బాలినేని బెట్టింగ్ స్టార్ అని ఆరోపించారు. ఆయనకు విదేశాలలో పేకాడటం తప్ప, నియోజకవర్గ ప్రజల బాగోగులు పట్టవన్నారు. డబ్బుల కోసం ఇక్కడ గ్రానైట్ వ్యాపారులు, పలువురు నుంచి వసూళ్లు చేసే బాలినేనికి ఓటు వేస్తారో... లేక డవలప్‌మెంట్ చేసే దామచర్లను ఓటు వేస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. తాను పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్నపుడు ఒంగోలు నగరానికి అత్యధికంగా రూ.2600 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశామని తెలిపారు. ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని, ఎమ్మెల్యేగా దామచర్లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ వైసీపీ తరుపున పోటీ చేస్తున్న చంద్రగిరి, చెవిరెడ్డి.. చెవిలో పువ్వని, ఆయనను నమ్మవద్దని తెలిపారు. అక్కడి ప్రజలకు ఐదేళ్ళగా కనిపించకపోవడంతో తరిమేస్తే వచ్చి ఒంగోలులో పడ్డారని ఎద్దేవా చేశారు. బెట్టింగ్ స్టార్ బాలినేని ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధికి తాను ఏమి చేశారో చెప్పుకోలేని దీన స్థితిలో ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

అనంతరం దామచర్ల మాట్లాడుతూ టీడీపీ హయాంలో గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు 80శాతం పైపులైను పనులు చేయగా, వైసీపీ వచ్చాక ఒక్క అడుగు కూడా ఆ పనులు ముందుకు పడలేదన్నారు. అలాగే పోతురాజు కాలువ ఆధునీకరణకు టీడీపీ రూ.80 కోట్లు కేటాయించి పనులు చేపట్టగా, ఆ తర్వాత వైసీపీ ముగ్గురు కాంట్రాక్టర్లను మార్చి కమిషన్లు దండుకున్నారని విమర్శించారు. అలాగే టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని, అవసరం అయితే ఇంకా అర్హులకు 2 సెంట్లు భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. యువగళం పాదయాత్ర 2వేల మైలు రాయి వద్ద అండర్ డ్రైనేజి నిర్మాణం కోసం హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి రాగానే వాటి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని దామచర్ల లోకేష్‌ను కోరారు. ప్రజలు ఆశీర్వదించి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.


యువగళంలో మాట్లాడుతున్న నారా లోకేష్

కూడలిలో జగన్ సభ - జనం అగచాట్లు

టంగుటూరులో కఠిన ట్రాఫిక్ ఆంక్షలు

టంగుటూరు, ఏప్రిల్ 30 : సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా టంగుటూరులో మంగళవారం పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాటిని కఠినంగా అమలు చేయడంతో అంతా ఇబ్బందులు పడ్డారు. సభ జరిగే టంగుటూరు బస్టాండ్ కూడలికి ప్రవేశించే అన్ని మార్గాలను వారు కట్టుదిట్టం చేశారు. బస్టాండ్ సెంటర్ నుంచి ఒంగోలు వైపు ఫైర్ స్టేషన్ వద్ద, ఊరిలో నుంచి వచ్చే మార్గంలో మసీదు సెంటర్ వద్ద, సింగరాయకొండ వైపున, కొండపి రోడ్డులో బైపాస్‌ల వద్ద నుంచే ట్రాఫిక్ నియంత్రణలు అమలు చేశారు. వాహనాలను వేటినీ ట్రాఫిక్ ఆంక్షలు దాటి లోపలికి ప్రవేశించనీయ లేదు. పోలీసుల ట్రాఫిక్ ఆంక్షల దెబ్బకు సామాన్యులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్యాంకు ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను, జర్నలిస్టులను సైతం లోపలికి ప్రవేశించనీయలేదు. అప్సర థియేటర్‌కు ఎదురుగా వేదిక ఏర్పాటు చేసిన నేతలు వేదిక ముందు బారికేడ్లు నిర్మించి వాటికి అనుసంధానంగా రూప్ కట్టారు. బారికేడ్లు లోనికి ఎవ్వరినీ అనుమతించలేదు. సభ ప్రారంభానికి ముందు మాత్రమే ప్రజలను లోపలికి అనుమతించారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల పైకి ఎవ్వరినీ ఎక్కనియ్యలేదు. మేము ఫలానా అని చెప్పినా వినిపించుకోలేదు. ఉద్యోగులు బళ్లపై వారి కార్యాలయాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. కొందరైతే పొలాలకు అడ్డంగా నడచి గమ్య స్థానాలకు చేరుకున్నారు. మొత్తంగా వాహన చోదకులకు తిప్పలు తప్పలేదు.


ట్రాఫిక్ ఆంక్షలతో మూతవేసిన దుకాణాలు

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

సెంటర్‌కు బస్సులు వచ్చే వీలులేకుండా వాటన్నింటినీ దారిమళ్లించారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఒంగోలు నుంచి వచ్చే బస్సులను నేరుగా జాతీయ రహదారిలో బైపాస్‌లోనే తిప్పి దక్షణ బైపాస్‌లో గుండా బస్టాండ్‌కు అనుమతించారు. అలాగే సింగరాయకొండ వైపు బస్సులను కూడా. బస్టాండ్ నుంచి తిరిగి అదే మార్గంలో బయటకు వెళ్లాయి. దక్షిణ బైపాస్‌లో జాతీయ రహదారి ఎక్కి రెండు వైపులకు బస్సులు ప్రయాణించాయి. ఈవిషయం తెలియక చాలా మంది తికమకపడ్డారు. ఒంగోలు ఆసుపత్రులకు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారంతా తీవ్ర అవస్థలు పడ్డారు. వచ్చేందుకు అవకాశం లేదని చెప్పి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తప్పించుకోగా, కొందరైతే సభ ముగిసే వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. నానా అగచాట్లు పడి కొందరు వాహనాలను పట్టుకొని వెళ్లవలసిన ప్రాంతాలకు చేరుకున్నారు. ఎన్నికల డ్యూటీలోని ఉద్యోగులు నానా హైరాన పడ్డారు. మొత్తంగా బస్సులు ఎక్కాల్సిన ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం.


టంగుటూరు బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిఉన్న మహిళలు

ఉదయం నుంచే వ్యాపారాలు బంద్

టంగుటూరులోని రహదారి కూడలిలో ముఖ్యమంత్రి జగన్ ప్రచార సభ ఏర్పాటుతో ఉదయం నుంచి వ్యాపారాలకు పోలీసులు అనుమతించలేదు. వ్యాపారులు తమ అంగళ్ల వద్ద కూర్చునేందుకు కూడా కుదరదంటే కుదరదన్నారు. వ్యాపారులు సైతం వారి దుకాణాలకు దూరంగా నిలబడాల్సి వచ్చింది. వ్యాపారాలు లేక వారంతా తీవ్రంగా నష్టపోయారు. ఊరిలోనే సభకు అనుమతించడంతో వ్యాపారాలన్నీ మూతవేసుకోవాల్సి వచ్చిందని వారంతా వాపోయారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు వ్యాపారాలు నిలిచిపోవడంతో వ్యాపారులు అసహనం వ్యక్తంచేశారు.


పార్టీలో చేరిన జాగర్లమూడి సోదరులు

టీడీపీలో చేరిన జాగర్లమూడి సోదరులు

మర్రిపూడి, ఏప్రిల్ 30 : మండల సీనియర్ నాయకులు మర్రిపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు జాగర్లమూడి రామారావు సోదరులు జాగర్లమూడి సుబ్బారావు, మాన్నేని తిరుపతయ్య, వెంకటేశ్వర్లు స్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. అంతకు ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు గురిజాల బాబురావు ఆధ్వర్యంలో స్వామిని కలిసి సంఘీభావం ప్రకటించారు.

ఓటు హక్కుపై అవగాహన

కొండపి, ఏప్రిల్ 30: స్వీప్ కార్యక్రమంలో భాగంగా కళాకారులు ఓటర్లకు ఓటు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ మంగళవారం కొండపిలోని బస్టాండ్ ఆవరణలో కళారూపాలను ప్రదర్శించారు. మేలుకొలుపు పేరుతో ఓటు ప్రాముఖ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాకారులు, స్వీప్ నోడల్ అధికారి విక్టోరియారాణి, వీఆర్వో సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఓటు ప్రాముఖ్యతను వివరిస్తున్న కళాకారులు

టీడీపీలో చేరిన కొత్తపట్నం, పాదర్తి మాజీ సర్పంచ్‌లు

- లోకేష్ సమక్షంలో పార్టీ తీర్థం

కొత్తపట్నం (ఒంగోలు నగరం), ఏప్రిల్ 30 : మండలంలోని కొత్తపట్నం, పాదర్తి పంచాయతీల మాజీ సర్పంచ్‌లు మూగ ధనమ్మ, మూగ వెంకటేశ్వర్లు మంగళవారం టీడీపీలో చేరారు. ఒంగోలు పర్యటనకు వచ్చిన నారా లోకేష్ సమక్షంలో వీరిద్దరూ ఆపార్టీ తీర్థంపుచ్చుకున్నారు. భార్యాభర్తలైన వెంకటేశ్వర్లు, ధనమ్మ వైసీపీ ఆవిర్భావం నుంచి ఆపార్టీలో కొనసాగుతున్నారు. కొంతకాలంగా స్థానిక వైసీపీ నాయకులతో మూగ వెంకటేశ్వర్లు పలు అంశాల్లో విభేదిస్తూ వస్తున్నారు. ఈనేపథ్యంలో వెంకటేశ్వర్లు టీడీపీలో చేరారు. ఇప్పటికే మండలంలో వైసీపీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఎన్నికలకు ముందు బీసీ వర్గానికి చెందిన వెంకటేశ్వర్లు దంపతులు పార్టీని వీడటం పెద్ద ఎదురుదెబ్బ కానుంది.

ఆస్తులు కొల్లగొట్టేందుకే ల్యాండ్ టైటిలింగ్

అద్దంకి, ఏప్రిల్ 30 : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ఆస్తులను కొల్లగొట్టేందుకు జగన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని, అది అమలైతే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవా రం రాత్రి మైలవరం, ఏలేశ్వరవారి పాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల ఆస్తులను లాక్కునే కుట్రలో రిజిస్ట్రేషన్ వ్యవస్థను తొలగించి జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తీసుకొచ్చా రన్నారు. ప్రజల ఆస్తుల ఒరిజనల్ పత్రాలు జగన్ వద్ద ఉంచుకొని ప్రజలకు జిరాక్స్ పేపర్‌లు ఇస్తారన్నారు. టీడీపీ రాగానే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రుద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో బైరపునేని సత్యనారాయణ, భీమని లక్ష్మీనారాయణ, కరి పరమేష్, మానం మురళీమోహన్ దాస్ పాల్గొన్నారు.

ఆహుతైన అరటి తోట

బల్లికురవ, ఏప్రిల్ 30 : మండలంలోని కొప్పెరపాలెంలో మంగళవారం వాకా వెంకటేశ్వరరెడ్డికి చెందిన రెండు ఎకరాలలో ఉన్న అరటి తోట అగ్నికి ఆహుతైంది. అర టి తోటలో మంటలు చెలరేగడంతో పంటపొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు గమనించి వెంటనే సమాచారాన్ని రైతుకు అందించారు. అప్పటికే అరటి పంట మెత్తం కాలిపోయింది. రూ.4లక్షల మేర పంట నష్టం జరిగింది.

ఓటరు మారాజా వందనం...!



తురిమెళ్లలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పగడాల పెద్దరంగస్వామి

కంభం, ఏప్రిల్ 30 : సాధారణ రోజుల్లో ఎమ్మెల్యేను కలవాలంటే అంత ఆషామాషీకాదు! ఆయన ఎక్కడున్నారో.. ఏ సమయాన అందుబాటులో ఉంటారో సమాచారం తెలుసుకుని ఎమ్మెల్యే ఇంటికెళ్లి గంటలకొద్దీ పడిగాపులు కాస్తేకానీ కలిసే అవకాశం రాదు.. ఆ తర్వాత అయినా మన సమస్యను సావదానంగా వింటారా, లేదా అన్నది చెప్పలేం.. మరి ఇప్పుడు ఎన్నికల కాలమాయే..! పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటరు దేవుళ్లు అంటూ ఊళ్లల్లోకి పరుగెడుతున్నారు.. జనాలు ఏ మూలన ఉన్నా, ఏ సందులో ఉన్నా వెతికి వారి వద్దకెళ్లి దండాలు పెట్టి గెలిపించాలని ప్రాథేయపడుతున్నారు. ఇలాంటి ఘటనే కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం వేళ చోటుచేసుకొంది. కాంగ్రెస్ అభ్యర్థి పగడాల పెద్దరంగస్వామి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, గ్రామంలో వీధిలో కూర్చొని ఉన్న పెద్దల వద్దకు వెళ్లారు. అప్రయత్నంగానే 'ఓటరు మహాశయ వందనం' అంటూ అభ్యర్థి నమస్కరించగా, ఆ ఓటరు మహాశయుడు మాత్రం కాలుమీద కాలేసుకొని దర్జాగా కూర్చొని కరపత్రం అందుకున్నాడు. పెద్దరంగస్వామి కరపత్రం అందజేసి మరోసారి నమస్కరించి కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని వేడుకుంటూ ముందుకు సాగారు.

ఎన్నికల నిబంధనలు బేఖాతరు

చెవిరెడ్డి పేరుతో గ్రామాల్లో మంచినీటి ట్యాంకర్



త్రిపురాంతకం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వెల్లంపల్లి గ్రామంలో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న నాలుగు మంచినీటి ట్యాంకర్లకు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు ఉన్న స్టిక్కర్‌ను అంటించి నడుపుతున్నారు. ఈ ట్యాంకరుతో ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేస్తున్నారు. త్రిపురాంతకంలో కూడా కొన్ని ట్యాంకర్లకు ఇలానే స్టిక్కర్లు అంటించి నడుపుతున్నారు. అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడడంలేదు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నా అధికారులు అది తమపని కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. -త్రిపురాంతకం

కోడ్ ఉల్లంఘనకు 'సిద్ధం'



జాతీయ రహదారిలోని పద్మటవర్స్ వద్ద వైసీపీ హోర్డింగ్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, అధికార వైసీపీకి మాత్రం ఆ చట్టాలు చట్టాలుగా మారాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలను సైతం లెక్కచేయకుండా యథేచ్ఛగా జగన్ బొమ్మతో ఉన్న సిద్ధం భారీ హోర్డింగ్‌లు ఒంగోలు నగరమంతా దర్శనమిస్తున్నాయి. ఇక్కడే వైసీపీ నేతలు ట్విస్ట్ ఇస్తున్నారు. కొన్నింటికి మాత్రమే అనుమతులు తీసుకుని, వాటి ముసుగులో మరికొన్ని హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. మొత్తం 19 ప్రధాన కూడళ్లలో వైసీపీ హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతి తీసుకుని కొన్ని.. అనుమతి లేకుండా మరికొన్ని ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు, తమ పార్టీ పేరు ప్రజల్లో నిత్యం కనిపించేందుకు వైసీపీ నానాఅగచాట్లు పడుతోందని అర్థమవుతోంది. అనుమతి లేని హోర్డింగ్‌లపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. - ఒంగోలు (కార్పొరేషన్)

మద్యం అమ్మకాలలో వివక్ష



అద్దంకిలో బెల్ట్‌షాపులో పట్టుబడ్డ మద్యం బాటిళ్లు (ఫైల్)

అద్దంకి, ఏప్రిల్ 30 : రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా మద్యాన్ని తయారు చేసి నేరుగా అమ్ముతూ వ్యాపారం చేస్తోంది. ఆ షాపులలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులే. ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో మందు అమ్మకాల్లో వైసీపీ నేతలు అడిగినంత ఇస్తూ.. టీడీపీ నేతలపై వివక్ష చూపుతున్నారు. అద్దంకి నియోజకవర్గంలో 26 ప్రభుత్వ మద్యం షాపులు ఉన్నాయి. వీటిల్లో పనిచేసే సిబ్బంది, సూపర్‌వైజర్లకు ఆయా గ్రామాల వైసీపీ నేతలతో అనుబంధం ఉండడంతో వారు అడిగితే మాత్రం కావాల్సినంత మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. అదే సమయంలో ప్రతిపక్ష నేతలకు మద్యం సరఫరాపై అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉండడంతో ఇచ్చేందుకు నో చెప్తున్నారు. కొన్ని చోట్ల ప్రతిపక్ష నేతలు మద్యం కొనుగోలు చేస్తే వెనువెంటనే అధికార పార్టీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేసి దాడులు చేయిస్తున్నారు. అదే సమయంలో అధికారపార్టీ నేతలు ఇబ్బడిముబ్బడిగా మద్యం తీసుకెళ్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు అందినా సరైన సమయంలో స్పందించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో సిబ్బంది, సూపర్‌వైజర్లు ఒక్కో కేసు(48 బాటిళ్ల)కు అదనంగా వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా రోజు ఒక్కొక్కరు రూ.10వేల వరకు వెనుకేసుకుంటున్నట్లు సమాచారం.

భారీగా హాజరైన మహిళలు

కొండపి, ఏప్రిల్ 30 : నందమూరి బాలకృష్ణ చేపట్టిన స్వర్ణాంధ్ర సాకారయాత్ర ర్యాలీ, సభ మంగళవారం సాయంత్రం మర్రిపూడిలో దిగ్విజయంగా జరిగింది. సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. సాయంత్రం 5 గంటలకు మర్రిపూడిలో వాహనంపై నుంచి ర్యాలీగా ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య ఇతర నాయకులతో బాలకృష్ణ ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ సెంటర్‌లో సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక





మర్రిపూడిలో సభకు హాజరైన అశేష జనం(ఇన్‌సెట్లో) బాలకృష్ణకు గజమాలతో సత్కారం, పక్కన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే స్వామి, సత్య

యువ కేరింతలు

బాలయ్య పంచ్ డైలాగులతో జోష్ నింపిన సాకార యాత్ర

వాహనంపై నుంచి మాట్లాడారు. తొలుత నియోజకవర్గంలోని అన్ని మండలాలను పేర్లతో సహా పలికి అన్ని మండలాల నుంచి వచ్చిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మర్రిపూడి లక్ష్మీనరసింహస్వామి, సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామిలను గుర్తు చేసుకున్న బాలకృష్ణ తాను నరసింహస్వామి భక్తుడినని అన్నారు. నారసింహ శ్లోకం చదవారు. ఆద్యంతం గ్రాంధిక, సంస్కృత శ్లోకాలు, వ్యవహారిక పంచ్ డైలాగులతో బాలకృష్ణ ప్రజలను ఆకట్టుకున్నారు. ఎక్కడా తడబడకుండా, తడుముకోకుండా, పేపరు చూడకుండా మాట్లాడి బాలకృష్ణ ప్రజలను ఆశ్చర్యపరిచారు. తన తండ్రి ఎన్‌టీఆర్ అంటే ఒక్కోఅక్షరానికి పది రకాల ట్యాగ్‌లను చెప్పి అలరించారు. అదేవిధంగా తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదిలిరా.. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు, తాను పూజారిని మాత్రమేనని తన తండ్రి రామారావు డైలాగులను చదివి వినిపించారు. మర్రిపూడిలో ఆకాశానికి చిల్లులు పడ్డాయా? లేక నేల ఈనిందా? ఇసుకేస్తే రాలనంత జనం అంటూ కేరింతలు కొట్టించారు. జగన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ 'కనకపు సింహాసనమున శునకం' అంటూ ప్రారంభించారు. పిచ్చోడు. వెదవ, సైకో చేతిలో రాష్ట్రం నాశనం అయిపోయిందని విమర్శించారు. తన చెల్లి డాక్టర్ సునీత అన్నా ప్లాస్టర్ తీయకపోతే సెప్టిక్ చేస్తుందని చెప్పడంతో ప్లాస్టర్ తీశాడని జగన్‌ను ఉద్దేశించి బాలకృష్ణ అన్నారు.

అప్పుడు గొడ్డలిపోటు, కోడికత్తి.. ఇప్పుడు గులకరాయి

2019లో బాబాయి గొడ్డలి, కోడికత్తి, ఇప్పుడు గులకరాయి అంటా అని బాలకృష్ణ వ్యంగ్యంగా అనడంతో జనం పెద్దపెట్టున కేకలు వేశారు. ఒక్కచాన్స్ అని అన్ని వ్యవస్థలను నాశనం చేశాడని విమర్శించారు. రాష్ట్రం అప్పులు 12లక్షల కోట్లకు చేరాయని, రెండు లక్షలా ముప్పైవేల కోట్లు జనానికి ఇస్తే మిగతా డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. పరిశ్రమలు రాలేదు. ఉన్నవి పక్క రాష్ట్రాలకు వెళ్లగొట్టారు. ఉద్యోగాలు లేవు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావు, సీపీఎస్ రద్దు లేదు. మద్య నిషేధం లేదు. ఉచితంగా దొరికే ఇసుకకు డిమాండ్ పెంచి దోచుకుతిన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారు. డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగితే ప్రాణాలు తీశారు. ఇలా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు వైసీపీ పాలనలో జరిగాయని బాలకృష్ణ ఎత్తిచూపారు. అంబేడ్కర్ విదేశీ విద్యకు ఆ పేరు తీసేసి జగన్ పేరు పెట్టుకున్నాడని, అంబేడ్కర్ కంటే జగన్ గొప్పవాడా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ పేరు పెడతామని, ఎస్సీ, సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీలకు ఖర్చు పెడతామని, ఎస్సీ విద్యార్థులకు కోచింగ్ ఇస్తామని, కార్పొరేషన్ రుణాలు కొనసాగిస్తామని బాలకృష్ణ అన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో మహిళలకు, బీసీలకు, ఎస్సీలకు, యువకులకు ప్రకటించిన పథకాలు అమలు చేస్తామన్నారు.

గట్టివాడు స్వామి..

పొట్టివాడైన స్వామి చాలా గట్టివాడని బాలకృష్ణ కితాబు ఇచ్చారు. అసెంబ్లీలో స్పీకర్‌ను గడగడలాడించాడన్నారు. కొండపి గడ్డ అంటే ఇలానే ఉండాలి. గడ్డ బిడ్డ అనేది అదే. నిలదీయాలి. అడగాలి. జనం తరపున స్వామి పనిచేస్తున్నాడని ప్రశంసించారు. అదేవిధంగా పొగాకు మాలతో తనకు స్వాగతం పలికారని పొగాకు వాసన అబ్బ కమ్మగా ఉంది. వీరసింహారెడ్డి సినిమా గుర్తుకు వచ్చిందని బాలకృష్ణ అన్నారు. మీసం తిప్పాలని జనం కోరుతున్నారని, తిప్పాలని స్వామి బాలకృష్ణను కోరారు. బాలకృష్ణ నీ మీసం తిప్పు అంటూ స్వామి మీసాన్ని తిప్పబోయారు. దీంతో జనం కేరింతలు కొట్టారు. మొత్తంగా బాలకృష్ణ ప్రసంగం ఆసక్తిగా, వినసొంపుగా, విపులంగా సాగడంతో దాదాపు గంటపాటు జనం కదలకుండా ప్రసంగాన్ని విన్నారు. 'కార్యా తురానాం.. న నిద్ర, నసుఖం' అన్నారు. అంటే తెలుసుగా.. మరో 13 రోజులు నిద్ర, సుఖం ఉండకూడదు. జాగ్రత్తగా ఉండాలి. అన్ని విషయాలను గుర్తుంచుకుని రాష్ట్ర భవిష్యత్ కోసం ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, కొండపి ఎమ్మెల్యేగా స్వామిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి అక్కడ శేషాచలం ఖాళీచేశారని, ఇక్కడ నల్లమల అడవులపై పడతాడన్నారు. ఆపార్టీ కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి అవినీతిలో భాగస్తుడని, అవినీతి సొమ్మును తరలించాడని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ, ముస్లింలకు రిజర్వేషన్ అంశాలను కూడా బాలకృష్ణ ప్రస్తావించారు. 1.15 నిమిషాలకు మర్రిపూడి చేరుకున్న బాలకృష్ణ పార్టీ నాయకులతో పిచ్చాపాటీ మాట్లాడారు. పలువురితో సెల్ఫీలు దిగారు. స్థానికంగా, కొండపి నియోజకవర్గంలో ప్రత్యేకతలను స్వామి, సత్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల విధులంటేనే బెంబేలు

మహిళలకు కూడా 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలు అటాచ్

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 30 : జిల్లాలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధులంటనే అధికారులు, హెచ్‌ఎంలు, టీచర్లు బెంబేలెత్తుతున్నారు. ఒంగోలు నగరంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, టీచర్లకు సుదూర ప్రాంతాల్లో ఎన్నికల విధులకు కేటాయించారు. నగరంలో పనిచేస్తున్న వారు 150 కిలోమీటర్ల దూరానికి పైగా ఉన్న యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు నియమించడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇచ్చేది నామమాత్రపు పారితోషికం.. ఎన్నికల విధులకు హాజరై రావాలంటే కనీసం వెయ్యి రూపాయాలకు పైగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది.. అంత దూరాన ఉన్న పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం ఎలా అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధులు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు ఉదయం 9 గంటలకు పీవో, ఏపీవో, ఓపీవోలందరూ చేరుకోవాలి. తీరా ఉత్తర్వులు వచ్చాక చూసుకుంటే సుదూర ప్రాంతాలకు వేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తాము పనిచేస్తున్న స్థానం, తాము నివాసం ఉండే నియోజకవర్గాలు మినహాయించి పక్కనే ఉన్న నియోజకవర్గాల్లో నియమిస్తామని అధికారులు చెప్పారు. ఆ మేరకు ఉద్యోగులు నివాస ప్రాంతాల్లో ఓటు హక్కు ఉన్న ప్రాంత వివరణలు కూడా ముందే సేకరించారు. ఈ వివరాలన్నింటినీ కంప్యూటరీకరణ కూడా చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ఎంత మంది సిబ్బంది అవసరమో దాని ప్రకారంగా కలెక్టర్ కార్యాలయంలోని నిక్‌సెంటర్ ద్వారా సిబ్బందిని ర్యాండమ్‌గా ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. దీంతో సిబ్బంది సుదూర ప్రాంతాలకు విసిరివేసినట్లు అయ్యింది. ఎన్నికల డ్యూటీ చేసేందుకు తమకు అభ్యంతరం లేదని, అసలు ఆయా నియోజకవర్గాలకు ఎలా చేరాలన్నదే తమను వేధిస్తుందని మహిళా ఉద్యోగులు వాపోతున్నారు. ఎన్నికల విధులకు నియమితులైన పీవో, ఏపీవో, ఓపీవోలు అందరూ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలకు చేరుకోవాల్సిందే. ఎన్నికల విధులు నిర్వహణకు మే 12న ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు చేరుకోవడం ఎలా అన్నదే సిబ్బందిని వేధిస్తోంది. బస్సుల్లో ఒంగోలు నుంచి దూర ప్రాంతాలైన గిద్దలూరు, వైపాలెం, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాలకు సిబ్బందిని ఎక్కించుకొని పోయేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళలకు చుక్కలు

ఎన్నికల విధులకు నియమితులైన మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చుక్కలు చూపించారు. ఒంగోలులో పనిచేసే మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులు కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు కేటాయించారు. వీరికి డ్యూటీల కేటాయింపులో అధికారులు మొదట చెప్పిన దానికి భిన్నంగా జరిగింది. మహిళా ఉద్యోగులకు సమీప నియోజకవర్గాల్లోనే నియమిస్తామని చెప్పారు.



సీఎం మీటింగ్‌లకు ఇం'ధన'మే...!

కొండపి నియోజకవర్గంలో జగన్ బహిరంగ సభకు స్పందన అంతంతే



మాట్లాడుతున్న జగన్

కొండపి, ఏప్రిల్ 30 : లక్షల కోట్ల రూపాయలు పేదలకు పంచానని చెప్పుకున్న జగన్ సభలకు జనం కరువయ్యారు. టంగుటూరులో మంగళవారం జరిగిన సభకు జనం పెద్దగా రాలేదు. భారీగా వాహనాలు, మద్యం, భోజన వసతులు కల్పించినా నాయకుల అంచనాలు తలకిందులయ్యాయి. జనాలకు పంచిన దానికంటే జగన్ కొల్లగొట్టిన వనరుల విలువే ఎక్కువని జనం భావిస్తున్నారని, అందువల్లనే జనం ఎంత డబ్బు ఇచ్చినా, ఎన్ని వసతులు కల్పించినా రావడం లేదన్న ప్రచారం సభా ప్రాంగణంలోనే వినవచ్చింది. టంగుటూరు గ్రామ పంచాయతీలోని ఓ ప్రాంతం నుంచి వచ్చిన మహిళలకు తీసుకువచ్చిన మేస్త్రీ హాజరు వేయడం కనిపించింది. అదేవిధంగా 11.30 నిమిషాల వరకు కూడా జనం పెద్దగా మీటింగ్ ప్రదేశానికి రాలేదు. తర్వాత కొద్దికొద్దిగా రావడం ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం టంగుటూరులోని శింగరాయకొండ, కొండపి, ఒంగోలు రోడ్డు కూడలి ప్రాంతంలో బస్సు పైనుంచి సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించారు. సీఎంవో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 11 గంటల నుంచి 11.45వరకు మీటింగ్ టైమ్‌గా ప్రకటించారు. ఆ సమయానికి జనం లేకపోవడంతో 11.40 నిమిషాలకు మీటింగ్ ప్రాంతానికి సీఎం చేరుకున్నారు. 11.49 నిమిషాలకు ప్రసంగం ప్రారంభించిన జగన్ 12.22 నిమిషాలకు ముగించారు.

జగన్ తీరుపై పెదవి విరుపు

టంగుటూరు, ఏప్రిల్ 30 : సీఎం జగన్ సభ సమస్తం విమర్శలకే పరిమితమైంది. సభ ద్వారా చంద్రబాబును విమర్శించడమే పనిగా పెట్టుకున్న ఆయన హావభావాలు చూసిన జనం ఇదేం ఎన్నికల సభఅంటూ చర్చించుకోవడం కనిపించింది. గ్రామస్వరాజ్య ప్రధాతను నేనే.. సంక్షేమ పథకాల అమలు, పింఛన్లు, విద్య, వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చానని చెప్పుకున్నారు.

ఎన్నికల ప్రచారంలో మాగుంట కుటుంబ సభ్యులు



సింగరాయకొండలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సహనరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30 : ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలుపే లక్ష్యంగా ఆయన కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మాగుంట తనయుడు రాఘవరెడ్డి సతీమణి చందనరెడ్డి మంగళవారం యర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు కుమార్తె డాక్టర్ గుదూరి చెల్సియాతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో సైకిల్‌గుర్తుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరోవైపు సింగరాయకొండలో మా గుంట శ్రీనివాసులరెడ్డి మరదలు సహనరెడ్డి, చెల్లెలు సుధ, మేనకోడలు ప్రణతిరెడ్డి, రజితరెడ్డిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాగుంట శ్రీనివాసులరెడ్డి, స్వామిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల కోడ్‌లోనూ కాలువలు, రోడ్డు నిర్మాణ పనులు

వైసీపీ నేతల ఉల్లంఘనలను పట్టించుకోని అధికారులు



చింతలపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం

తాళ్లూరు, ఏప్రిల్ 30 : ఎన్నికలకోడ్ వచ్చిన తరువాత నిర్మాణ పనులు చేపట్టరాదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలున్నా అధికారపార్టీ అండతో చింతలపాలెం వైసీపీ నేతలు సీసీరోడ్లు, మురుగు కాలువ పనులు చేపట్టారు. వీటి నిర్మాణానికి జడ్పీ గ్రాంట్ నుంచి మూడునెలల క్రితం రూ.15 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు అన్ని అనుమతులు పొందేటప్పటికీ ఎన్నికలకోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల నియమావళి ప్రకారం నిధులు మంజూరై ప్రారంభంకాని పనులను చేపట్టవద్దని స్పష్టంగా అధికారులు ఆదేశించినా ఆ గ్రామవైసీపీ నేతలు తమకేమి కాదన్న ధీమాతో 25 రోజుల క్రితం నిర్మాణ పనులు చేపట్టారు. ఆ తర్వాత పది రోజులు పనులు చేయకుండా ఉండి, మళ్లీ రెండు రోజుల నుంచి సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఎన్నికలకోడ్ అమలులో ఉన్నా ఇంజనీరింగ్ అధికారులు పనులు చేయించటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ నేతలకు అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తూ పనులు చేయిస్తున్నారని ప్రతిపక్షనేతలు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆంధ్రజ్యోతి సంప్రదించగా పంచాయతీ నిధుల నుంచి ఏ పనులు జరగటం లేదన్నారు.

వైసీపీ ప్రచారంలో వీవోఏ



బూచేపల్లి సతీమణి నందిని ప్రచార కార్యక్రమంలో వీవోఏ పద్మ

తాళ్లూరు, ఏప్రిల్ 30 : ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు ఉద్యోగులు దూరంగా ఉండాలన్న ఆదేశాలు తాళ్లూరు మండలంలోని పలువురు ఉద్యోగులు పట్టించుకోవటం లేదు. తూర్పుగంగవరం గ్రామంలో మంగళవారం దర్శి వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందిని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చెందిన వైకేపీ వీవోఏ డి.పద్మ ఆమెతోపాటు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు.

లక్ష్మీనరసింహస్వామిపై భక్తిని చాటుకున్న బాలయ్య

మర్రిపూడి, ఏప్రిల్ 30 : లక్ష్మీనరసింహస్వామిపై సినీనటుడు బాలకృష్ణకు అపారమైన భక్తిభావం ఉన్న విషయం తెలుగు ప్రజలందరికీ తెలిసిందే. మంగళవారం పృధులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వెళ్లే రహదారి పక్కనే ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ఆయన దిగారు. ఆ సమయంలో ఎమ్మెల్యే స్వామి, యువనేత దామచర్ల సత్యలు పృధులగిరి లక్ష్మీనరసింహస్వామి విశిష్టతను ఆయనకు తెలియజేశారు. అంతే కాకుండా సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాల్లో ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల ప్రాశస్త్యాన్ని వివరించారు. దీంతో స్పందించిన బాలయ్య సభ ప్రారంభానికి ముందు లక్ష్మీనరసింహస్వామిని స్మరిస్తూ 3 నిమిషాలు గుక్కతిప్పుకోకుండా లక్ష్మీనరసింహుడి స్తోత్రాన్ని వల్లెవేయడం అశేష జనసందోహాన్ని ఉత్సాహపరిచింది. గురజాడ, వేమన సూక్తులను అనర్గళంగా ప్రసగించడం సభికులను ఆకట్టుకుంది. ప్రాసలో ఆయన మాట్లాడిన తీరు సభికులను ఆలోచనరేకెత్తించింది. అంతకు ముందు రోడ్‌షోలో వచ్చిన వాహనంపై నుంచి ప్రచార రథంపైకి బాలకృష్ణ అలవోకగా దూకడంతో ప్రజలు జైబాయ్య.. జైజైబాలయ్య.. అంటూ నినాదాలు ఇచ్చారు. ఆరుపదుల వయసులో సైతం బాలయ్య దూకడం ప్రజలు చర్చించుకోవడం కనిపించింది. మహిళలు సైతం జెండాలు చేబూని ఉత్సాహంగా కేరింతలు వేశారు. హెలిప్యాడ్ వద్ద మహిళలు, చిన్నారులతో సరదాగా ఫొటోలు దిగారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తాం

● ఎన్‌డీఏ కూటమి నేతల సమావేశంలో అభ్యర్థులు, అశోక్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి ● టీడీపీలో పలువురి చేరికలు


అభివాదం చేస్తున్న అశోక్‌రెడ్డి, మాట్లాడుతున్న మాగుంట

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 30 : ఆశీర్వదించి మమ్ములను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాది అని ఎన్‌డీఏ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని విరా సుబ్బరత్నం కళ్యాణ మండపం వద్ద గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రానున్నద న్నారు. వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు, సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. పశ్చిమ ప్రకాశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలన్నారు. ఇదే డిమాండ్‌ను గతంలో టీడీపీ ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినప్పటికీ ఈప్రాంత వాసుల సమస్యను జగన్ ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. రేపు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించి అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గిద్దలూరు పట్టణంలో రాచర్ల రైల్వేగేటు సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం చేస్తామన్నారు. సగిలేరు వాగు మరమత్తులను కూడా చేపట్టి పట్టణానికి ముంపురాకుండా చర్యలు చేపడ తామన్నారు. టీడీపీ హయాంలో అశోక్‌రెడ్డి కృషితో అభివృద్ధి జరిగిందని, నాటి అభివృద్ధి తప్ప ఈ ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి జరుగలేదన్నారు. జిల్లాలో మాగుంట కుటుంబానికి ప్రజలకు ఎంతో అన్యోన్య బంధం ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తాను స్థానికుడినని, ఈ ప్రాంత కష్టనష్టాలు తనకు తెలుసని అన్నారు. ప్రజల ఆశీస్సులు అందించి తమను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్ యాదవ్, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు, కటికె యోగానంద్, మాజీ జడ్పీటీసీ కుప్పా రంగనాయకులు ఉన్నారు.


టీడీపీలో చేరుతున్న యువకులు

టీడీపీలో పలువురి చేరిక

గిద్దలూరు టౌన్ : టీడీపీకి ఆకర్షితులై పలువురు మంగళవారం టీడీపీలో చేరారు. వారందరికీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గిద్దలూరు పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ సయ్యద్ రఫీబ్ తన అనుచరులతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మే 13న జరిగే ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసరెడ్డి, ముత్తు ముల అశోక్‌రెడ్డి గెలుపుకు తామంతా కృషి చేస్తామ న్నారు. సమాజ్‌వాది పార్టీ మహిళ నాయకురాలు అడపాల నాగమణి మంగళవారం టీడీపీలో చేరగా ఆమెతోపాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా. నాగమణి మాట్లాడుతూ సమాజ్‌వాది పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశానని, అశోక్‌రెడ్డి గెలుపు కోసం నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నట్లు తెలిపారు. అశోక్‌రెడ్డి విజయానికి తామంతా కృషి చేస్తామన్నారు. అలాగే పట్టణంలోని 7వ వార్డుకు చెందిన 50 మంది యువకులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ తామందరికీ కొత్తగా ఓటు హక్కు వచ్చిందని, ఈ రాష్ట్ర భవిష్యత్తు, యువత భవిష్యత్తు టీడీపీతోనే చైతన్యవంతంగా ఉంటుందని నమ్మి తాము ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా పార్టీలో చేరినట్లు తెలిపారు. మాగుంట, ముత్తుముల విజయానికి కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన మద్దికట్ల నరేంద్ర, ఓదెల మనోహర్, అఖిల్, రాజేష్, డేవిడ్, శ్రీను, ప్రసన్నకుమార్, అనీల్, ఇజ్రాయెల్, భాస్కర్, ఓబయ్య, కిశోర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


సయ్యద్ రఫీబ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి, మాగుంట

యర్రబాలెంలో ఇంటింటి ప్రచారం

కంభం : కంభం మండలం యర్రబాలెం గ్రామంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి తమ్ముడు ముత్తుముల జగన్నాథరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి సైకిల్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

వైసీపీని వీడి టీడీపీలోకి వలసలు


పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, ఏప్రిల్ 30: మండలంలోని లేళ్లపల్లి గ్రామ ఎస్సీకాలనీకి చెందిన 30 ఎస్సీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కొత్తగా పార్టీలో చేరిన వారికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నమ్మి అందరూ టీడీపీలోకి చేరుతున్నారన్నారు. కొత్తగా పార్టీలోకి చేరినవారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, ఎం.అల్లూరిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, ఎం.వలరాజు, పోలా శ్రీనివాసరెడ్డి, పోలా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో గిద్దలూరు క్రీడాకారుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గిద్దలూరు, ఏప్రిల్ 30 : కర్నూలులో జరిగిన రాయలసీమ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో గిద్దలూరుకు చెందిన టెన్నిస్ క్రీడాకారులు పలు విభాగాలలో విజయం సాధించారు. 8 సంవత్సరాల విభాగంలో యశోదదేవి, 12 సంవత్సరాల బాలికల విభాగంలో భావనదేవి, బాలుర విభాగంలో సయ్యద్ సాహిల్‌లు విజేతలుగా నిలిచారు. 14 సంవత్సరాల డబుల్స్ విభాగంలో సన, భావనదేవిలు విజేతలుగా నిలిచారు. బాలుర డబుల్స్‌లో సదాజిత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి రన్నర్స్‌గా నిలిచారు. వీరందరినీ స్థానిక టెన్నిస్ కోర్టులో జిల్లా లాన్‌టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జీకే.మోహన్‌రెడ్డి, సి.హెచ్.రంగారెడ్డి అభినందించి కోచ్ మురళి మోహన్‌రెడ్డిని సన్మానించారు.

పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ


మాట్లాడుతున్న ఆర్‌వో నాగజ్యోతి

గిద్దలూరు, ఏప్రిల్ 30 : పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి శిక్షణ ఇచ్చారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, తిరిగి తీసుకోవడం, హోం ఓటింగ్ వంటి పలు అంశాలను వివరించారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ డి.పద్మావతి, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి, గిద్దలూరు, కంభం తహసీల్దార్లు సిద్దార్థ, రామయ్య వివిధ అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం


● ప్రమాదవశాత్తు ఎగిసిపడిన మంటలు
● సుమారు మూడు లక్షల ఆస్తినష్టం


దుకాణంలో దగ్ధమవుతున్న ఉపకరణాలు

పొదిలి, ఏప్రిల్ 30 : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో సుమారుగా మూడు లక్షల ఆస్తినష్టం జరిగింది. వివరాల్లోకి వెళితే కాంప్లెక్స్‌లో ఎలక్ట్రానిక్ షాపు దాని ముందు ఆర్టీసీ టికెట్ బుకింగ్ పాయింట్ ఉంది. ఎలక్ట్రానిక్ షాపు యజమాని కూలర్‌లు వచ్చిన అట్టపెట్టెలు షాపు ప్రక్కన పగలు నిల్వ ఉంచి రాత్రివేళ షాపులోకి సర్దుకుంటాడు. ఈక్రమంలో ఎవరో ఆకతాయిలు సిగరెట్, బీడి కాల్చుకొని అట్టపెట్టెలపై వేశాడు. దీంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. అదే ప్రమాదంలో పక్కనే ఉన్న గురు ఆర్టీసీ టికెట్ బుకింగ్ పాయింట్ ఉంది. మంటలు ఎగిసిపడటంతో బుకింగ్ పాయింట్ విద్యుత్ తీగలు వేడికి షార్ట్‌సర్క్యూట్ కావడంతో బుకింగ్ పాయిట్‌లో ఉన్న కంప్యూటర్లు, ఇన్వెర్టర్, ఫర్నీచర్ పూర్తిగా కాలి బూడిదైంది. ఈప్రమాదంలో సుమారుగా రెండు లక్షలు నష్టం జరిగినట్లు యజమాని తెలిపారు. బుకింగ్‌పాయింటే జీవనాధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు. ఉన్న ఒక్క ఆధారం బుగ్గిపాలైందని యజమాని జేకే.విశ్వనాథం వాపోయారు. జీవనాధారం కోల్పోయానని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

చెన్నునికి తప్పని ట్రాఫిక్ తిప్పలు

● అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకల


రద్దీ వీధుల్లో నిలిచిన ట్రాఫిక్

మార్కాపురం, ఏప్రిల్ 30: మార్కాపురంలో పోలీస్ వ్యవస్థ ఉందా? ఉంటే పని చేస్తుందా? అనే ప్రశ్నలు నిత్యం ప్రజల మదిలో తలెత్తుతున్నాయి. చిన్న చిన్న అవసరాల కోసం బజారుకు వస్తే తలెత్తే ఇబ్బందులు సామాన్యంగా లేవు. నడుచుకుంటూ వచ్చే సామాన్యుడు, ద్విచక్ర వాహనాలపై వచ్చే మధ్య తరగతి వర్గాల వారి సమస్యలు అన్నీ ఇన్ని కావు. రోడ్లపై ఎక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుందో? తెలియని పరిస్థితి. ప్రజల పరిస్థితి ఇలా ఉంటే మార్కాపురం ప్రజల ఇలవేల్పు శ్రీలక్ష్మి చెన్నకేశవుడికి ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

పట్టణంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా గరుడ వాహనం, రథోత్సవాలకు ఎక్కువగా భక్తులు వస్తారు. గతంలో బ్రహోత్సవాలకు సంబంధించి పోలీస్‌శాఖవారు బందుబస్తు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. కానీ ఈ ఏడాది అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనపడడం లేదు. సాధారణ రోజుల్లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు రోడ్లపై కానరావడం లేదు.

చెన్నునికి తప్పని ట్రాఫిక్ తిప్పలు

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారు మంగళవారం గరుడవాహనంపై మాడ వీధులలో విహరించారు. గరుడవాహనంపై చెన్నుడు దోర్నాల బస్టాండు వద్దకు వచ్చిన సమయంలో బస్సులు, ఆటోలు, లారీలు ఎదురువచ్చాయి. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు ఎక్కడా కానరాలేదు. బ్రహోత్సవాల సందర్భంగా వాహనం వెంబడి వెళ్లడానికి పోలీసులను నియమించిన దాఖలాలు కూడా లేదు. దీంతో వాహనాలు అక్కడ నుంచి కదిలే పరిస్థితి లేదు. దీంతో చెన్నుని వాహనాన్ని మోస్తున్న భక్తులు చెన్నకేశవస్వామిని పక్కకు తీసుకెళ్లారు. దీంతో పోలీసుల పనితీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

గంట సేపు నిలిచిన రాకపోకలు

పట్టణంలోని కంభం బస్టాండు, కోర్టు కూడలిలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ రెండు ప్రాంతాల్లో వాహనాల రద్దీ నిత్యం ఎక్కువగా ఉంటుంది. కానీ ఒక్కరంటే ఒక్కరైనా పోలీస్ సిబ్బంది ఆయా సెంటర్లలో విధులలో లేరు. ట్రాఫిక్ ఇక్కట్లు, ఎండ తీవ్రతతో సుమారు గంటకు పైగా ఉండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి.

వడదెబ్బకు యాచకుడి మృతి

కంభం, ఏప్రిల్ 30 : కంభం మండలం కందులాపురంలోని ఓ యాచకుడు వడదెబ్బకు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. నాలుగు రోజులుగా 44 డిగ్రీల ఉష్ణోగ్రతతో తీవ్ర వడగాలులు వీస్తున్నాయి. ఈ వడగాల్పుల దెబ్బకు కందులాపురం, కంభం పంచాయతీలలో భిక్షాటన చేసి జీవిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) కందులాపురం పంచాయతీ కార్యాలయ సమీపంలో రోడ్డు పక్కనపడి ఉన్నాడు. స్థానికులు గమనించగా, అప్పటికే మృతిచెంది ఉన్నాడు. వడదెబ్బకు మరణించిన వ్యక్తిని కందులాపురం పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

హోటళ్లలో ఆర్‌వో తనిఖీ

బేస్తవారపేట, ఏప్రిల్30: బేస్తవారపేటలోని రెస్టారెంట్, ఫ్యామిలి హోటళ్లలో ఎన్నికల ఆర్‌వో నాగలక్ష్మీ, తహశీల్దార్ పద్మావతిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెస్టారెంట్‌లలో, హోటళ్లలో, సమీప ప్రదేశాలలో ఖాళీ మద్యం సీసాలు ఉండటం వాటిని పరిశీలించి సంబంధిత నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్స్‌లలో మద్యం సేవించడం నేరమని తెలిపారు. బేస్తవారపేట ఆర్.కె.నగర్ జంక్షన్‌లోని ఓ హోటల్ నిర్వహకునిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో ఫ్లైయింగ్ స్కాడ్ సిబ్బంది, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మందా కృష్ణమాదిగ పర్యటన

● విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకుల పిలుపు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 30 : నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబును బలపరచడానికి ఈ నెల 2న ఎర్రగొండపాలెం పర్యటనకు వస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టరు మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలో భాగంగా ఎర్రగొండపాలేనికి మంద కిష్ణమాదిగ వస్తున్నారన్నారు. నియోజకవర్గంలో మాదిగల ఓట్లు 58 వేలు ఉన్నాయని తమ సంపూర్ణ మద్దతు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకే ఉంటుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ వర్గీకరణకు సహకారం అందిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదిమూలపు ప్రకాష్, జిల్లా అధికారప్రతినిధి, వినయ్, సీనియర్ నాయకులు చేదూరి గంగయ్య, టీడీపీ మండల అధ్యక్షులు బి దాస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు దోర్నాల మండల టీడీపీ కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

గిద్దలూరు, ఏప్రిల్ 30 : పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, పిల్లిపెసర, జీలుగ విత్తనాలను 50శాతం రాయితీపై అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి వై.విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో రైతులకు తెలిపారు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి పైరుకల్లెకు వచ్చిన సమయంలో భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన రైతులు రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, మొబైల్ నెంబరు ద్వారా విత్తనాలు పొందవచ్చని పేర్కొన్నారు.

అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు

● స్వతంత్ర అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తు

గిద్దలూరు, ఏప్రిల్ 30 : గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు.. అయితే స్వతంత్ర అభ్యర్థి పరిశనేని వెంకటేశ్వర్లుకు గాజు గ్లాసు గుర్తును కేటాయించారు. టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డికి సైకిల్, బహుజన్ సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి ఇసుకల జయరాజ్‌కు ఏనుగు, వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డికి సీలింగ్ ఫ్యాన్, కాంగ్రెస్ అభ్యర్థి పగడాల పెద్దరంగస్వామికి హస్తం, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థి చింతా శ్యామ్‌సన్‌కు రబ్బర్‌స్టాంపు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి జవ్వాజి పవన్‌కుమార్‌కు టెలివిజన్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జానావత్ రాగూర్‌నాయక్‌కు బావి, జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ అభ్యర్థి దాసరి బాబూరావుకు కోటు, స్వతంత్ర అభ్యర్థులైన కొప్పుల నరసింహాలుకు యాపిల్, తమిదెల కోటేశ్వర్‌రెడ్డికి బకెట్, పరిసనేని వెంకటేశ్వర్లుకు గాజు గ్లాసు, పిడతల రమేష్‌రెడ్డికి విజిల్, బట్టపోతుల ఓబులేసుకు ప్రెజర్‌కుక్కర్, బాలసాని మాల్యాద్రిరెడ్డికి రూమ్‌కూలర్, బొంతా రంగారెడ్డికి పచ్చిమిరప, బొర్రా రాఘవేంద్రయాదవ్‌కు ట్యూబ్‌లైట్, మీనిగ మురళిమోహన్‌రెడ్డికి జావెలిన్ విసరడం, ముడియం వెంకటరామిరెడ్డికి కంప్యూటర్, ఎం.లక్ష్మీ రామనాయక్‌కు బ్యాట్, వరికుంట్ల ప్రసాద్‌కు గ్యాస్ సిలిండర్, వీరంరెడ్డి ఉషారాణికి గన్నాకిసాన్ గుర్తును రిటర్నింగ్ ఆఫీసర్ నాగజ్యోతి కేటాయించారు.

పోటీలో ఒకే మహిళ

గిద్దలూరు అసెంబ్లీ బరిలో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియగా 21 మంది అభ్యర్థులు రంగంలో మిగిలారు. అయితే వీరిలో 20 మంది పురుష అభ్యర్థులు కాగా, ఒకే ఒక్క మహిళ బరిలో ఉన్నారు. కొమరోలు మండలం గోపానిపల్లె గ్రామానికి చెందిన వీరంరెడ్డి ఉషారాణి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇదిలావుండగా ఇతర జిల్లాల అభ్యర్థులు కూడా బరిలో ఉండడం విశేషం. నెల్లూరు నేతాజీనగర్‌కు చెందిన ఇసుకల జయరాజ్ బహుజన సమాజ్‌వాజ్ పార్టీ అభ్యర్థిగా రంగంలో ఉండడం విశేషం.

టీడీపీలోకి జోరుగా చేరికలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కందుల నారాయణరెడ్డి


నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

మార్కాపురం, ఏప్రిల్ 30: మార్కాపురం నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని 14వ వార్డులో వైసీపీకి చెందిన 70 కుటుంబాల వారు టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యువ నాయకుడు మాగుంట రాఘవరెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో చింతగుంట్ల ప్రభాకర్, కర్నాటి లక్ష్మిరెడ్డి, శాంతి, అనురాధ, ఇమ్మానియేలు, వెంకట రమణ, మండ్ల శివ, షేక్ రబ్బాని, ఉమ్మడపూడి లక్ష్మణ్ తదితరులున్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పఠాన్ ఇబ్రహీం, గులాబ్, ఫిదా బేగ్ తదితరులున్నారు.


మూగచింతలలో ప్రచారం చేస్తున్న విఘ్నేష్‌రెడ్డి

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

పొదిలి : టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమౌతుందని విఘ్నేష్‌రెడ్డి అన్నారు. ఇంటింటికి మన కందుల కార్యక్రమం మంగళవారం మండలంలోని మూగచింతల గ్రామంలో విఘ్నేష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. జనసేన, బీజేపీ పార్టీలు బలపరిచిన మార్కాపురం ఉమ్మడి టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణ రెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. కనుక ప్రతి ఒక్కరు కందుల నారాయణరెడ్డితోపాటు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధి యువత కు భరోసా టీడీపీ పాలనలోనే ఉంటుందనే విషయం గుర్తుచేసుకోవాలన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్, మార్కాపురం జిల్లా ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే పొదిలి మండలానికి తాగు, సాగునీరు అందుతుందన్నారు. కనుక ప్రతి ఒక్కరూ, ఉమ్మడి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని, మార్కాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిత


టీడీపీలోకి కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 30 : రాష్ట్రానికి బంగారు భవిత రావాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కవాలని టీడీపీ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీ వీడి 110 కుటుంబాలు వారు టీడీపీలో చేరాయి. వీరంతా మంగళవారం మధ్యాహ్నం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయానికి వచ్చి టీడీపీలో చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అందరికి పార్టీకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌ను నమ్మి ఓట్లు వేశామని ఐదేళ్ల పాలన పూర్తయిన సంక్షేమం లేదని, అభివృద్ధి లేదని అన్నారు. పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లిలో వైసీపీ నుంచి 35 కుటుంబాలు, గొబ్బూరు గ్రామంలో 15 కుటుంబాలు, త్రిపురాంతకం మండలం లేళ్లపల్లి గ్రామంలో వైసీపీ నుంచి 30 కుటుంబాలు, ఎర్రగొండపాలెం మండలం మురారిపల్లె గ్రామం నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మూడు మండలాలలోని నాలుగు గ్రామాల్లో 110 కుటుంబాలు టీడీపీలో చేరడంతో నియోజకవర్గంలో వైసీపీ కి భారీ షాక్ తగిలిందని విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.


పుల్లలచెరువులో ప్రచారం చేస్తున్న చందనరెడ్డి, చెల్సియా

పుల్లలచెరువు : మే 13 జరుగనున్న ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి గెలిపిస్తే ఒంగోలు జిల్లాను అభివృద్ధి చేస్తామని మాగుంట శ్రీనివాసులరెడ్డి కోడలు మాగుంట చందనారెడ్డి అన్నారు. మంగళవారం పుల్లలచెరువు మండల కేంద్రంలో మాగుంట చందనారెడ్డి, ఎరిక్షన్‌బాబుకుమార్తె చెల్సియా, కుమారుడు అజిత్, టీడీపీ నాయకులు ఇంటింటికి ప్రచారం చేశారు. బాబు సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులకు నెలకు 4వేల పింఛను, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, అందిస్తామ న్నారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పుల్లలచెరువులో టీడీపీ ప్రచారం బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఎరిక్షన్‌బాబు కుమారుడు అజిత్, కుమార్తె చెల్సియా టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, గజ్వేల్లి భాస్కర్, ఉప్పల హనుమంతు, కె కుమార్, మేడికొండ లక్ష్మి నారాయణ, శనగా నారాయణరెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎనోఫోర్స్‌మెంట్ స్టేషన్‌ను సందర్శించిన నోడల్ డిప్యూటి కమీషనర్

పొదిలి, ఏప్రిల్ 30 : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పొదిలి ఎనోఫోర్స్‌మెంట్ స్టేషన్‌ను నెల్లూరు నోడల్ డిప్యూటి కమీషనర్ కె హేమంత్‌నాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికలను దృష్టిలో స్టేషన్ పరిధిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి బెల్ట్‌షాపులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేకంగా దాడులు నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు ఎన్నికేసులు నమోదు చేశారు, ఎంత మద్యం స్వాధీనం చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. అక్రమంగా అనధికా రికంగా మద్యం సరఫరాను అరికట్టేందుకు మద్యం నిల్వల గోడౌన్‌లలో తనిఖీలు నిర్వహిం చాలని చెప్పారు. నాన్‌డ్యూటీ పైడ్ లిక్కర్, అనధి కారిక మద్యం, పాత ముద్దాయిలను బైండోవర్ చేసుకొని తగుచర్యలు తీసుకోవాలని సిఐ ఈశ్వరయ్యకు సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మద్యం ప్రభావం ఎన్నికలపై పడకుండా ఫ్రీ అండ్ ఫెయిర్‌గా సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది పనిచేయాలని సూచించారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడు


గరడవాహనంపై విష్ణుమూర్తి అలంకరణలో చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 30: బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి మంగళవారం తెల్లవారుజామున మహా విష్ణువు అలంకారంలో గరుడవాహనంపై నాలుగు మాడ వీధులలో విహరించారు. దీంతో మార్కాపురం పట్టణం భక్తి పారవశ్యంలో ఆధ్యాత్మిక గుబాలింపులను సంతరించుకొంది. వాహనాలలో అతి ముఖ్యమైన గరుడ వాహన సేవను దర్శించిన వారికి విజయం, కీర్తి, బలం సిద్ధిస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటలకు చెన్నకేశవుని మహా విష్ణువు అలంకారంలో సర్వాలంకరణ భూషితుడు చేసి గరుడ వాహనంపై ఆశీనులను చేశా రు. అనంతరం భేరి వాయిద్యాలు, మంగళ వాయిద్యాల మధ్య నగరోత్సవం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసుల రెడ్డి సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


పూలరథంపై వేంకటేశ్వరుని నగరోత్సవం

నేడు గజవాహనసేవ రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం తెల్లవారుజామున చెన్నకేశవస్వామి గజవాహనంపై సార్వభౌమ అలంకారంలో నాలుగు మాడవీధులలో విహరించను న్నారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి వైభవంగా రథోత్సవం జరుగునుంది.

కంభంలో రథోత్సవం

కంభం : పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారు పూలరథంపై కంభంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ పూజారి ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి రథానికి పూలంకరణకు బిజ్జాల కిశోర్, భార్య పద్మావతిలు పూలంకరణ చేయించారు. శింఘారిమేళం, కేరళ డ్రమ్స్, నవదుర్గ వేషాలు, మహిళలచే కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టో

దర్శి, ఏప్రిల్ 30: టీడీపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూర్చుతుందని దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. కూటమి అధినేతలు మేనిఫెస్టోను విడుదల అనంతరం ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు జనసేన, బీజేపీ నాయకులతో చర్చించి అందరికి ఆమోదయోగ్యమైన మేనిఫెస్టోను విడుదల చేసినట్టు చెప్పారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధితో పాటు అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయటంతో పాటు వృద్ధులకు రూ4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు ప్రకటించడం ఆనందదాయమకమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించటం, అప్పటివరకు రూ.3వేల నిరుద్యోగ భృతి అందించనున్నట్లు చెప్పారు. కూటమి మేనిఫెస్టోపై రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు.

టీడీపీలోకి 40 కుటుంబాలు



టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో చేరిన వైసీపీ కార్యకర్తలు

కురిచేడు, ఏప్రిల్ 30: కురిచేడు మండలం పడమర కాశీపురం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సాదం పెద్దఅచ్చయ్య, సాదం నారాయణ, ఉసుళ్ళ వెంకటేశ్వర్లు, కాటిబోయిన ఆదినారాయణ, మాజీ సర్పంచ్ ఉసుళ్ళ వీరనారాయణ, పల్లె చిన్నయోగయ్య, సాదం శేషయ్య, పల్లె ఇర్మియా, తదితరులు ఉన్నారు. వీరంతా పడమర కాశీపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పావులూరి వెంకటసుబ్బయ్య, పావులూరి శేఖర్‌ల ఆధ్వర్యంలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య కాట్రాజు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బెట్టకొచ్చిన మినుము పైరు



సాగులో ఉన్న మినుము పైరు

పామూరు, ఏప్రిల్ 30: మండలంలోని మోపాడు రిజర్వాయర్ ఆయకట్టు కింద పలు చోట్ల మినుము పైరు సాగులో ఉంది. మండుతున్న ఎండలకు పైరు బెట్టకొచ్చింది. వెంటనే నీటి తడులు అందించి పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు. రిజర్వాయర్ ఆయకట్టు కింద సుమారుగా 15 వందల ఎకరాల్లో మినుము పైరు సాగులో ఉందని ఇరిగేషన్ డీఈ రవి తెలిపారు. నీటి తడులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారని, ఈవిషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7 అడుగుల నీటిమట్టం ఉందని డీఈ పేర్కొన్నారు.

నేడు తాళ్లూరు మండల సర్వసభ్య సమావేశం

తాళ్లూరు, ఏప్రిల్ 30: తాళ్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం పది గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.యుగకీర్తి తెలిపారు. సమావేశానికి ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో మంచినీటి సమస్యపై మాత్రమే చర్చించనున్నట్టు తెలిపారు. ఎన్నికల నియమావళి మేరకు మిగిలిన అంశాలపై చర్చ జరిగే అవకాశం లేదన్నారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న ఆనంద్ మాదిగ

దర్శి, ఏప్రిల్ 30: వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ టి.ఆనంద్‌మాదిగ కోరారు. దర్శిలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మేనెల 2న దొనకొండ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరిగే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ హాజరవుతారని చెప్పారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్‌మాదిగ, కిరణ్ మాదిగ గోళ్లపాటి మార్క్‌మాదిగ, అయ్యన్నమాదిగ, సుమన్‌మాదిగ, ప్రభాకర్‌మాదిగ పాల్గొన్నారు.

అవకాశమిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా!

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



మారెళ్ళలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, ఏప్రిల్ 30: ఒక్క అవకాశం ఇవ్వండి.. దర్శి నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మీ ఆడబిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. మంగళవారం మండలంలోని పోలవరం, వేంపాడు, పెదరావిపాడు, మారెళ్ళ, జమ్మలమడక, మక్కెనవారిపాలెం, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, తమ్మలూరు, నాయుడుపాలెం గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రధానంగా మహిళలు, యువకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ వెనుకబడిన నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రూపురేఖలు మారుస్తానన్నారు. ప్రధానంగా తాగు, సాగునీరు, విద్య, వైద్య, రహదారులు, డ్రయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. జగన్‌కు ఐదు సంవత్సరాలు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని 20 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్ళారన్నారు. రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువత గంజాయి మత్తులో పడి సర్వనాశనం అయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రజలు గ్రహించి టీడీపీకి మద్దతు పలకాలన్నారు. చంద్రబాబుపేద ప్రజల కోసం సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తారన్నారు. మండలంతో తమ కుటుంబానికి గత 40 సంవత్సరాలుగా అనుబంధం ఉందన్నారు. తన తాత స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు, తన తండ్రి స్వర్గీయ నరసయ్య, తన బాబాయి రవికుమార్‌లు ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. దర్శి నుంచి తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలని కోరారు. భారీ గజమాలతో మారెళ్ళ పోలవరంలో డాక్టర్ లక్ష్మిని సన్మానించారు.



దొనకొండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ హిందూజ

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్, మాజీ ఎంపీపీ మందులపు వెంకటరావు, కోడెగ మస్తాన్ రావు, కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, పాలపర్తి సుబ్బారావు, సుంకర రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

దర్శి, ఏప్రిల్ 30: వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డాక్టర్ లలిత్‌సాగర్ విజ్ఞప్తి చేశారు. దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. బీసీ కాలనీలో పర్యటించి టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సంగా తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వదిన గెలుపు కోసం ఆడపడుచు ప్రచారం

దొనకొండ, ఏప్రిల్ 30: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజయం కోసం ఆడపడుచు డాక్టర్ హిందూజ దొనకొండ పట్టణంలో రెండు రోజులుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వదిన విజయం కోసం మంగళవారం దొనకొండలోని ఒబ్బాపురం, అరబస్తాన్, శివాజీనగర్, వీవీపురం తదితర ప్రాంతాల్లో మహిళలతో కలిసి గడపగడకు వెళ్లి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శివకోటేశ్వరరావు, వెంకన్నచౌదరి, మోడి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 30: యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే కూటమి మేనిఫెస్టో ప్రధాన లక్ష్యమని కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మెగా డీఎస్సీ విడుదలపై తొలి సంతకం చేస్తారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు వృద్ధాప్య పింఛన్‌ను రూ2వందల నుంచి రూ2వేలకు ఒకేసారి పెంచారని గుర్తుచేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను అధికారంలోకి వచ్చినవెంటనే ఒకేసారి రూ3వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం రూ3వేలు ఉన్న పింఛన్‌ను రూ4వేలకు పెంచుతామని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో ఇసుక బంగారం మాదిరిగా అమ్ముకుని వైసీపీ నేతలు పేదల జేబులు కొట్టి వారి పొట్టలు నింపుకున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచితంగా ఇసుకతో పాటు, అన్నాక్యాంటీన్‌లు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. భూహక్కు చట్టం తీసుకవచ్చి పేదల ఆస్తులు లాక్కొన్నేందుకు జగన్ పన్నాగం పన్నారని ఆరోపించారు. ఈ చట్టాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో పెట్టారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు పెంచేదేలేదన్నారు. ప్రజలందరూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. సమావేశంలో టీడీపీ నాయకులు పిచ్చాల శ్రీనివాసులు రెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, రోషన్‌సంధాని, ఫిరోజ్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ



హనుమంతునిపాడు మండలంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 30: రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం హనుమంతునిపాడు మండలంలోని హాజీపురం, దొడ్డిచింతల, కిష్టంపల్లి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు డాక్టర్ ఉగ్రకు బ్రహ్మరథం పట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి కోసం, భవిష్యత్తు కోసం తనను గెలిపించాలని కోరారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే పేదల బతుకులు అంధకారమేనని అన్నారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి కావాలంటే సాగు, తాగు నీటితో పాటు ఉపాధి, ఉద్యోగాల కల్పన ముఖ్యమన్నారు. అందుకోసం తాను ఐదు అభివృద్ధి పనులతో పక్కాగా ముందుకుపోతానన్నారు. హనుమంతునిపాడు మండలంలో బత్తాయి, నిమ్మ, జామ, ఉద్యానవన పంటల సాగుకు ఊతమిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), గాయం తిరుపతిరెడ్డి, చావలి చినవెంకటేశ్వర్లుయాదవ్, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, మురహరి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు

దర్శి, ఏప్రిల్ 30: నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఈబీ నోడల్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు అన్నారు. మద్యం ప్రభావం లేని ఎన్నికలే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అనధికార మద్యం నిల్వల ప్రదేశాలను గుర్తించి దాడులు చేయాలని ఆదేశించారు. కొద్దిరోజుల క్రితం ముండ్లమూరులో మద్యం షాపుల నుంచి వేలసంఖ్యలో బాటిల్స్ అధికార పార్టీ నాయకుల వద్ద దొరికిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడ మద్యం షాపుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ సుందరరామయ్య, ఎస్సై కళ్యాణ్‌చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘు కార్యవర్గం

దర్శి, ఏప్రిల్ 30: నూర్‌బాషా సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శిగా పాణ్యం మజ్జావలి, గౌరవాధ్యక్షుడిగా బొమ్మనబోయిన ఖాశిం, కోశాధికారిగా షేక్ చాంద్‌బాషా, ఉప కార్యదర్శిగా షేక్ మాబుసుభానీ మరో 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మీరావలి, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాశింసాహెబ్, గౌరవాధ్యక్షుడు మీరా మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

దొనకొండ, ఏప్రిల్ 30: దొనకొండలోని రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రభు చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదిమూలపు ప్రభుదాస్ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం రైల్వే డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.మహర్షి ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు మల్లెల ఆనంద్‌కుమార్, కె.ఐజక్‌దయాన్, జి.విజయ్‌కుమార్, ఎగ్గోని రవికుమార్, ఆశీర్వాదం, జేమ్స్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కుంటుపడిన గ్రామాభివృద్ధి

పామూరు, ఏప్రిల్ 30: అవినీతి, అరాచకాలనే అజెండాగా చేసుకొన్న వైసీపీకి ఈ ఎన్నికల్లో పరాజయం తప్పదని సింగిల్ విండో మాజీ చైర్మన్ లు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థుల తరఫున స్థానిక ఎస్టీ కాలనీల్లో మంగళవారం ముమ్మర ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. పామూరు పట్టణంలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో అంకాల మ్మవీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

అలాగే, మండలంలోని మోపాడు, తూర్పు కోడిగుడ్లపాడు, దాదిరెడ్డిపల్లి, కోడిగుంపల, కంభాలదిన్నె, అయ్యవారిపల్లి, అయ్యన్నకోట, బలిజపాలెం, బుక్కాపురం, రావిగుంటపల్లి, బొట్లగూడూరు, లక్ష్మీనరసాపురం, బోడవాడ, నుచ్చుపొద, ఇనిమెర్ల, విరాట్ నగర్ కాలని, విద్యుత్ సబ్‌స్టేషన్ కాలని, తూర్పువీధి, తదితర ప్రాంతాల్లోనూ టీడీపీ శ్రేణులు ముమ్మరం చేసారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు పువ్వాడి తిరుపతమ్మ, జి.దశరథరాములు, ఆవుల నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీలు ఎం.హుసేన్‌రావుయాదవ్, బి.మహాలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే ఉద్యోగావకాశాలు

పామూరు, ఏప్రిల్ 30: చంద్రబాబు అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, తెలుగుయువత మండల అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని రావిగుంటపల్లి గ్రామంలో మాగుంట, ఉగ్రల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఆర్థికసాయం చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల శ్రీనివాసులు, బండ్ల నారాయణ, ఈర్ల సత్యనారాయణ, వెంకట్రావు, వంకదారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వెలిగండ్ల: ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

టీడీపీలో పలువురు చేరిక

పీసీపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీకి చెందిన పలువురు మంగళవారం ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. దివాకరపల్లి గ్రామానికి చెందిన కోయ వెంకటేశ్వర్లు, కోటపాటి వెంకటేశ్వర్లు తదితరులు టీడీపీలో చేరారు. వీరికి ఉగ్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, సర్పంచ్ కరణం తిరుపతయ్య, కరణం తిరుపతిరావు, కరణం చంద్రయ్య, కోమటిగుంట్ల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లి: ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన దివాకరపురం వైసీపీ కార్యకర్తలు

నాగిరెడ్డిపల్లి నుంచి ఆరు కుటుంబాలు

వెలిగండ్ల, ఏప్రిల్ 30: వెలిగండ్ల మండలంలో వలసల పరంపర కొనసాగుతూనే ఉన్నది. తాజాగా ఆరు కుటుంబాలు కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన వైసీపీ కుటుంబాలు కనిగిరిలోని టీడీపీ కార్యాలయంలోకి రాగా, వారికి ఉగ్ర టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభివృద్ధిని పక్కనపెట్టి తన ఆదాయాన్ని రెట్టింపు చేసుకున్నారన్నారు.

నిరుపయోగంగా బాలికల వసతి గృహం

- టీడీపీ హయాంలో నిధులు మంజూరై పూర్తయిన భవనం
- ప్రారంభించని వైసీపీ పాలకులు
- విద్యార్థినులకు తప్పని ఇబ్బందులు

తాళ్లూరు, ఏప్రిల్ 30: నాడు-నేడు కార్యక్రమం కింద రాష్ట్రంలోని విద్యాలయాల రూపు మారుస్తున్నామని వైసీపీ పాలకులు ఊదరగొట్టారు. ఆచరణలో ఆఊసేలేదు. టీడీపీ హయాంలో నిధులు మంజూరై నిర్మాణ పనులు పూర్తయిన భవనాన్ని ప్రారంభించకుండా విద్యార్థినులను ఇబ్బందులు పెడుతున్నారు. తాళ్లూరులో దాదాపు రెండుకోట్ల నిధులతో బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. ఈభవనం పూర్తయి మూడేళ్లు కావస్తుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవనాన్ని ప్రారంభించకుండా వదిలేసింది.

గత టీడీపీ ప్రభుత్వం పేద వర్గాల బాలికల విద్యాభ్యాసం కోసం అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు ప్రత్యేక చొరవతో 2018లో దాదాపు రూ.రెండు కోట్ల నిధులతో తాళ్లూరులో 150 మంది బాలికలు ఉండేందుకు వసతి గృహ నిర్మాణం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా బాలికల వసతి గృహ నిర్మాణానికి రూ.కోటి 95లక్షల నిధులు మంజూరు చేయించారు. అప్పటిమంత్రి శిద్దా రాఘవరావు 2019 మార్చిలో పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2021లో పూర్తి చేసి విద్యాశాఖకు భవనాన్ని అప్పగించారు. మూడేళ్ల క్రితం పనులు పూర్తయినా బాలికల వసతిగృహాన్ని ప్రారంభించటంలో పాలకులు మీనమేషాలు లెక్కించారన్న విమర్శలు వినవస్తున్నాయి. దాదాపు రెండుకోట్ల రూపాయలతో అన్ని సౌకర్యాలతో బాలికల సంక్షేమం కోసం నిర్మించిన వసతి గృహం అలంకారప్రాయంగా దర్శన మిస్తోంది.

పాలకుల, అధికారుల నిర్లక్ష్యం వల్ల రెండు కోట్లరూపాయలతో నిర్మించిన భవనం మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంది. టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో బాలికల వసతి గృహం పూర్తయినా వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల పేద బాలికలు విద్యకు దూరమయ్యారన్న విమర్శలు వినవస్తున్నాయి.



మంత్రి శిద్దా వేసిన శిలాఫలకం



నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహం





తెనాలి రోడ్‌షోలో బస్సు పైకెక్కిన అభిమానులకు చంద్రబాబు అభివాదం



మహాజనం

నేనే విజిలేస్తే..



తెనాలి సభలో ప్రసంగిస్తున్న అభ్యర్థి మనోహర్, చంద్రబాబు, పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి రాజా



బాబు ప్రసంగానికి ముస్లింల కేరింతలు

- తెనాలిలో చంద్రబాబుకు నీరాజనం
- జైత్రయాత్రలా తెనాలి ప్రజాగళం
- సైకో పాలనతో అమరావతి ధ్వంసమైంది
- గొడ్డలి వేటు ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపు

తెనాలి రూరల్/ గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జనం.. జనం.. మహాజనం. తెనాలి ప్రజాగళం పోటెత్తింది. చంద్రబాబు ప్రజాగళం జైత్రయాత్రలా సాగింది. ప్రజాగళం యాత్రలో చంద్రబాబుకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. హెలిప్యాడ్ నుంచి మార్కెట్ సెంటర్‌లోని సభా ప్రాంగణం వరకు మంగళ వారం జరిగిన రోడ్ షోలో చంద్రబాబుకు ప్రజల నుంచి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఇసుకేస్తే రాలని జనంతో తెనాలి కిటకిటలాడింది. రోడ్డుకు ఇరువైపు లా అధినేత చంద్రబాబు కోసం నిరీక్షించి మరీ ప్రియ తమ నేతను సభా ప్రాంగణానికి జనం తీసుకువెళ్లారు. అనంతరం తెనాలి మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను చంద్రబాబు ఎండగట్టారు. టిడ్కో ఇళ్లు ఉచితంగా పేదల కు ఇస్తామని, కూటమి మ్యానిఫెస్టోను చదివి దాన్ని అర్థం చేసుకుని చైతన్యవంతులై కూటమిని గెలిపించాలని కోరారు. సైకో పాలనతో అమరావతి ధ్వంసమై, తెనాలి అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఏమీ చేయకుండానే అన్ని హామీలు నెరవేర్చానని జగన్ మా ట్లాడుతున్నాడు. సైకో ప్రభుత్వం పోవాలి. దేశానికి ఆదర్శంగా అమ రావతి రాజధాని, పోలవరం పూర్తిచేసుకుందాం.. ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా తీర్చిదిద్దుకుందాం.. ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని చంద్రబాబు ప్రజలకు పిలు పిచ్చారు. కుటుంబం మొత్తం భరిం చలేక వదిలేసిన ఒంటరి జీవి జగన్ అని, ఒంటరి వాడైన జగన్ రాజ. దాని కట్టలేదని, పోలవరం నిర్మించ లేదని, రోడ్లు వేయలేదని ప్రజలు గుర్తించాలని గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వైసీపీలాగా దోచుకోవడానికి, రాష్ట్రానికి నష్టం చేయడం కోసం పెట్టుకున్న పొత్తు కాద ని, విలువలతో కూడిన రాజకీయాల కోసం, నిజాయితీగా మన ప్రాంతం, ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీలు పెట్టుకున్న పొత్తిదని తెనాలిలో జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. దార్శనికుడైన చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు.

> రాష్ట్రంలో బందిపోట్ల పాలన సాగుతుంది. దానిని తెనాలి నుంచే తరమికొడదాం. తిరుగుబాటుకు ప్రజలందరూ సిద్ధం కండి. ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకుని సైకో భూతాన్ని తరిమి కొట్టాలి. ప్రజలందరూ ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసి గొడ్డలి వేటు ప్రభుత్వాన్ని సాగనంపాలి. పట్టణ ప్రాంత ప్రజలు ఎండకు భయపడి ఓటేయకపోతే గొడ్డలి మళ్లీ అధికారంలోకి వస్తుంది. ఈసారి అది ప్రతి ఇంటికి వచ్చి బెదిరిస్తుంది.
>
> \- చంద్రబాబు



అభిమాని విజయసంకేతం

రూ. 80 కోట్లు దోపిడీ

- మళ్లీ గెలిస్తే శివకుమార్ టాక్సు చట్టబద్ధం
- తెనాలి ఎమ్మెల్యేపై ధ్వజమెత్తిన చంద్రబాబు

తెనాలిలో ఒక భయంకరమైన ఎమ్మెల్యే ఉన్నాడు. తెనాలి చరిత్రలో ఎన్నడూ జరగని అరాచకాలు జరి గాయి. సెంటు పట్టా కోసం సేకరించిన భూముల్లో 80 కోట్లు దోచిన దొంగ వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్. వెంచర్లు వేయాలన్నా, అపార్టుమెంట్లు కట్టాలన్నా కప్పం కట్టాల్సిందే. ఈ సారి ఎన్నికల్లో తిరిగి వైసీపీకి ఓటు వేస్తే జే(జగన్) ట్యాక్సుతో పాటు శివకుమార్ ట్యాక్స్‌ను చట్టబద్ధం చేస్తాడు. మున్సిపల్ ఎన్నిక ల్లో టీడీపీ కౌన్సిలర్ ఇంట్లోకి శివకుమార్ తన అనుచరులను పంపి మద్యం బాటిళ్లు పెట్టించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అయితే సీసీ కెమెరాల్లో శివకుమార్ దొంగాటకు ముగింపుపడింది. ఆర్యవైశ్య సంఘానికి చెందిన కౌన్సిలర్ యుగంధర్‌పై దాడి చేయించాడు. మార్కెట్ యార్డులో మామూళ్లకు పాల్పడుతున్నాడు. బిల్డింగ్‌కు ఒకరేటు, స్థలాలకు ఒకరేటు అంటూ శివకుమార్ ట్యాక్సులు వసూలు చేస్తున్నాడు. ప్రశాంతంగా ఉండే తెనాలిలో ఇసుక మాఫియాతో అలజడి సృష్టిస్తూ దుర్మార్గపు పాలన చేస్తూ తిరిగి అధికారం కోసం చూ స్తున్నాడు జాగ్రత్త.. అంటూ ప్రజలను చంద్రబాబు హెచ్చరించారు. కొన్ని వందల లారీల్లో ఇసుక తరలించి దోచుకున్న దొంగ ఈ సైకో ముఖ్యమంత్రికి స్వాతి ముత్యమని ఎద్దేవా చేశారు. అలాంటి వారికి తెలివైన తెనాలి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇక నీ ఆటలు సాగవు.. తాట తీస్తాం. ఒళ్లు దగ్గర పెట్టుకుని వ్యవ హరించు అంటూ చంద్రబాబు శివ శంకర్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు.



> నియోజకవర్గంలోని సమస్యలను ప్రణాళికా బద్ధంగా పరిష్కరిస్తాను. నియోజకవర్గంలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులతో పాటు లంక గ్రామాల్లో ని అపరిష్కృతమైన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాను.

మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

అ
నుభవం
నుబంధం
భివృద్ధి

- ఓటర్లలో వచ్చిన మార్పే గెలిపిస్తోంది
- జగన్‌ను నమ్మి మోసపోయిన ప్రజలు
- సమస్యలను ప్రణాళికా బద్ధంగా పరిష్కరిస్తా

ఆంధ్రజ్యోతితో వేమూరు అభ్యర్థి నక్కా ఆనందబాబు

సంక్షేమం.. సంపదపై దృష్టి

జగన్ తొమ్మిది పథకాలనే అమలు చేశారు. టీడీపీ 117 పథకాలను అమలు చేసింది. కూటమి మేనిఫెస్టో ద్వారా అన్ని వర్గాల సంక్షేమం కోరి మరిన్ని పథకాలను అమలు చేస్తాం. జగన్ 11 లక్షల కోట్లు అప్పు చేశాడు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి ప్రజా ప్రభుత్వంలో సంపాద సృష్టించబోతున్నారు. చంద్ర బాబు పరిశ్రమల ద్వారా ఆదాయం పెంచుతారు. రాష్ట్ర ఆదా యం పెంచి సంక్షేమం, అభివృద్ధి అదనంగా అందించే పద్ధతిలో ముందుకు నడుస్తాం.

వేమూరు, ఏప్రిల్ 30: ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. ప్రజలతో విడదీయరాని అనుబంధం నాది. నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి సమస్య ఉందో.. దానినిఏవిధంగా పరిష్కరించాలో నాకు బాగా తెలుసు. ప్రజలు నన్ను గెలిపించేందు కు సిద్ధంగా ఉన్నారు. వారి ఆశలను నెర వేర్చేలా అభివృద్ధి చేసి చూపిస్తా.. అని వేమూరు కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు తెలిపారు. వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా నాలుగో సారి పోటీలో ఉన్న మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఒక్క ఛాన్స్ అని చెప్పిన జగన్ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని, తెలుగుదేశం పార్టీ పాలనను ఈ ఐదేళ్ల వైసీపీ పాలనతో పోల్చి చూసుకున్నారు. మెరుగైన పాలన ఏదో గ్రహించారు. స్పష్టమైన వైఖరి కలిగి ఉన్నారు. సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి పేదలకు రోజు ఆదాయం ఇవ్వగలిగేది తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు అని ప్రజలు తెలుసుకున్నారని ఆనందబాబు ఆంధ్రజ్యోతికి తెలిపారు. వివిధ అంశాలపై ఆయన వెలిబుచ్చిన అంశాలు..

వారిది వైఫల్యం

పార్టీలకు అతీతంగా నేను పని చేశా. రెండు సార్లు ప్రజలు నన్ను గెలిపించారు. నేనేమిటో ప్రత్యర్థి పరిస్థితి ఏమిటో ప్రజలకు తెలుసు. నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిని మార్చారు. అంటే వారు వైఫల్యం చెందినట్లని ఒప్పుకున్నట్లే కదా. వలస వచ్చిన అభ్యర్థికి ఇక్కడి ప్రజల బాధలు తెలియదు. ఇన్‌చార్జిగా ఉండి వివాదాలు సృష్టిస్తున్నారు. వలస వచ్చిన నేతకు నియోజకవర్గ ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

సమస్యలపై అవగాహన

నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య ఉంది దానికి ఏం చేయాలో పూర్తి అవగాహన ఉంది. జగన్ పాలనలో ఏ సమస్యా పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులను జగన్ రద్దు చేశారు. పుష్కరాల కాలంలో ప్రత్యేక నిధులు విడుదల చేసి లంకలతో పాటు గ్రామాల్లో రోడ్లు, చెక్‌డ్యాములు, వంతెనలు, లింకు రోడ్లు నిర్మాణాలు చేపట్టాను. గతంలో వేమూరుకు కోట్లాది రూపాయలు వెచ్చించి వెలుగులు అందించాను. రూ.1182 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాను. 2019లో ఎన్నికల నోటిఫికేషన్ వల్ల అనుకున్న పనులు పూర్తి చేయలేక పోయా. ఆ నిధులను కూడా జగన్ ప్రభుత్వం రద్దు చేయించింది. ప్రజలు తప్పని సరిగా ఈ సారి నన్ను గెలిపొస్తారు. తిరిగి అభివృద్ధి పనులు చేస్తాను. ప్రజల నమ్మకాన్ని వమ్ము కానివ్వను.

మార్పు కోరుతున్నారు..

ఎవరి పాలన మెరుగైందో ప్రజలు తెలుసుకున్నారు. 2019 ఎన్నికల్లో జగన్ ఒకసారి ఛాన్స్ కోరాడు. ఆయన మాటలను నమ్మి మోజులో పడ్డారు. ఒకసారి చూడాలని మాత్రమే వైసీపీకి ఓటు వేశారు. రెండు సార్లు ఓడిన నాగార్జునపై ప్రజల్లో సింపతి వచ్చింది. దళితులు పూర్తిగా భుజం మీద వేసుకున్నారు. వారి పాలన అర్థం చేసుకున్నారు. ఈసారి ప్రజలు మార్పు కోరుతున్నారు. స్పష్టమైన నిర్ణయంతో మార్పును కోరుతున్న ప్రజలు తనను గెలిపిస్తారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కె.నారాయణ, ఎంఎం కొండయ్య, చెంచుగరటయ్య తదితరులు

నేడు చీరాలలో ప్రజాగళం

- చంద్రబాబు సభను జయప్రదం చేయాలని నేతల పిలుపు

చీరాల, ఏప్రిల్ 30: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు చీరాల పర్యటన ఖరారైంది. చీరాలలో బుధవారం చంద్రబాబు ప్రజాగళం యాత్ర జరగనున్నది. ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి చీరాలకు వచ్చే చంద్రబాబు చీరాల, వేటపాలెం మధ్య టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. హెలిప్యాడ్, సభ ఏర్పాట్లను మంగళవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ప్రజాగళం కార్యక్రమ పరిశీలకులు మాజీ ఎంపీ కె.నారాయణ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, సలగల రాజశేఖరబాబు, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల, బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థులు ఎం.ఎం కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ తదితరులు మాట్లాడారు చంద్రబాబు ప్రజాగళం సభను జయప్రదం చేయాలని కూటమి శ్రేణులకు పిలుపిచ్చారు. రాష్ట్రంలో నెలకొన్న దమనకాండకు స్వస్తి చెప్పేందుకే కూటమి ఏర్పడిందని, ప్రజలు కూడా దీనిని స్వాగతిస్తు న్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని చూచి వైసీపీ వెన్నులో వణుకు పుడుతోందన్నారు. అటు ప్ర భుత్వం, ఇటు స్థానిక నా యకత్వాలపై కూడా ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. చీరాలలో గత 15 ఏళ్లలో ఇద్దరు వ్యక్తుల వల్ల అరాచకం ప్రబలు తూ వస్తోందన్నారు. చంద్రబాబు సభకు బాపట్ల లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో నాతాని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మపర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, రాష్ట్ర నాయకులు గొడుగుల గంగరాజు, సజ్జా వెంకటేశ్వరరావు, కూరపాటి పూర్ణచంద్రరావు, గూడూరి శివరామప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన ఇలా..

హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.10లకు చీరాల టీడీపీ కార్యాలయానికి చేరుకుంటారు. 3.20లకు ఆ సమీపంలోని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సభ అనంతరం 5.20 గంటలకు హెలికాప్టర్‌లో గుంటూరు చేరుకుంటారు.

- టీడీపీ కార్యాలయ ప్రాంగణంలో హెలిప్యాడ్ నిర్మాణ పనులు



ఓటుతోనే రాష్ట్ర భవిష్యత్

- రైతుల ప్రయోజనాలు గాలికి
- కులాల మధ్య తగాదాలు రాజకీయ లబ్ధికే
- వైసీపీకి ఆదాయ వనరుగా రేషన్ దందా
- ప్రజా కూటమికి ఓటు వేయండి
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి


తిమ్మరాజుపాలెంలో ఏలూరికి హారతులిస్తున్న మహిళలు

పర్చూరు, ఏప్రిల్ 30 : ఓటుతోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు మండల పరిధిలోని అన్నంబొట్లవారిపాలెం, ఎడారిపల్లి, తిమ్మరాజుపాలెం, చున్నంబొట్ల అగ్రహారం, బోడవాడ, కొల్లావారిపాలెం, పెద్దివారిపాలెం, పర్చూరులో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలకు చేరుకున్న ఏలూరికి మహిళలు హారతులతో ఘనస్వాగతం పలుకుతున్నారు. పెద్దఎత్తున మహిళలు, యువకులు, వృద్ధులు, చిన్నారులు సైతం పాల్గొని ఏలూరి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ, వైసీపీ పాలనలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను తెలియజేస్తూ, తెలుగుదేశం ప్రజా కూటమి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ఏలూరి ముందుకు సాగారు. తిమ్మరాజులపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏలూరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. అరాచక అవినీతి విధ్వంస వైసీపీని ఇంటికి సాగనంపేందుకు కూటమికి ఓటు వేయాలన్నారు. కులాల మధ్య తగాదాలను వైసీపీ రాజకీయ లబ్ధికోసం పెడుతుందని మండిపడ్డారు. సామాజికవర్గం అని కసికట్టి మరీ రాజధానిని మరుగున పడేశారని వాపోయారు. నేడు రాజధాని లేని ఏకైక రాష్ట్రంగా నవ్యాంధ్రప్రదేశ్ పరిస్థితి ఉందన్నారు. 70శాతం పూర్తయిన పోలవరం పనులు సైతం ఆగిపోయాయన్నారు. డ్యాంలలో నీరు ఉన్నా చెరువులకు మాత్రం నీరు చేరలేదన్నారు. ఎన్నికల నేపథ్యంలో తాగునీటి పేరుతో అరకొర నీటిని విడుదల చేసి మమ అనిపించారని నేటికీ అనేక గ్రామాల్లో మంచినీటి చెరువులకు నీరు సక్రమంగా చేరిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో అవినీతి అక్రమాలు పెరిగిపోయామన్నారు. రేషన్ దందా వైసీపీ నాయకులకు ఆదాయ వనరుగా మారిందన్నారు. రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. గంజాయి మత్తుకు బానిసలై యువత జీవితాలు నాశనమమవుతున్నాయని ఏలూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక యువత భవిష్యత్ నిర్వీర్యంగా మారిందన్నారు.

ఏలూరికి అపూర్వస్వాగతం

కదిలి వస్తున్న యువత, మహిళలు

ఇంకొల్లు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరికి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. సాంబన్న వెంట మేమున్నామంటూ యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారు. ఇంకొల్లు మం డలంలో గత రెండు రోజులుగా హనుమోజిపాలెం, కొణికి, దుద్దుకూరు గ్రామాలలో జరిగిన పర్యటనలో పెద్దఎత్తున యువత, మహిళలు ఎదురెళ్లి అపూర్వస్వాగతం పలికారు. ఇప్పటి వరకూ వైసీపీలో ఉన్నవారు టీడీపీలో చేరి ఏలూరికి మద్దతు తెలిపారు. సాంబన్నతోనే అభివృద్ధి సాధ్యమని, మీ విజయానికి కృషి చేస్తామని ప్రకటిస్తూ సైకిల్‌కు ఓటేయాలని ప్రచారం చేస్తున్నారు. ప్రచారానికి వచ్చిన ఏలూరికి ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. కొణికి వాగుపై ఉన్న రాకపోకల సమస్య పరిష్కారం ఏలూరికే సాధ్య మైందన్నారు. కొణికిలో ప్రచారంలో పాల్గొన్న ఏలూరికి గ్రామ ప్రజలు బహ్మారథం పట్టారు. దుద్దుకూరులో వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరారు. మంగళవారం ఇంకొల్లుకు చెందిన ఎస్సీలు ఏలూరి సమక్షంలో చేరగా ఏలూరి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

గంగవరంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మళ్లీ ఎమ్మెల్యేగా ఏలూరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కరివీ రాంజనేయులు, మాజీ సర్పంచ్ సుబ్బారావు, విజయకుమారి, రమేష్, రామారావు, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

ఏలూరికి విశ్వబ్రాహ్మణుల మద్దతు

మార్టూరు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరికి మార్టూరులోని విశ్వబ్రాహ్మణ కుటుంబాల వారు మద్దతు ప్రకటించారు. మంగళవారం మండలంలోని ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఏలూరిని విశ్వబ్రాహ్మణ కుటుంబాలు కలిశారు. ఆయనకు మద్దతు ప్రకటించి ఏలూరి గెలుపునకు కృషి చేస్తామన్నారు. రెండు దఫాలుగా పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి చేసిన కృషిని వారు అభినందించారు. ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు, తమను ఎంతో ఆ కట్టుకున్నాయన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా ఏలూరి విజయం సాధించాలని కో రుకుంటూ ఆయనకు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు ఇంకొల్లు ప్రసాద్, సిద్ధూ, నాగు, వినయ్, అనంతాచారి, ఫణిదెపు సురేష్, నవలూరి మల్లి కార్జునరావు, సిద్దు కు మార్, చందు పాల్గొన్నారు.

జేపంగులూరులో..

టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యేగా కృష్ణప్రసాద్, ఏలూరిని గెలిపించాలని ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ సతీమణి శిరీష ఓటర్లకు వి జ్ఞ ప్తి చేశారు. మంగళవారం అలవలపాడు, కొప్పెరపాడులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేస్తారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలు మహిళల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ నాయకుడు వలపర్ల సుబ్బారావు, రాధా కృష్ణ మూర్తి, ఆమోస్, చిన్న ముసలయ్య, దాసు, దావీదు, రమేష్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన ఇంకొల్లు ఎస్సీలు.. జే పంగులూరులో ప్రచారం నిర్వహిస్తున్న శిరీష

టిడ్కో ఇళ్లపై వైసీపీ కక్ష

- చేతగాని జగన్‌రెడ్డి చెత్తపాలన
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


కూరగాయలు అమ్ముతున్న మహిళతో మాట్లాడుతున్న గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 30 : వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపుకు టిడ్కో ఇళ్ల సమిధలుగా మారాయని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ఉదయం అద్దంకి పట్టణంలోని 12వ వార్డులో ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కక్ష సాధింపుతో పింఛన్‌ల తొలగింపు చేపట్టిందన్నారు. అద్దంకి పట్టణంలో డ్రైనేజ్, పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, టీడీపీ అధికారంలోకి రాగానే శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వం రూ.85 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే అనంతరం వచ్చిన జగన్‌రెడ్డి ఐదేళ్లయినా దానిని పూర్తి చేయలేదని, ప్రజలకు తాగునీరు అందించలేని అసమర్థులన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు 9సార్లు పెంచి సామన్యుడిపై మోయ లేని భారం వేశారన్నారు. బస్ చార్జీలు 3 సార్లు పెంచి పేద వాడి బస్ ప్రయాణం భారం చేసారన్నారు. పేద వాడి సొంతింటి కల నెరవేర్చేందుకు అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో శింగరకొండ వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణం 90 శాతం పూర్తి చేస్తే గత 5 సంవత్సరాలలో 10 శాతం పనులు పూర్తి చేయలేక పోవడం దారుణమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చెత్తపై, మరుగుదొడ్లపై పన్నులు వేసిన చెత్త పాలకుడు జగన్ అన్నారు. మద్య నిషేదంపై హామీ ఇచ్చి ప్రమాదకర మద్యం అమ్ముతూ పేద ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యాపారులను అన్ని విధాలా వేధింపులకు గురి చేశారన్నారు. మరో 12 రోజులలో జగన్‌రెడ్డిని సాగనంపేందుకు మహిళలంతా ఏకం కావాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ముందుగా కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గొట్టిపాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్‌లు అత్తులూరి రమేష్, రంగిశెట్టి సుభాషిణి, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, కుందారపు రామారావు, గార్లపాటి శ్రీనివాసరావు, భోజనపల్లి సత్యనారాయణ, వడ్డవల్లి పూర్ణచం ద్రరావు, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, లహరి, హనుమా, బచ్చల వాసు పాల్గొన్నారు.

పరిశ్రమలు రావాలంటే బాబు రావాలి

బల్లికురవ : గత అయిదేళ్ల నుంచి వెనుక బడి ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి పరిశ్రమలు రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో అద్దంకి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్‌కిషోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి మేనిఫెస్టో గురించి ప్రజలకు అయన వివరించారు. వైసీపీ అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని రానున్న ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీని అధికారంలోకి తీసుకు వస్తే అందరికి న్యాయం జరుగుతుందన్నారు. పరిశ్రమలు లేకపోవటంతో నిరుద్యోగ యువత రోజు రోజుకు పెరిగి పోతున్నారని వారికి ఉపాధి లభించే వరకు నిరుద్యోగ భృతిని అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అమరనేని కాశీ విశ్వనాదం, దేవినేని నరేంద్ర, అమరనేని భాస్కరరావు, వినోద్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

బాబును మళ్లీ రప్పిద్దాం

స్వర్ణాంధ్ర కలను సాకారం చేద్దాం : ఎమ్మెల్యే గొట్టిపాటి

సంతమాగులూరు, ఏప్రిల్ 30 : మండలంలోని ఏల్చూరు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. జే పంగులూరు మండలం ముప్పవరం గ్రామంలో గొట్టిపాటిని కలసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ 16లక్షల మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు చంద్రబాబు ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందించారన్నారు. జగన్‌రెడ్డి కేవలం 8 లక్షల మందికి రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. 4వేల విద్యార్థులకు అంబేడ్కర్ విదేశీ విద్యను కల్పించారన్నారు. జగన్‌రెడ్డి ఆ పథకాన్నే రద్దు చేశారన్నారు. చంద్రబాబు పాలనలో రూ.5 లక్షల వరకు వడ్డీలేని డ్వాక్రా రుణాలు ఇచ్చారు. జగన్‌రెడ్డి రూ.3 లక్షలకు కుదించారన్నారు. బాబు పాలనలో ఎస్సీ, బీసీ కార్పొరేషన్ రుణాలను రూ.4 లక్షల వరకు అందిస్తే.. జగన్‌రెడ్డి ఆ రుణాలను రద్దు చేశారన్నారు. టీడీపీ హయాంలో క్వార్టర్ మద్యం రూ.60 ఉంటే జగన్‌రెడ్డి రూ.120 పెంచి సొంత జే బ్రాండ్ మద్యం అమ్మి ప్రజల ప్రాణాలతో ఆడుతున్నారన్నారు.

సైకిలెక్కిన వైసీపీ నేతలు

సజ్జాపురం మాజీ సర్పంచ్ తెలప్రోలు వెంకట్రావు వైసీపీని వీడి తన అనుచరులతో ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదిరెడ్డి, లక్ష్మరెడ్డి, ధూళిపాళ్ల ప్రసాద్, శ్రీను తదితరులు చేరగా, ఏల్చూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అంకిరెడ్డి తన అనుచరులతో గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరారు.



ఉప్పుమాగులూరులో ప్రచారం నిర్వహిస్తున్న బాబీ .. వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఏల్చూరి గ్రామస్థులను ఆహ్వానిస్తున్న గొట్టిపాటి


ఝాన్సీ సమక్షంలో చేరిన చినమల్లమరం వాసులు

వైసీపీని వీడిన చిన మల్లవరం వాసులు

జేపంగులూరు, ఏప్రిల్ 30 : మండలంలోని చిన మల్లవరం గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. అద్దంకి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సతీమణి ఝాన్సీ సమక్షంలో సోమవారం రాత్రి వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ కండువాలను మెడలో వేసి ఝాన్సీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తలతోటి రామకోటయ్య, నూతలపాటి పృథ్వి, నూతలపాటి రాజు, నూతలపాటి బాలకృష్ణ, నూతలపాటి ఆకాష్, తిరుపతి సలోమన్, తిరుపతి ఆశీర్వాదం, కొప్పోలు సుందరరావు, కొలసనకోట కోటయ్య, యమర్తి నాని, కంచర్ల పవన్, కంచర్ల ప్రభాస్, కంచర్ల ఏసుబాబు, ఉల్లస్ నాని, కొప్పోలు వినోద్, దిలీప్, కొప్పోలు సమ, తలతోటి కోటయ్య, బొనిగల సన్ని, తలతోటి రాంబాబు, నరేంద్ర పార్టీలో చేరారు.కార్యక్రమంలో బాలిన రామ సుబ్బారావు, చిలుకూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూటమితోనే మహిళల సంక్షేమం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటం ద్వారా మహిళా వర్గాలకు మేలు చేకూరుతుందని గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. మండలంలోని కల్లం వారిపాలెం గ్రామంలో మంగళ వారం రాత్రి గొట్టిపాటి ఝాన్సీ కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం ద్వారా బిడ్డల చదువుకు సాయంతో పాటు మహిళా శక్తి ద్వారా ఆడబిడ్డకు నెలకు రూ.1500 వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తారన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.10 లక్షలు వడ్డీలేని రుణాలను అందిస్తామని వాటి ద్వారా వారి ఎదుగుదల సాధ్యపడుతుదన్నారు. పింఛన్ పెంపు, బీసీలకు రక్షణ చట్టం లాంటి పథకాల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, బీజేపీ, జనసేన నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి

పర్చూరు, ఏప్రిల్ 30 : టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు, చీరాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొండయ్య గెలుపు కోసం జనసేన పార్టీ శ్రేణులు కృషి చేయాలని జనసేన పార్టీ ఎన్నికల సెంట్రల్ జోన్ కన్వీనర్ అనిల్‌కుమార్ మంగళవారం ప్రకటలో పిలుపు నిచ్చారు.

గ్రామాల్లో కూటమి నేతల ప్రచారం

చినగంజాం, ఏప్రిల్ 30 : మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ కూటమి నాయకుల ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ సోపిరాల, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామాల్లో మంగళవారం కూటమికి పట్టం కట్టాలని కోరుతూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజు వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్‌కలాంఅజాద్, చెరుకూరి రాఘవయ్య, రాయని ఆత్మారావు, టి.జయరావు, ఎం.పద్మావతి, సందు శ్రీనివాసరావు, ఏసునారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవో భవనం పరిశీలన


ఎన్జీవో సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 30 : అద్దంకిలోని ఎస్‌ఎస్‌పీ కాలనీలో నిర్మాణంలో ఉన్న అద్దంకి ఏపీ ఎన్జీవో యూనియన్ తాలూకా యూనిట్ భవనాన్ని మంగళవారం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తమనాయుడులు సందర్శించా రు. కడప వెళ్తూ మార్గమధ్యంలో అద్దంకిలోని సంఘ నాయకులతో మాట్లాడారు. భవన నిర్మాణం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల అనంతరం భవన నిర్మాణానికి సంఘం తరఫున తమ వంతు సాయం అందిస్తామని తెలిపారు. వారి వెంట అద్దంకి తాలూక యూనిట్ అధ్యక్షుడు గద్దల కిరణ్‌కుమార్, కార్యదర్శి తా ళ్లూరి రమేష్‌బాబు, ట్రెజరర్ వై.ఏడుకొండలు, ఎస్.అర్జునరావు, కె.రవికుమార్, పి.నాగమోహనరావు ఉన్నారు.

మద్దతిస్తున్నాం.. మాట నిలుపుకుంటాం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యకు జై కొట్టిన పెర్లవారిపాలెంకు చెందిన 40 కుటుంబాలు


కొండయ్యకు మద్దతు తెలుపుతున్న పెర్లవారిపాలెం గ్రామస్థులు

చీరాల, ఏప్రిల్ 30 : వచ్చే ఎన్నికల్లో మీకు మద్దతు ఇస్తున్నాం.. మీకోసం పని చేస్తాం.. మిమ్మల్ని గెలిపించుకుంటామని మాటిస్తున్నాం. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని మండల పరిధిలోని పెర్లవారిపాలెం గ్రామస్థులు పలువురు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్యకు చెప్పారు. పెర్లవారిపాలెంకు చెందిన 40 కుటుంబాలవారు మంగళవారం గవిని నారాయణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కొండయ్యను కలసి మద్దతు తెలిపారు. వారికి కొండయ్య కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అందుకు కలసికట్టుగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నమస్కరించి అడుగుతున్నా.. నాన్నను గెలిపించండి..


ఓట్లను అభ్యర్థిస్తున్న కొండయ్య కుమార్తె

చీరాల, ఏప్రిల్ 30 : ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య కుమార్తె గోరిపర్తి శివనారాయణదేవి మంగళవారం చీరాల కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, కొనుగోలుదారులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. నమస్కరించి అ డుగుతున్నా. నాన్నను గెలిపించండి అంటూ ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్యకు, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో మంగళవారం బాపట్ల ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ కుమార్తె రమ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్యకు సైకిల్ గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


1వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

ముస్లింలను ఓటు అడిగే హక్కు జగన్‌కు లేదు

అద్దంకి, ఏప్రిల్ 30 : దుల్హన్ పథకం అమలుకు నిబంధలను పెట్టిన జగన్‌రెడ్డి ముస్లింలకు ఓటు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటికి సైకిల్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ హర్షవర్ధన్ మంగళవారం అద్దంకి పట్టణంలోని 1వ వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ హయాంలో విదేశీ విద్యా పథకాన్ని అమలు చేస్తే.. దానిని జగన్‌రెడ్డి నిలిపివేసి ఉన్నత విద్యను దూరం చేశారన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచే యాదవులు అండగా ఉన్నారని, టీడీపీ ప్రభుత్వం కూడా యాదవులకు పెద్ద పీఠ వేసిందని గుర్తు చేశారు. బీసీలకు ఎల్లప్పుడూ టీడీపీ అండగా ఉంటుందన్నారు. యాదవ కార్పొరేషన్‌తో అభివృద్ధికి తోడ్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీలకు రక్షణ చట్టం తెస్తుందని హర్షవర్ధన్ తెలిపారు.

ఆస్తులను కొల్లగొట్టేందుకే ల్యాండ్ టైటిలింగ్

అద్దంకి, ఏప్రిల్ 30 : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ఆస్తులను కొల్లగొట్టేందుకు జగన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని, అది అమలైతే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం రాత్రి మైలవరం, ఏలేశ్వరవారిపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల ఆస్తులను లాక్కునే కుట్రలో రిజిస్ట్రేషన్ వ్యవస్థను తొలగించి జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రజల ఆస్తుల ఒరిజనల్ పత్రాలు జగన్ వద్ద ఉంచుకొని ప్రజలకు జిరాక్స్ పేపర్‌లు ఇస్తారన్నారు. టీడీపీ రాగానే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రుద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో బైరపునేని సత్యనారాయణ, భీమని లక్ష్మీనారాయణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్ పాల్గొన్నారు.

గ్రంథ పాలకుడికి సన్మానం

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 30 : యద్దనపూడి గ్రామంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో గ్రంథ పాలకునిగా పని చేస్తున్న జీ శ్రీనివాసరావు మంగళ వారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు సహచర ఉద్యోగులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.


శిడిమానోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

భక్తులతో కిక్కిరిసన నూతలపాడు

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 30: పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. పంట చేతికి అందిన తరువాత గ్రామంలో అమ్మవారి తిరునాళ్లను జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుంది. గ్రామ నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకుంటారు. జాతరలో శిడిపెళ్లి కొడుకు శిడిమాను ఉత్సవం విశిష్టత సంతరించుకుంది. మేకపోతుని పూజించి అమ్మవారిని ఆవహింప చేసి ఆ మేకపోతును ఊసల పెట్టెలో ఉంచి శిడిమానుకు వేలాడదీయడం సంప్రదాయం. దీంతోపాటు శిడిమానుకు రైతులు పండించిన వరి, మిరప, మొక్కజొన్న కంకులను శిడిమానుకు వేలాడ దీసి భక్తిని చాటుకున్నారు. అనంతరం శిడిమానును ఆలయం చుట్టూ మూడు సార్లు తిప్పి భక్తుల దర్శనార్థం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. తిరునాళ్ల సందర్భంగా భక్తులకు పులిహోర, మజ్జిగ, అన్నదాన కార్యక్రమాలను దాతలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పర్చూరు సిర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.సీతారామయ్య నేతృత్వంలో నలుగురు ఎస్సైలు, 100 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జేపంగులూరు, ఏప్రిల్ 30 : పంగులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో మ్యాత్యూబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షత వహిస్తారన్నారు. మండలంలోని వివిధ గ్రామా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.



పొంగళ్లు వండుతున్న భక్తులు.. ప్రత్యేక అలంకరణలో స్వామి

వైభవంగా వీరాంజనేయ తిరునాళ్ల

బల్లికురవ. ఏప్రిల్ 30 : మండలంలోని వెలమవారిపాలెం గ్రామ పరిధిలో ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి వారి 37వ వార్షిక తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామస్థులు ఉదయం నుంచే దేవాలయానికి పెద్ద ఎత్తున చేరి ప్రత్యేక అహోషేకాలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వీరాంజనేయస్వామి వారిని అర్చక స్వాములు ప్రత్యేకంగా ఆలంకరించారు. మహిళ భక్తులు దేవాలయానికి చేరి పొంగళ్ల నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్‌తో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయకపోయిన కోలాట భజనలు నిర్వహించారు.

ఎన్నికల వలంటీర్లుగా సెయింట్ ఆన్స్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

చీరాల, ఏప్రిల్ 30 : ఎన్నికల వలంటీర్లుగా సెయింట్స్ ఆన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో వారు పాటించాల్సిన విధులపై రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ అవగాహన కల్పించారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే విద్యార్థులకు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తారన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాధిపతి డాక్టర్ కె. జగదీష్‌బాబులు తెలిపారు. ఈ కార్యక్రమం ఎస్.సాయిసందీప్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో వేటపాలెం ఎస్ఐ జి.సురేష్ పాల్గొన్నారు.

గ్రామాలలో పోలీస్ కవాతు

మార్టూరు, ఏప్రిల్ 30 : ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఎలాంటి అసాంఘిక చర్యలు జరగకుండా ముందస్తుగా పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారు. మంగళవారం మార్టూరు, ఇసుకదర్శి, జొన్నతాళి గ్రామాలలో బీఎస్‌ఫ్, పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని ప్రధాన వీధులలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలకు అవగాన కల్పించారు. మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్‌వీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ఐ సైదా పర్యవేక్షణలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఒంగోలు వైపు వెళ్లే రోడ్‌లో రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అంతకు ముందు టంగుటూరులో సీఎం కార్యక్రమం జరుగుతుండగా హైవేపై భారీ వాహనాలను రెండుగంటలపాటు నిలిపివేశారు.

ఆహుతైన అరటి తోట

బల్లికురవ, ఏప్రిల్ 30 : మండలంలోని కొప్పెరపాలెంలో మంగళవారం వాకా వెంకటేశ్వరరెడ్డికి చెందిన రెండు ఎకరాలలో ఉన్న అరటి తోట అగ్నికి ఆహుతైంది. అరటి తోటలో మంటలు చెలరేగడంతో పంటపొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు గమనించి వెంటనే సమాచారాన్ని రైతుకు అందించారు. ఎండలు, వేడి గాలుల ప్రభావంతో అరటి పంట మెత్తం కాలిపోయింది. తోటలో ఉన్న వ్యవసాయ మోటార్లు, డ్రిప్ పైపులు కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.4లక్షల మేర పంట నష్టం జరిగింది.

కుల దూషణపై డీఎస్పీ విచారణ

బల్లికురవ, ఏప్రిల్ 30 : మండలంలోని గుంటుపల్లి గ్రామంలో పొలంలో గేదేలు పడిన విషయంపై జరిగిన ఘర్షణలో నమోదైన కులదూషణ కేసుపై మంగళవారం బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ విచారణ చేపట్టారు. బండారు శేషయ్య పొలంలో సూరేపల్లి గ్రామానికి చెందిన గోగులమూడి నాగేంద్రమ్మ గేదేలను తోలడంతో వీరి మధ్య ఘర్షణ జరిగింది. శేషయ్య భార్య, కుమారుడికి గాయాలు కావడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే కులంపేరుతో దూషించినట్లు నాగేంద్రమ్మ ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులపై డీఎస్పీ విచారణ జరిపారు. ఆయనవెంట సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు ఉన్నారు.


పూనూరులో టీడీపీలోకి ఏలూరి సమక్షంలో చేరిన వైసీపీ శ్రేణులు

ఏలూరి వెంట కదిలిన వైసీపీ నేతలు

పూనూరుకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైసీపీ గ్రామశాఖ అధ్యక్షుడు

టీడీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే

పర్చూరు, ఏప్రిల్ 30 : పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతోంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో ప్రతి రోజు వందల సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఇప్పటికే దాదాపుగా పర్చూరు, యద్దనపూడి, చిన్నగంజాం, మార్టూరు, ఇంకొల్లు, కారంచేడు మండలాల నుంచి వైసీపీ నాయకులు కార్యకర్తలు వేలాదిగా తెలుగుదేశం పార్టీలోకి చేరారు. తాజాగా యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ దుగ్గినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దరువూరి రాజేశ్వరి, వార్డ్ మెంబర్ దుగ్గిరాల భ్రమరాంబ, తెలుగుదేశం పార్టీలో చేరారు. వారితోపాటు, పర్చూరు, నాగులపాలెం, నెహ్రూకాలనీకి చెందిన పలువురు మంగళవారం ఏలూరి నేతృత్వంలో పార్టీలోకి చేరారు. వైసీపీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు దుగ్గినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తమ్ములూరి అంజయ్య, ఐమాల కృపారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, మేళం ఏసోబు, దుగ్గినేని నాగేశ్వరరావు, కొండా లాజర్, కొండా రత్నరాజు, బత్తుల రామయ్య, వి.వెంకటస్వామి, వంజా పోతురాజు, బత్తుల రమేష్‌తోపాటు, పలువురు పార్టీలోకి చేరారు. పెద్దగంజాం పడమటి బజార్‌కు చెందిన కోమట్ల వెంకటరామిరెడ్డి, సోమసుందర్‌రెడ్డి, కోమట్ల హనుమంతురెడ్డి, సుందరరామిరెడ్డి తదితరులు పార్టీలో చేరారు.

గొనసపూడిలో మాదాసు నాగబాబు, మాచవరపు అనిల్, సురేష్, నాగేంద్రబాబు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. బోడవాడకు చెందిన దేవరకొండ రామయ్య, నాగూల్ నతానీయులు, బందేల యేసుబాబు తదితరులు ఏలూరి సమక్షంలో చేరారు. అడుసుమల్లి గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబర్ ఉట్ల అంజనేయులు, కాకాని సాంబయ్య, గౌరీ శంకర్, తేజ్ కిరణ్, ఆదినారాయణ, బ్రహ్మం, షేక్ హుస్సేన్ తదితరులు సైకిలెక్కారు. చిన్నగంజాం మండలం రాజుబంగారు పాలెం పంచాయతీ కుక్కలవారిపాలెంకు చెందిన 12 కుటుంబాలు టీడీపీలో చేరారు. కుక్కల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదిశేషరెడ్డి, శ్రీరాములు, రెడ్డి, కుక్కల ఏడుకొండల రెడ్డి, రామలింగం శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీను తదితరులు టీడీపీలో చేరారు.

మైనర్‌ను వేధించిన నలుగురిపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఏప్రిల్ 30 : బాలికను వేధించిన ఘటనలో నలుగురు యువకులపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన వివరాల ప్రకారం స్టేషన్ పరిధిలోని బాలిక బాపట్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. పాఠశాలల చివరి రోజు అనగా గత మంగళవారం స్కూల్ ముగిశాక తిరిగి ఆటోలో ఇంటికి చేరింది. ఆ సమయంలో బాలికతో పాటు ఆమె గ్రామానికి చెందిన మరో యువకుడు కూడా ఆటోలో ప్రయాణించాడు. దీంతో గ్రామానికి చెందిన మరో ముగ్గురు యువకులు(స్టూడెంట్స్) బాలికతో యువకుడు ప్రయాణించిన వీడియోను వైరల్ చేస్తూ అల్లరి చేశారు. ఈక్రమంలో ఇంటికి చేరిన బాలికను ఆమె తండ్రి మందలించాడు. మనస్తాపం చెందిన బాలిక ఎలుకల మందు తినింది. అయితే వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు యువకులపై ఫోక్సో కేసు నమోదు చేశారు.

3 నుంచి రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ టోర్నీ

చినగంజాం, ఏప్రిల్ 30 : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలో కోకి కాశిరెడ్డి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో మే 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో విజేతలైన వారికి మొదటి బహుమతిగా రూ.40,000, రెండో బహుమతిగా రూ.30,000, మూడో బహుమతిగా రూ.20,000, నాలుగువ బహుమతిగా రూ.15,000, ఐదో బహుమతిగా రూ.10,000 అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పూణే బ్యాట్స్ నిషేధమని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.1000, బాల్‌ను కమిటీ వద్దనే కొనాలని తెలిపారు. వివరాలకు 8074361100, 9553299357, 8686449477, 9700990091 సెల్ నెంబర్లను సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

చీరాలటౌన్, ఏప్రిల్ 30 : రైలు ప్రమాదంలో గుర్తు తెలియని సుమారు 50 సంవత్సరాలున్న మహిళ మృతిచెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చీరాల రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 12:30.ని. సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆచూకీ తెలిపిన వారు 94406 27646 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

మారిన జననాడికి దర్పణం

ఒంగోలులో లోకేష్ వద్ద క్యూకట్టిన వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు

పశ్చిమ నియోజకవర్గాల్లోను అదేతంతు

టంగుటూరులో జగన్ సభకు 5వేలు

బాలయ్య సభకు 15 వేలమంది హాజరు

జిల్లా అవసరాలను ప్రస్తావించని జగన్

స్పష్టమైన హామీలిచ్చిన లోకేష్

గాలి మారింది

జనాల్లో గాలి మారింది. మంగళవారం రోజు టంగుటూరులో సీఎం, ఒంగోలులో లోకేష్, మర్రిపూడి, ఎస్‌ఎన్‌పాడులో సినీహీరో బాలకృష్ణ కార్యక్రమాలను చూస్తే స్పష్టమైంది. టీడీపీ కూటమి పక్క ప్రజల్లో ఉన్న సానుకూలత, వైసీపీ పట్ల ఉన్న వ్యతిరేకత తేటతెల్లమైంది. ఒంగోలులో లోకేష్ వద్ద టీడీపీలో చేరేందుకు వైసీపీ నాయుకులు, కార్పొరేటర్లు క్యూకట్టగా గిద్దలూరు, మార్కాపురం, దర్శి, వైపాలెం, కనిగిరి టీడీపీ అభ్యర్థుల వద్ద చేరికలు భారీగా జరిగాయి. ఇక జగన్ పాల్గొన్న టంగుటూరు సభకు కేవలం 5 నుంచి 6వేల మంది ప్రజలు హాజరు కాగా బాలకృష్ణ పాల్గొన్న రోడ్‌షోకు 15వేల మందికిపైగా రావటం విశేషం. దీంతో మంగళవారం రెండు పార్టీల కార్యక్రమాలను నిషితంగా పరిశీలించిన విశ్లేషకులు జనంనాడి టీడీపీ కూటమి వైపు మారిపోయిందనేందుకు దర్పణంగా ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.


సంతనూతలపాడు సభకు హాజరైన ప్రజలనుద్దేశించ మాట్లాడుతున్న బాలకృష్ణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో మంగళవారం ప్రధాన రాజకీయపార్టీల ప్రచార కార్యక్రమాలు పరిశీలిస్తే జననాడి అధికార వైసీపీకి వ్యతిరేకంగా మారిందనే విషయం తేలిపోయింది. ఇటు అధికార వైసీపీ అటు టీడీపీ కూటమి పార్టీల తరఫున కొందరు ముఖ్య నాయకులు జిల్లాలో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారికి తోడు ఆయా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు అధికార వైసీపీ తరఫున సీఎం జగన్ టంగుటూరు సభలో పాల్గొనగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఒంగోలులో యువగళం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకోవైపు సినీనటులు నందమూరి బాలకృష్ణ రోడ్ షోలలో పాల్గొన్నారు.

లోకేష్ వద్ద క్యూకట్టిన వైసీపీ కార్పొరేటర్లు

ఒంగోలులో మంగళవారం సాయంత్రం యువగళం పేరుతో విద్యార్థులతో చర్చాగోష్టి నారా లోకేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వద్ద టీడీపీలో చేరేందుకు పలువురు వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు పోటీపడ్డారు. ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరానికి చెందిన వారి చేరికలు జరిగాయి. వైసీపీ కార్పొరేటర్లు నాగభూషణం, బెంగళూరు నర్సయ్య అనే వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఇప్పటికే 37డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ పార్టీలో చేరారు. ఆయన బాటలోనే మరో ఇద్దరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికితోడు మరో ముగ్గురు కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నట్లు సమాచారం పంపారు. వారిని పార్టీ మారకుండా సామదాన దండోపాయంతో వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డి అడ్డుకున్నారనే ప్రచారం జరిగింది. తీరా చూస్తే మంగళవారం మంచిది కాదు కాబట్టి తాము రేపు లేక ఎల్లుండి పార్టీలో చేరుతామని ఆ ముగ్గురు కార్పొరేటర్లు దామచర్లకు హామీ ఇచ్చినట్లు సమాచారం. వారిలో ఒకరు ముస్లిం కాగా, రెడ్డి సామాజికవర్గానికి చెందిన మరో కార్పొరేటర్ ఉండటం చర్చనీయాంశం. వీరికితోడు రానున్న రోజుల్లో కార్పొరేషన్‌లో కీలకపాత్ర పోషించేవారు టీడీపీలో చేరే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతుంది.


సీఎం జగన్ బస్సు వస్తున్న సమయంలో టంగుటూరులో పలుచగా ఉన్న జనం

సింగరాజు, గుప్తా చేరిక

అలాగే గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగరాజు రాంబాబు టీడీపీలో చేరారు. వైసీపీలో ఉంటూ బాలినేని అనుచరుల దాడికి గురై రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కిన ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన సుబ్బారావు గుప్తా టీడీపీలో చేరారు. సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఆయా వర్గాలకు చెందిన తటస్థవాదులు ఇతర మరికొందరు లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన నాయకుడు పోతినేని శ్రీనివాసరావు(పీఎస్‌ఆర్) పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు ఇటీవల టీడీపీలో చేరిన కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు కూడా లోకేష్‌ను కలిసి వారి అనుచరులు పలువురిని టీడీపీలో చేర్చారు. సాయంత్ర 4.30 నుండి 6 గంటల వరకు పార్టీలో చేరే వారికి కండువాలు కప్పే పనిలో లోకేష్ మునిగిపోయారు.

గిద్దలూరు, వైపాలెంలోను..

అలాగే గిద్దలూరులో ఎంపీ అభ్యర్థి మాగుంట, ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డి సమక్షంలో పెద్దసంఖ్యలో వైసీపీ నాయకులు, శ్రేణుల టీడీపీలో చేరారు. వైపాలెం నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పలు గ్రామాల వైసీపీ నాయకులు ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. మార్కాపురంలో కందుల నారాయణ రెడ్డి, రాఘవరెడ్డిల సమక్షంలో 70 వైసీపీ కుటుంబాల వారు పార్టీ మారారు. దర్శిలో మంగళవారం రాత్రి పడమర కాశీపురం గ్రామంలో 40 వైసీపీ కుటుంబాల వారు టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సమక్షంలో టీడీపీలో చేరారు. కనిగిరి టీడీపీ అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి హెచ్‌ఎంపాడు మండలం, హాజీపురానికి వెళ్లగా గ్రామంలోని వైసీపీ ముఖ్యనాయకులు ఆ పార్టీకి చెందిన పలు కుటుంబాల వారు బహిరంగంగా మద్దతు ప్రకటించారు.

జగన్ సభకు 5 వేలు.. బాలయ్య సభకు 15వేలు

టంగుటూరులో జరిగిన సీఎం జగన్ సిద్ధం సభకు 5వేల మంది హాజరయ్యారు. వచ్చిన వారి సంఖ్య 7వేల ఉండవచ్చని మరికొందరు అంటున్నారు. అదే కొండపి నియోజకవర్గం మర్రిపూడిలో టీడీపీ కూటమి తరఫున ప్రచారం చేసిన సినీహీరో బాలకృష్ణ సభకు సుమారు 15వేల మంది హాజరయ్యారు. పోలీసు శాఖకు చెందిన స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది కొంచెం అటు ఇటుగా ఈ సంఖ్యను నిర్ధారించారు కూడా.

పచ్చిఅబద్ధాలు చెప్పిన సీఎం

ఇదిలా ఉంటే టంగుటూరు సభలో మాట్లాడిన జగన్ వెలిగొండ జలాలు జిల్లాకు అందించామని ఒక సందర్భంగా పచ్చి అబద్ధం చెప్పటం మినహా జిల్లా అభివృద్ధి అంశాలను, ప్రధాన సమస్యలను ప్రస్తావించలేదు. గత ఐదేళ్ల తమ ప్రభుత్వంలో జిల్లాకు ఏం చేసిందో ప్రత్యేకించి ఆయన ఏ నియోజకవర్గం వస్తే అక్కడ సాధించిన ప్రగతి గురించి చెబుతారని ఆ పార్టీశ్రేణులు కూడా ఊహించారు. జగన్ అలాంటి అంశాలు ఏమి ప్రస్తావించలేదు. మరోవైపు ఒంగోలు కార్యక్రమంలో లోకేష్ ఉమ్మడి ప్రకాశం జిల్లాకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఏం చేసిందో వివరించారు. ఆయన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా జిల్లాలోని పశ్చిమప్రాంతం ప్రజలకు ఊరూరా మంచినీరు అందించే పథకాన్ని గుర్తుచేశారు. ఆ పథకాన్ని ఈ ప్రభుత్వం అటకెక్కించిన విషయాన్ని ప్రస్తావించారు. అంతవరకే పరిమితం కాకుండా భవిష్యత్తులో టీడీపీ ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధికి చేయబోయే ప్రధాన అంశాలను వివరించారు. దీంతో ఇటు జగన్ అటు లోకేష్ ప్రసంగాల్లోని ప్రధాన వ్యత్యాసాలను ప్రజలు చర్చించుకోవటం కనిపించింది.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

● ఎస్పీ వకుల్ జిందాల్

పర్చూరు , ఏప్రిల్ 30 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. పోలింగ్ కేంద్రాలు ఎలా ఉన్నాయి, సమస్యాత్మక కేంద్రాల పరిస్థితి, ముందస్తు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలకు సంబంధించి మంగళవారం ఎస్పీ పర్చూరు, చీరాల నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పర్చూరు ఇందిర కాలనీలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకొని, సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం బొమ్మల సెంటర్ సమీపంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి ఘర్షణలు, వివాదాలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాలను ల్యాండ్ మార్కుచేసి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి సంబంధించి బీఎస్‌ఎఫ్ బలగాలతో ప్రజలను అప్రమత్తం చేసేలా ఇప్పటికే ఆ గ్రామాల్లో గస్తీలను నిర్వహించారన్నారు. జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, పాతనేరస్తులను గుర్తించి 10వేల మందిపై బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి, అల్లర్లకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నంబొట్లవారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్ట్‌ను పరిశీలించి, స్వయంగా వాహనాలను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం పర్చూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, నూతనంగా ఏర్పాటు చేసిన సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందికి ఎన్నికల విధులు, తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. ఆయనతోపాటు డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణ, పర్చూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీ సీతారామయ్య, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బత్తుల శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సైలు ఎస్.రమేష్, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.


పర్చూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

పలు వాహనాలు, పోలింగ్ కేంద్రాల తనిఖీ

చీరాలటౌన్ : ఎన్నికల సందర్భంగా మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్ చీరాల పరిధిలో విస్తృత పర్యటన చేశారు. చీరాల 2 టౌన్, కారంచేడు, ఇంకొల్లు, పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలలో పర్యటించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రశాంత ఎన్నికలు జరిగేందుకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎస్పీ వెంట బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు, ఎస్సైలు, ఆయా ప్రాంతాలలోని స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

వేటపాలెం(చీరాలటౌన్), ఏప్రిల్ 30 : ఆర్టీసీ బస్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అందిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం వేటపాలెం సీహెచ్‌సీ సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న నాయినిపల్లికి చెందిన షేక్ జరీబుల్లాను ప్రమాదవశాత్తు ఆర్టీసీ హయ్యర్ బస్ ఢీకొంది. ఈ ఘటనలో అతను శరీరంపై పలుచోట్ల తీవ్ర రక్త గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు బస్ ఢీకొన్న తరువాత అతను పక్కకు పడిపోగా బస్ ద్విచక్ర వాహనంపైకి ఎక్కేసింది. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. దీనిపై వేటపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

● భార్యాభర్తలకు గాయాలు

మార్టూరు, ఏప్రిల్ 30 : జాతీయ రహదారిపై మండల పరిధిలో ఒం గోలు వైపు జొన్నతాళి సెంటర్ సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటన మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న యువ దంపతులు దాసరి వెంకటేష్, అతని భార్య మానస గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు తెనాలి సమీపంలోని అన్నవరానికి చెందిన వెంకటేష్ దంపతులు ముప్పవరం గ్రామంలోని బంధువులు ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. జొన్నతాళి సెంటరు నుంచి ఇసుక దర్శి సెంటరు వైపు వెళ్లే సర్వీసు రోడ్డు నుంచి సడన్‌గా జాతీయ రహదారిపైకి వచ్చిన కారు బైక్‌ను ఢీకొన్నది. దాంతో బైక్ పై నుంచి రోడ్డుపై బడిన భార్యా భర్తలకు గాయాలయ్యాయి. అయితే ప్రాణా పాయం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వచ్చిన 108 వాహనంలో బాధితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

ఒక వైపు ప్రలోభాలు, మరో వైపు నిర్బంధాలు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 30 : చీరాల నియోజకవర్గంలో గత రెండు రోజుల్లో సుమారు 50 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. అదే పద్ధతిని అనుసరించేందుకు మరికొందరు సమాయత్తమవుతున్నారు. వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తరపు నాయకులు వలంటీర్లను నిర్బంధాలకు, ప్రలోభాలకు గురిచేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో వారు రాజీనామాలకు సిద్ధపడుతున్నారని, స్వచ్ఛందంగా రాజీనామా చేసేవారు ఎవరూ లేరని చర్చ జరుగుతోంది. దీనిపై రాజకీయ విశ్లేషకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.


వైసీపీ అభ్యర్థి వెంకటేష్‌తో రాజీనామాలు చేసిన వలంటీర్లు


ప్రచారంలో ఉన్న వలంటీర్ (వృత్తంలో)

వైసీపీ ప్రచారంలో వలంటీర్

పర్చూరు, ఏప్రిల్ 30: పర్చూరు మండలం చెన్నుంబొట్ల ఆగ్రహారంలో మంగళవారం వైసీపీ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్ తెలగతోటి సతీష్ పాల్గొన్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. ఈసందర్భంగా వైసీపీ అభ్యర్థి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తరుణంలో వలంటీర్ పాల్గొన్నట్లు ఉన్న వీడియా వైరల్‌గా మారింది.

టీడీపీలో చేరిన కొత్తపట్నం, పాదర్తి మాజీ సర్పంచ్‌లు

● లోకేష్ సమక్షంలో పార్టీ తీర్థం

కొత్తపట్నం (ఒంగోలు నగరం), ఏప్రిల్ 30 : మండలంలోని కొత్తపట్నం, పాదర్తి పంచాయతీల మాజీ సర్పంచ్‌లు మూగ ధనమ్మ, మూగ వెంకటేశ్వర్లు మంగళవారం టీడీపీలో చేరారు. ఒంగోలు పర్యటనకు వచ్చిన నారా లోకేష్ సమక్షంలో వీరిద్దరూ ఆపార్టీ తీర్థంపుచ్చుకున్నారు. భార్యాభర్తలైన వెంకటేశ్వర్లు, ధనమ్మ వైసీపీ ఆవిర్భావం నుంచి ఆపార్టీలో కొనసాగుతున్నారు. కొంతకాలంగా స్థానిక వైసీపీ నాయకులతో మూగ వెంకటేశ్వర్లు పలు అంశాల్లో విభేదిస్తూ వస్తున్నారు. ఈనేపథ్యంలో వెంకటేశ్వర్లు టీడీపీలో చేరారు. ఇప్పటికే మండలంలో వైసీపీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఎన్నికలకు ముందు బీసీ వర్గానికి చెందిన వెంకటేశ్వర్లు దంపతులు పార్టీని వీడటం పెద్ద ఎదురుదెబ్బ కానుంది.

ఉదయం నుంచే వ్యాపారాలు బంద్

టంగుటూరు, ఏప్రిల్ 30 : టంగుటూరులోని రహదారి కూడలిలో ముఖ్యమంత్రి జగన్ ప్రచార సభ ఏర్పాటుతో ఉదయం నుంచి వ్యాపారాలకు పోలీసులు అనుమతించలేదు. వ్యాపారులు తమ అంగళ్ల వద్ద కూర్చునేందుకు కూడా కుదరదంటే కుదరదన్నారు. వ్యాపారులు సైతం వారి దుకాణాలకు దూరంగా నిలబడాల్సి వచ్చింది. వ్యాపారాలు లేక వారంతా తీవ్రంగా నష్టపోయారు. ఊరిలోనే సభకు అనుమతించడంతో వ్యాపారాలన్నీ మూతవేసుకోవాల్సి వచ్చిందని వారంతా వాపోయారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు వ్యాపారాలు నిలిచిపోవడంతో వ్యాపారులు అసహనం వ్యక్తంచేశారు.


గుర్తు తెలియని బైకు ఢీకొని వ్యవసాయ కూలీ మృతి

బల్లికురవ. ఏప్రిల్ 30 : మండలంలోని కొప్పెరపాలెంకు చెందిన వ్యవసాయ కూలీ అడవి నరసమ్మ (64) గుర్తు తెలియని బైకు ఢీకొని సోమవారం రాత్రి మృతి చెందింది. అందిన సమాచారం మేరకు కొప్పెరపాలెంకు చెందిన కూలీ నరసమ్మ రోజూ పొరుగున ఉన్న కొప్పెరం గ్రామానికి పొగాకు తాళ్లు పనులకు వెళుతోంది. సోమవారం కూడా పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని బైకు కొప్పెరపాలెం నేల చప్టా వద్ద అమెను ఢీకొట్టింది. ఈప్రమాదంలో కూలీ అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఢీకొట్టిన వాహన చోదకుడు మృతదేహాన్ని రోడ్డు మార్జిన్‌లోకి నెట్టి పరారయ్యాడు. రాత్రి అయినప్పటికీ నరసమ్మ ఇంటికి రాకపోవడంతో భర్త సోమయ్య అమె కుమారులు వెతుకుతుండగా మంగళవారం రోడ్డు మార్జిన్‌లో మృతదేహం కనిపించింది. సంఘటన జరిగిన ప్రదేశంలో బైకు పడి పోయిన్నట్లు ఆనవాళ్లు కనిపించాయి. మృతురాలికి భర్త, ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు. బల్లికురవ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


మృతి చెందిన వ్యవసాయ కూలి నరసమ్మ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

బుధవారం 1 మే 2024

ప్లీజ్.. మా నాన్నను గెలిపించండి !



ఆత్మకూరులో ఓటరును అభ్యర్థిస్తున్న టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె కైవల్యారెడ్డి

విజయోస్తు!



కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు గుడ్లూరులో తిలకం దిద్దుతున్న మహిళ

ఓన్లో.. నీ ఓటు నాకే!



మండల కేంద్రమైన జలదంకిలో ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రచారం

ఊరూరా ప్రచార హోరు!

ఇంటింటా ఓట్ల కోసం వేట! • అభ్యర్థులకు పోటీగా బంధుగణం ప్రచారం • గ్రామాల్లో సందడే సందడి

అంకుల్.. మా నాన్నను గెలిపించండి!

మీ ఓటు నాకే.. మరచిపోకండి!

మా అత్తమ్మకు ఓటేయరా ప్లీజ్!

ఇలా జిల్లాలో అభ్యర్థులు, వారి బంధువులు ప్రచారాన్ని హోరెత్తించారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో ప్రచారాల్లో మునిగిపోయారు. అధికార, ప్రతిపక్ష పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రతి వీధిని కలియతిరుగుతూ ఓటును అభ్యర్థించారు. గత నెల రోజులకుపైగా ప్రచారాలు జరుగుతున్నప్పటికీ ప్రస్తుతం ప్రచారాల్లో ఊపు కనిపిస్తోంది. అభ్యర్థులకు పోటీగా వారి బంధుగణం కూడా ప్రచారాల్లో పాల్గొంటోంది. అన్నా చెల్లెళ్లు, కొడుకులు, కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు ఇలా కుటుంబ సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటును అభ్యర్థిస్తున్నారు. టీడీపీలో మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేసి తమను గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థులు ప్రజలను కోరుతున్నారు. ఇక వైసీపీ అభ్యర్థులు కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల రాకపోకలు, డప్పులు, బాణసంచా పేలుళ్లు, యువకుల కేరింతలతో గ్రామాల్లో సందడి నెలకొంది.

• ఊరూరా చుట్టేసిన అభ్యర్థులు

నెల్లూరు సిటీలో టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ మూడో డివిజన్లో డోర్ టు డోర్ ప్రచారాన్ని నిర్వహించగా, వైసీపీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ 54వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. నెల్లూరు రూరల్‌లో టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆమంచర్ల, దొంతాలి గ్రామాల్లో పర్యటించగా, వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి 19వ డివిజన్‌లో ప్రచారం చేశారు. కందుకూరులో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గుడ్లూరు మండలం శాలిపేట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూద్ యాదవ్ కందుకూరులో ప్రచారం చేశారు. ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ జలదంకి మండలం చింతలపాలెం, గట్టుపల్లి రామవరప్పాడు గ్రామాల్లో పర్యటించగా వైసీపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి కూడా అదే మండలంలోని చోడవరంలో ప్రచారం నిర్వహించారు. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి బోగోలు మండలం ముంగమూరు, ఏనుగుల బావి, తాళ్లూరు గ్రామాల్లో పర్యటించారు. వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలిలోని 10, 11 వార్డులలో ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డితో కలిసి ప్రచారం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరు మండలం ఈపూరు, పంటపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు మండలంలోని మహ్మదాపురం, తాటిపర్తి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కోవూరు నియోజవకర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొడవలూరు మండలం ఆలూరుపాడు, మానేగుంట గ్రామాల్లో పర్యటించగా, వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విడవలూరు మండలం పార్లపల్లి, అన్నారెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి చేజర్ల మండలం నడిగడ్డ అగ్రహారం, మాముడూరు గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎన్నిల ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి విక్రమ్‌రెడ్డి మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి, డీసీపల్లి గ్రామాల్లో పర్యటించారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

న్యాయం మీరే చేయాలా!



నెల్లూరులో న్యాయవాదులతో సమావేశమైన నెల్లూరు ఎంపీ, నగర టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, నారాయణ, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

యువతతో నేడు నారా లోకేష్ ముఖాముఖి



లోకేష్‌తో బీద రవిచంద్ర

నెల్లూరు(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం నెల్లూరులో పర్యటించనున్నారు. యువగళం కార్యక్రమంలో భాగంగా ఆయన నెల్లూరు సిటీలో యువతతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని వీఆర్సీ మైదానం వేదికగా జరగనుంది. ఇందుకు సంబంధించి టీడీపీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, మంగళవారం రాత్రే నెల్లూరుకు చేరుకున్న లోకేష్‌కు టీడీపీ నేతలు బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ తదితరులు స్వాగతం పలికారు.

రేపటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

• పోలింగ్ రోజున లేబర్ హాలిడే: కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 30 : మే 2వ తేదీ నుంచి ప్రతి ఇంటికి ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సర్వీసు ఓటర్లలందరూ వినియోగించుకోవాలని కోరారు. మంగళవారం డీఆర్‌డీఏలోని మీడియా సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ పూర్తయి జిల్లాలో 129 మంది పోటీలో నిలిచారని అన్నారు. నిలిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. 13వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల్లోగా పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియో గించుకోవాలనే ఉద్దేశంతో 13న లేబర్ హాలిడేగా ప్రకటిం చినట్లు చెప్పారు. పోలింగ్‌కు 48 గంటల ముందు అంటే మే 11న సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రచారాలకు అనుమతి ఉంటుందని చెప్పారు. పోలింగ్ కు 48 గంటల ముందు అన్నీ హోటళ్లు, లాడ్జీలను తని ఖీలు చేస్తామని, బయట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరూ జిల్లాను వీడి వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటరు స్లిప్పుతోపాటు గుర్తింపు కార్డు తీసుకొచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. సుమారు 20 వేల మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మే 5 నుంచి 7 వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పార్లమెంటుకు, అసెంబ్లీలకు రెండు ఓట్లు వేసేలా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న 229 మంది వారికి కేటాయించిన రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని కోరారు. 85 సంవత్సరాల పైబడిన వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకొనేందుకు 1712 మందికి ఫామ్-12డి అందించామని, వీరు మే 3 నుంచి 5వ తేదీ వరకు ఒకసారి, 8 నుంచి 10వ తేదీ వరకు రెండు విడతల్లో ఇంటివద్దనే ఓట్లు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.



• ముమ్మరంగా తనిఖీలు : ఎస్పీ

జిల్లాలో స్వేచ్ఛంగా, నిర్భయంగా ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.2.51 కోట్ల నగదు, రూ.26.50 లక్షల మద్యం సీజ్ చేసినట్లు చెప్పారు. 982 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు 3 బీఎస్ఎఫ్, 4 తమిళనాడు స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కె.సదారావు, డీపీఆర్‌ఏ మోహన్‌రాజు, ఇంజనీర్ కిషోర్ పాల్గొన్నారు.

వివాదాల నడుమ...



జలదంకి : కొత్తూరులో వైసీపీ నాయకుల మధ్య వివాదం

జలదంకి : వైసీపీలో నెలకొన్న వర్గవిభేదాల నడుమ మంగళవారం ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రచారం సాగింది. ఎల్‌ఆర్ అగ్రహారంలో నాయకుడు గుర్రం జగ్గయ్య ఇంటికి కాకుండా ఇతర ఇళ్లకు పోవడం ఏమిటంటూ ఆయన అనుచరులు మేకపాటి వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జగ్గయ్య ఇంటికి చేరుకున్న మేకపాటి తాను ఏ అభివృద్ధి పనులు చేసినా జగ్గన్న సూచనల మేరకే చేస్తానని హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం కొత్తూరులో కూడా మేకపాటి ప్రచారానికి ఆటంకం కలిగింది. ఒకానొక సందర్భంలో మేకపాటి వాహనం ముందుకు వచ్చి ఇరువర్గాలు వాగ్వివాదానికి దిగాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను పక్కకు పంపారు. స్థానిక నాయకుల వ్యవహారశైలిపై మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు.

పెన్షన్.. టెన్షన్!

నేటి నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ

నెల్లూరు (హరనాథపురం) : ఏప్రిల్ నెలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ల మొత్తాన్ని మే ఒకటవ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ కానుంది. అయితే ఇక్కడే పెన్షన్‌దారులకు సమస్య మొదలవుతోంది. కొందరి బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌లో ఉండగా, మరికొందరికి ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయి. ఈ ఖాతాల్లో పింఛను సొమ్ము జమకాదు. ఆ మొత్తం జమకాని విషయం తెలుసుకోవడానికి ఐదవతేదీ పడుతుంది. ఆ తర్వాత సచివాలయ రెగ్యులర్ ఉద్యోగులు ఫించను నగదును అందజేస్తారు. ఈసారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుండటంతో పింఛనుదారులకు ఇబ్బందులకు తప్పేలా లేవు. కాగా, బ్యాంకు ఖాతాలేని పింఛనుదారులకు, దివ్యాంగులకు, కదల్లేని స్థితిలో ఉన్నవారికి, ఆరోగ్య పింఛన్లు, సైనిక సంక్షేమ పింఛన్‌దారులకు ఇళ్ల వద్దనే సచివాలయ రెగ్యులర్ సిబ్బంది మే 1వ తేదీ ఉదయం నుంచే పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 3,15,423 మంది పింఛనుదారులు ఉండగా, రూ.94.38 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వీరిలో ఇంటివద్దనే తీసుకునేవారు 79,734 మంది, బ్యాంకు ఖాతా కలిగినవారు ఉన్నారు.

ఈతకెళ్లి అన్నదమ్ముల దుర్మరణం

• ఉప్పలపాడు వద్ద దుర్ఘటన • పాతాళపల్లిలో విషాదం

అనంతసాగరం: ఈత సరదా ఓ కుటుంబాన్ని విషాదంలో నింపింది. స్నేహితులతో కలిసి పెన్నానదిలో ఈతకెళ్లిన అన్నదమ్ములు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని ఉప్పలపాడు వద్ద పెన్నానదిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు, మండలంలోని పాతాళపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మిట్టమల్ల చిన్న వెంకటయ్య కుమారులు వంశీకృష్ణ (25), నరసింహ (23)లు అన్నదమ్ములు. మంగళవారం మధ్యాహ్నం వారిద్దరూ స్నేహితులతో కలసి సరదాగా జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద పెన్నానదిలో ఈతకు వెళ్లారు. నరసింహ నీటిలో మునిగి ఎంతకీ రాకపోవడంతో అతడి కోసం వంశీకృష్ణ లోతున ప్రాంతానికి వెళ్లి గల్లంతయ్యాడు. దీంతో వారి కోసం మిగతా మిత్రులు గాలించగా వంశీకృష్ణ దొరికాడు. అతన్ని వెలికితీసి 108 వాహనం ద్వారా ఆసుపత్రి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది గుర్తించారు. ఇక నరసింహ ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపునకు ఆటంకం కలిగింది. సోమశిల నుంచి గజఈతగాళ్లను పిలిపించి లైట్ల వెలుతురులో గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు రాత్రి 8 గంటల ప్రాంతంలో నరసింహ మృతదేహం కూడా లభ్యమైంది. సంఘటనాస్థలానికి చేరుకున్న ఆత్మకూరు సీఐ జీ వేణు, సోమశిల ఎస్ఐ సుబ్బారావు పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆత్మకూరుకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈసంఘటనతో పాతాళపల్లిలో విషాదఛాయలు అలుముకొన్నాయి. బిడ్డల్ని కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



మృతులు వంశీకృష్ణ, నరసింహ (ఫైల్)

కావలి
కందుకూరు

వన్యప్రాణుల దాహార్తిని తీర్చండి

కొండాపురం, ఏప్రిల్ 30: మండల పరిధిలోని గానుగ పెంట పంచాయతీ పరిధిలో సుమారు 1,300 ఎకరాల సామాజిక అటవీప్రాంతం ఉంది. ఈ అటవీ ప్రాంతంలో జింకలు అధికంగా ఉంటాయని గ్రామస్థులు అంటున్నారు. వేసవికాలం రావడంతో సమీప ప్రాంతాల్లోని కుంటలు, చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో అటవీప్రాంతం లోని వన్యప్రాణుల దాహం తీర్చుకునేందుకు ఎటువంటి అవకాశంలేదు. నీరు దొరక్క జింకలు మరణించే అవకాశం ఉందని, అటవీప్రాంతంలో కృత్రిమంగా తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

181 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఏప్రిల్ 30: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 740 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 559 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-137, ఆర్-2 సీఆర్-33, జంపింగ్‌లాట్స్-9 కారణాలతో 181 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ. 292, కనిష్ఠ ధర రూ.216, సగటు ధర రూ.255.95 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

అన్నివర్గాల అభివృద్ధికి దిక్సూచి ఎన్డీఏ మేనిఫెస్టో



ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లింలు

● గుడ్లూరు మండలంలో ఇంటూరి నాగేశ్వరరావు విస్తృత ప్రచారం

గుడ్లూరు, ఏప్రిల్ 30: ఎన్డీఏ కూటమి తరపున టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కళ్యాణ్‌లు ఉమ్మడిగా విడుదల చేసిన మ్యానిఫెస్టో అన్నివర్గాల అభ్యున్నతికి దిక్సూచి అని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఏలూరుపాడు, శాంతి నగర్, ఎస్టీకాలనీ, సాలిపేట, పూరేటిపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో టీడీపీ శ్రేణులతో పాటు యువకులు, మహిళలు ఉత్సాహంగా నాగేశ్వరరావుకు ఎదురేగి ఘన స్వాగతం పలికారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయమే ధ్యేయంగా ఓటు వేసిన అనేకమంది రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిందేనంటూ నాగేశ్వరరావుకు సంఘీభావం తెలిపారు. చంద్రబాబు సీఎం కావడమే లక్ష్యంగా సైకిల్ గుర్తుకు ఓటువేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని, తామంతా టీడీపీ గెలుపుకోసం శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు. గ్రామగ్రామాన ప్రజల్లో వస్తున్న అనూహ్యస్పందనతో నాగేశ్వరరావు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. పోర్టు అనుబంధంగా పరిశ్రమల పేరుతో ఈ ప్రాంతంలోని భూములను కారుచౌకగా లాగేసుకునేందుకు వైసీపీ నాయకులు కుట్రపన్నారని, రైతులు సంఘటితంగా ప్రతిఘటించాలని సూచించారు. ఈ ప్రచారంలో ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు నిమ్మకాయల రమణయ్య, జడ నాగేశ్వరరావు, అత్తంటి శ్రీనివాసులు, గడ్డగుంట శ్రీను, రామకృష్ణ, పరె రామారావు, అట్లా కోటయ్య, చల్లా మోహనరావు, జడ శ్రీను, ఉమ్మినేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

కందుకూరు : పట్టణంలోని 18వ వార్డుకు చెందిన పలు ముస్లిం కుటుంబాల వారు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. షేక్ గౌస్ బాషా, షేక్ ఖాదర్‌బాషా, షేక్ షాహుల్ కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరగా నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నగర జయకృష్ణ, షేక్ ఫాజిల్, షేక్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

3, 4 వార్డులలో ఇంటూరి సౌజన్య ప్రచారం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులకు సైకిల్ గుర్తుపై ఓటువేసి మంచి మెజారిటీ అందించాలని కోరుతూ నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య మంగళవారం పట్టణంలోని 3, 4 వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇద్దరు అభ్యర్థులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఎంతో మేలుచేశారని భవిష్యత్తులోను ప్రజాప్రతినిధులుగా గెలిపిస్తే మీ కష్టసుఖాలలో తోడుగా ఉంటారని తెలుపుతూ ఆమె టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమెవెంట టీడీపీ నాయకులు పువ్వాడి కోటయ్య, మచ్చా మనోహర్, చుండూరి మాల్యాద్రి, నందికనమల లక్ష్మణరావు, పెట్లూరి సుబ్బారావు, చల్లా మహేంద్ర, గుమ్మా శివ, నందనవనం రాము, భవనాసి వెంకటేశ్వర్లు, అత్తంటి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సౌజన్యతో కలిసి బీజేపీ నేతల ప్రచారం

ఎన్డీఏ కూటమి బలపరుస్తున్న టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కందుకూరులో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్యతో కలిసి బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుల విజయంలో భాగస్వాములు కావాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాథం వైకుంఠం, అమలనాథుని మాల్యాద్రినాయుడు, ఎం.భూషయ్య, నవులూరి రాజేష్, దార్ల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఇంటూరి సౌజన్యతో కలిసి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

అభ్యర్థుల విధి విధానాలపై అవగాహన



ఆర్డీవో కార్యాలయంలో కావలి అసెంబ్లీ అభ్యర్థులు, ప్రతినిధులతో మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్

కావలి, ఏప్రిల్ 30 : కావలి అసెంబ్లీ నియోజకవర్గ నుంచి పోటీ చేసే అభ్యర్థులు విధివిధానాలు, వారు పాటించాల్సిన నియమ నిబంధనలపై జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ గౌతమ్ అవగాహన కల్పించారు. కావలి ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆయన కావలి రిటర్నింగ్ అధికారి శీనా నాయక్‌తో కలసి పోటీ చేసే అభ్యర్థులు, వారి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభ్యర్థులు ఎన్నికల ఖర్చులకు సంబంధించిన అకౌంట్స్ నిర్వహణ ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. అలాగే ఈవీఎంల కమిషనింగ్ సమయంలో అభ్యర్థులు కానీ వారి ప్రతినిధులు కానీని హాజరై ఈవీఎంలలో బ్యాలెట్ పత్రాలు అమర్చే విధానంను పరిశీలించవచ్చన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం, హోమ్ ఓటు వినియోగం విధానం గురించి వివరించారు. ఈ సమావేశంలో కావలి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు జీ. శ్రావణ్‌కుమార్, నగేష్, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

19 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఏప్రిల్ 30: మోటారు సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతని నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావుకు అందిన సమాచారంతో మంగళవారం కావలి మండలం రుద్రకోట వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో చేవూరుకు చెందిన గాలి ప్రసాద్ తన వద్ద ఉన్న సంచిలో 19 మద్యం సీసాలు పెట్టుకుని దానిపై టవల్ కప్పుకుని అటు వైపు వెళుతున్న మోటారు సైకిల్‌ను ఆపి లిఫ్టు అడిగి చేవూరు వెళ్తుండగా సీఐ తనిఖీ చేసి పట్టుకున్నారు. అతని వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నార్తుఆములూరు ఉప సర్పంచు టీడీపీలో చేరిక



రవిచంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన నార్తుఆములూరు ఉప సర్పంచు మల్లికార్జున, వార్డు సభ్యురాలు రమణమ్మ

అల్లూరు, ఏప్రిల్ 30 : నార్తుఆములూరు ఉపసర్పంచు గుంజి మల్లికార్జున, వార్డు సభ్యురాలు గుంజి రమణమ్మ, గుంజి లోకేష్‌లు మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సమక్షంలో నెల్లూరులోని ఆయన నివాసంలో టీడీపీలో చేరారు. వారికి రవిచంద్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు, పాలనా వైఫల్యాలను చూడలేక చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే సంక్షేమం, అబివృద్ధి జరుగుతుందన్నారు. గతంలో కూడా టీడీపీ హయాంలోనే తమ గ్రామాభివృద్ధి జరిగిదని, ఈ ఐదేళ్లలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కనీసం పంచాయతీలో వసతులు కూడా ఏర్పాటు చేసుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంజి రుద్రయ్య, బెల్లంకొండ మల్లికార్జున, దాసరి ప్రభాకర్, పెయ్యల భాస్కర్, ఒట్టూరు బాబు, దాసరి కరుణాకర్, బెల్లంకొండ భాను, శిగినం తిరపయ్య, వట్టికాల శీనయ్య, చల్లా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే దివి శివరాం



నరిశెట్టివారిపాలెంలో స్థానికులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, ఏప్రిల్ 30: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తిరిగి చంద్రబాబు నాయుడును చూడాలన్న ఏకైక లక్ష్యంతో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకున్నానని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పందలపాడు, నరిశెట్టివారిపాలెం గ్రామాల్లో ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీఏ బలపరిచిన నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటమే లక్ష్యంగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నరిశెట్టివారిపాలెం సర్పంచ్ ముప్పాళ్ల శ్రీనివాసరావు, నాయకులు గోచిపాతల మోషే, కూనం సుబ్బారెడ్డి, కామని రాఘవ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, వర్ల దేవదాసు, దివి శ్రీధర్, రావూరి రామకోటయ్య, కసుకుర్తి నవరత్నం, గౌడపేరు ప్రసాదరావు, గౌడపేరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం : వంటేరు

● తుమ్మలపెంటలో ఇంటింటి ప్రచారం



కొత్తసత్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంటేరు

కావలి రూరల్, ఏప్రిల్ 30: ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం రెండూ కావాలంటే టీడీపీతోనే సాధ్యం అని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రం, రెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం బాగుండాలంటే నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలంటే చంద్రబాబు కావాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థులు సౌమ్యుడు అందరివాడు అయిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఎంపీగా, కావ్య క్రిష్ణారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు టీడీపీకి ఓటు వేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం కాపులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో యల్లంగారి యానాదయ్య, తాతా శీనయ్య, కాటంగారి రవీంద్ర, చిట్టిబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా : కావ్య



కావ్య క్రిష్ణారెడ్డిని సన్మానించి హారతులు పడుతున్న మహిళలు



టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న క్రిష్ణారెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 30: జరగనున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతానని టీడీపీ కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలంలోని ఏనుగుల బావి, ముంగమూరు, తాళ్లూరు పంచాయతీలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భానుడి ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బీజేపీ నేతలు సీవీ సత్యం, నూకసాని శ్రీనివాసులుయాదవ్‌లు, టీడీపీ, బీజేపీ జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోళ్లదిన్నె గ్రామం నుంచి యువత భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే అందరు కలసికట్టుగా పని చేయాలని, గెలుపు కావాలంటే అందరి సహకారం ఉండాలన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దగల శక్తి చంద్రబాబునాయుడుకి మాత్రమే ఉందన్నారు. టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, మీవాడైన నన్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బీద గిరిధర్ యాదవ్, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, జంపాని ప్రభాకర్, ఒంటేరు ప్రసన్న, ఒ.మాల్యాద్రి, ఎల్లమ్మ, పులి సుబ్బారావు ఎల్.మాధవరావు, పాల్గొన్నారు.

టీడీపీ గూటికి వైసీపీ నేతలు

దగదర్తి మండలం తడకలూరు గ్రామ అరుంధతివాడకు చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు మాలేపాటి రవీంద్రనాయుడు మాట్లాడుతు వైసీపీ పాలనలో దళిత గిరిజనులకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. చంద్రబాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాయితీ రుణాలు అందచేసేవారని, జగన్ పాలనలో దాచుకోవడం దోచుకోవడం తప్ప మరొకటి లేదన్నారు. అనంతరం దగదర్తి పద్మశాలి వీధి, ముస్లిం, తూర్పు వీధి, కుమ్మర వీధులో మాలేపాటి సోదరులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర పాలనే ధ్యేయంగా ఉమ్మడి పార్టీల అభ్యర్థులు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ దగుమాటి క్రిష్ణారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడుతో కలసి బాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు, కార్యకర్తలు, మాలేపాటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో టీడీపీ ముమ్మర ప్రచారం



అల్లూరులో ప్రచారం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

అల్లూరు, ఏప్రిల్ 30: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. టీడీపీ జిల్లా లీగల్‌సెల్ నాయకుడు రఫీమాలిక్ ఆధ్వర్యంలో మంగళవారం అల్లూరు పట్టణ పరిధిలోని మసీదువీధి, వెంగనగుంట, ఆర్‌డీఆర్ కాలనీలలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హర్షిత్‌రెడ్డి, శ్రీనివాసులు, రహీం, సురేష్, మల్లికార్జున, వెంకమ్మ, శివ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పురిణిలో 120 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో గిరిధర్, కోటారెడ్డి

మండలంలోని పురిణి పంచాయతీలోని సుబ్బానాయుడు తోపు, ఉత్తర హరిజనవాడ, బీసీ కాలనీ మందిరం, పురిణి గ్రామాల నుంచి 120 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక నాయకులు గండవరపు వెంకటేశ్వర్లు, షేక్ కాలేషా, మద్రిబోయిన సురేంద్ర, చేజర్ల హరీష్, ఎల్లు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, అంబటి రాజేంద్ర, బిట్రగుట చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ప్రచారం



కరపత్రం ఆవిష్కరిస్తున్న తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధులు

కందుకూరు, ఏప్రిల్ 30: ఎన్డీఏ కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరుతూ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో గుడ్లూరు మండలంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వింగ్ నియోజకవర్గ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక ఆధ్వర్యంలో గుడ్లూరు ఎస్టీ కాలనీ, ఏలూరుపాడు ఎస్సీ కాలనీ, చేవూరు, పోట్లూరు గ్రామాలలో ప్రచారం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జగన్ విధ్వంసకర పాలనతో రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని వివరిస్తూ మేము సైతం మనరాష్ట్రం కోసం అంటూ చంద్రబాబును సీఎంను చేయటమే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు సాయికృష్ణ, గట్టమనేని అఖిల, తొట్టెంపూడి అశ్విని, వల్లపోతు వెంగళరావు, మండలపు బ్రహ్మానాయుడు, గద్దగుంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న కావలి!

● పారిశుధ్యం అధ్వానం ● అవస్థల్లో పట్టణ ప్రజలు

కావలి రూరల్, ఏప్రిల్ 30: వ్యాపార కేంద్రమైన కావలి పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారి కంపు కొడుతోంది. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి, మురుగు నీరు మడుగులు కట్టి దుర్గంధం వెదజల్లుతోంది. అయినా మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండగా పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని జనతాపేట, సపోటాతోట ప్రాంతాల్లో ఓ పక్క చెత్తకుప్పలు దర్శనమిస్తుండగా మరోపక్క డ్రైనేజీ కాలువల్లో మురుగు రోడ్లపైకి చేరుతోంది. జనతాపేట నార్తు టీఎస్ఆర్ నాయుడు అపార్టుమెంట్ ఎదురుగా మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లోని చెత్తను అరకొరగా తొలగిస్తుండటంతో అది నిండిపోయి ఆ మార్గం మొత్తం చెత్తమయం అయిందని స్థానికులు వాపోతున్నారు. అలాగే జంతు కలేబరాలు కూడా వేస్తుండటంతో ఆమార్గంలో వెళ్లాలంటే ముక్కు మూసుకోక తప్పదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే 2వ వార్డు సచివాలయం పక్కనే మురుగు నీటి కాలువల్లో చెత్త తొలగించక పోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



2వ వార్డు సచివాలయం పక్కన మురుగునీరు

కందుకూరు ఎంపీపీ ఇంట్లో
వలంటీర్లతో సమావేశం

● తాయిలాలు, నగదు పంపిణీకి ఏర్పాట్లు
● సీ విజిల్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు
● అధికారులకు వస్తున్నారని తెలిసి అంతా పరార్!



అధికారులు వస్తున్నారని తెలియడంతో ఎంపీపీ ఇంట్లో నుంచి జారుకుంటున్న వలంటీర్లు

కందుకూరు, ఏప్రిల్ 30 : మండలంలోని కొండముడుసుపాలెం గ్రామంలో వైసీపీ ఎంపీపీ ఇంటూరి సుశీల నివాసం వేదికగా అధికార పార్టీ నేతలు తాయిలాల పంపిణీకి సిద్ధపడ్డారు. ఎంపీపీ భర్త, ఆ గ్రామ వైసీపీ నాయకుడు మాధవరావు నేతృత్వంలో వలంటీర్లను సమావేశపరిచి వారికి బహుమతులు అందజేశారు. వారిద్వారా ఓటర్లకు తాయిలాలు అందించేందుకు సమాలోచనలు జరుపుతుండగా టీడీపీ నేతలు గుర్తించి, సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు వస్తున్నట్లు సమాచారం అందుకున్న వలంటీర్లు 16 మంది అక్కడ నుంచి జారుకున్నారు. అయితే, అధికారులు వస్తున్న సమాచారం ముందుగానే వైసీపీ నేతలకు చేరడం పట్ల టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇందుకు బాధ్యులను గుర్తించి ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

అధ్యాపకుడు ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్

కావలిటౌన్, ఏప్రిల్ 30: విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్సీ విభాగం అధ్యాపకుడు ఎం ప్రవీణ్‌కుమార్‌కు ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఐవోటీలో బ్లాక్‌చైన్ ఉపయోగించి గోప్యతను కాపాడే పద్ధతుల యొక్క తులనాత్మకత అధ్యాయనం అనే అంశంపై పరిశోధనం చేసినందుకు డాక్టరేట్ లభించినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయనను విశ్వోదయ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ, పరిశోధన పర్యవేక్షకురాలు స్వర్ణలత, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.

నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలి

నెల్లూరు (హరనాథపురం) : నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలని కలెక్టర్ హరినారాయణన్ నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. చెక్ పోస్టుల్లో సీజ్ చేసిన నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులకు, సిబ్బందికి వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొన్నారు. సీవిజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులన్నిటినీ పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు పాల్గొన్నారు.


ఉన్నవి పాయె.. కొత్తవి రాకపాయె..!

● ఐదేళ్లలో పడకేసిన పారిశ్రామిక రంగం

ఒక వైపు పోర్టు, మరోవైపు రైల్వే వ్యవస్థ.. వీటికి మధ్యలో జాతీయ రహదారి. అన్నింటికన్నా మించి అందుబాటులో భారీ భూబ్యాంక్, మానవ వనరులు.. ఇన్ని వసతులు ఉన్నప్పుడు పారిశ్రామిక రంగం ఏ విధంగా పరుగులు తీయాలి? కానీ గడిచిన ఐదేళ్లలో జిల్లాలో జరిగిన పారిశ్రామిక ప్రగతిని పరిశీలిస్తే ప్రభుత్వ వైఫల్యం ఏ విధంగా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. కొత్త పరిశ్రమలు రావడం అటుంచితే అప్పటికే ఏర్పాటుకు సుముఖత చూపిన భారీ పరిశ్రమలు కూడా పరార్ అవ్వడం ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోంది. భూములు ఇచ్చిన రైతులు, నిరుద్యోగ యువత ఉపాధి కోసం కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురు చూసి నా చివరకు నిశారే ఎదురైంది.

● అవకాశాలను అందిపుచ్చుకోని ప్రభుత్వం
● వైసీపీ ప్రభుత్వంలో రూ.1317 కోట్ల పెట్టుబడులు
● ఉత్కర్ష, క్రిబ్‌కో ఎటు పోయనో..! ● మోసపోయిన నిరుద్యోగులు
● టీడీపీ ప్రభుత్వంలో రూ.19,704 కోట్ల పెట్టుబడులు







నెల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి తిరోగమనంలో పయనించింది. 2014-19 మధ్య కాలానికి, 2019-24 మధ్య కాలానికి పోలిక చూసుకుంటే భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జిల్లాలో 12 భారీ, మెగా పరిశ్రమలు ఏర్పడ్డాయి. రూ.19,704 కోట్లతో ఏర్పాటైన ఈ పరిశ్రమల ద్వారా 4,734 మందికి ప్రత్యక్షంగా ఉపాధి దొరికింది. పరోక్షంగా మరో ఐదు వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.9,259 కోట్ల పెట్టుబడులతో భారీ, మెగా పరిశ్రమలు ఏర్పాటు కాగా 1,563 మందికి ఉపాధి లభించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే ఇందులో రూ.7,942 కోట్ల పెట్టుబడులు కృష్ణపట్నం థర్మల్ ప్లాంటు మూడో యూనిట్ ఉండటం గమనార్హం. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ కాగా ఈ పనులు కూడా గత ప్రభుత్వంలోనే ప్రారంభమయ్యాయి. అలానే రూ.273 కోట్లతో ఓ పరిశ్రమ, రూ.88 కోట్లతో మరో పరిశ్రమ 2019లో ప్రారంభం కాగా అవి టీడీపీ ప్రభుత్వంలో మొదలైనవేనని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమల ప్రగతి ఎంత దారుణంగా ఉందో స్పష్టమవుతోంది. ఇక 2014-19 మధ్య కాలంలో సింగిల్ విండో ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చి వేగవంతంగా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. జిల్లాలో మూడు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి సేల్ డీడ్ రూపంలో విక్రయాలు చేయడంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారు. దీంతో టీడీపీ ఐదేళ్ల కాలంలో 2,602 ఎంఎస్ఎంఈలు రూ.677 కోట్లతో ఏర్పాటు కాగా 12,465 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించింది.

● కొంపముంచిన 'సేల్ డీడ్'

వైసీపీ ప్రభుత్వంలో ఇండస్ట్రియల్ పాలసీను మార్చి భూములను సేల్ డీడ్ విధానంలో కాకుండా లీజు విధానానికి మార్చడంతో ఔత్సాహికులు వెనకడుగు వేశారు. ఒక్కరంటే ఒక్కరు కూడా ఇండస్ట్రియల్ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రాలేదు. తప్పు తెలుసుకున్న వైసీపీ ప్రభుత్వం ఇటీవల లీజు డీడ్ విధానం మార్చుకొని మళ్లీ సేల్ డీడ్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాగా కొవిడ్ రూపంలో ఎంఎస్ఎంఈలకు భారీ కష్టం వచ్చి పడింది. అప్పటివరకూ ఎంఎస్ఎంఈల కింద రిజిస్ట్రేషన్ చేసుకోని వారు తీవ్రంగా నష్టపోయారు. ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పటివరకూ రిజిస్ట్రేషన్ చేసుకోని చిన్న చిన్న పరిశ్రమలన్నీ రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. 14 వేలకు పైగా ఎంఎస్ఎంఈ కింద రిజిస్ట్రేషన్ చేసుకోగా అవన్నీ వైసీపీ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటైనవన్నట్లుగా ప్రచారం చేసుకుటుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● భారీ పరిశ్రమలు పరార్

జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో కష్టపడింది. కీలకమైన మిథానీ, క్రిబ్కో వంటి కేంద్ర సంస్థలకు జిల్లాలో భూములు కూడా కేటాయించింది. కానీ వైసీపీ ప్రభుత్వంలో ఆ పరిశ్రమలు పరారయ్యాయి. కొడవలూరు మండలం బొడ్డువారిపాలెం వద్ద రక్షణ పరికరాలు తయారు చేసే మిథానీ సంస్థ రూ.3,500 కోట్లతో భారీ ప్లాంటును దక్షిణ భారత దేశంలో మొదటిసారి ఏర్పాటు చేసేందుకు టీడీపీ ప్రభుత్వంలో ముందుకొచ్చింది. 2018లో 110 ఎకరాల భూమిని కూడా అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిపై కొందరు కోర్టుకెళ్లడంతో అప్పట్లో పనులు ప్రారంభం కాలేదు. అయితే ఆ తర్వాత కోర్టు కేసు తొలగిపోయింది. ఈ లోపు ప్రభుత్వం కూడా మారిపోయింది. ఈ క్రమంలో మిథానీ సంస్థ రక్షణ పరికరాల తయారీ పరిశ్రమ ఏర్పాటు ఆలోచనను విరమించుకుంది. ఆ స్థానంలో మిథానీ, నాల్కో జాయింట్ వెంచర్‌గా ఏర్పాటైన ఉత్కర్ష అల్యూమినియం ధాతు నిగమ్ లిమిటెడ్ సంస్థ హైఎండ్ అల్యూమినియం ఉత్పత్తులు తయారీకి ముందుకొచ్చింది. 2020లో మిథానీ పేరు మీద ఉన్న భూములను ఉత్కర్ష పేరుపైకి మార్చారు. అయినప్పటికీ ఆ సంస్థ ఆ తర్వాత ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. 2022 ఏప్రిల్‌లో ఉత్కర్ష సంస్థ ఉన్నతాధికారులు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి సమస్యలపై చర్చించారు. అయినా పురోగతి లేదు. ప్రస్తుతం ఉత్కర్ష సంస్థ జిల్లాలో పరిశ్రమ ఏర్పాటు ఆలోచనను విరమించుకున్నట్లు ఉన్నతాధికారుల ద్వారా తెలుస్తోంది. వెంకటాచలం మండలం సర్వేపల్లి వద్ద క్రిబ్కో ఎరువుల పరిశ్రమ ఏర్పాటు తెలుగుదేశం ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రూ. వెయ్యి కోట్లతో ఏర్పాటు చేయాలని భావించిన ఈ పరిశ్రమకు భూమి కూడా కేటాయించింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎరువుల పరిశ్రమ ఆలోచనను క్రిబ్కో వెనక్కు తీసుకుంది. ఈ ప్లాంటు తమిళనాడులో ఏర్పాటు చేసేందుకు ఆలోచనలు జరుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో కేంద్ర మంత్రితో ఎంపీలు సంప్రదింపులు జరిపారు. ఆ తర్వాత క్రిబ్కో ఎరువుల పరిశ్రమ స్థానంలో బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు జరగనున్నట్లు ప్రకటించారు. కానీ అది కూడా కార్యరూపం దాల్చలేదు. ఇక రామాయపట్నంలో ఏషియన్ పేపర్ సంస్థ భారీ పరిశ్రమ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వంలో ఒప్పందం జరిగింది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పరిశ్రమ ఊసే కనిపించలేదు.

సీఎం జిల్లాకు 'సెంచురీ' జంప్



ఆత్మకూరు : పిచ్చిమొక్కలతో నిండిన ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కేటాయించిన స్థలం

ఆత్మకూరు : మండలంలోని నారంపేట వద్ద 2020, సెప్టెంబరు 20న 173 ఎకరా ల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటైంది. ఇక ఆత్మకూరు పారిశ్రామికంగా పరుగులు వేస్తుందని ప్రజలు ఎంతగానో సంబరపడ్డారు. పార్కు అభివృద్ధి కోసం తొలిగా రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 87 ఎకరాల్లో మాత్రం రోడ్లు, డ్రైనేజీ పనులు జరిగాయి. కొన్నాళ్లకు ఈ పార్కులో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. కానీ ఏమి జరిగిందో ఏమో ఈ పరిశ్రమ ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లాకు తరలిపోయింది. 2021, డిసెంబరున బద్వేల్ నియోజకవర్గంలో సదరు పరిశ్రమ ఏర్పాటుకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. వచ్చిన ఒక్క పరిశ్రమ కూడా తరలిపోవడంతో నారంపేట వద్ద పార్కు నిరుపయోగంగా మారింది. ఆత్మకూరులో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ ఏర్పాటు చేసి ఉంటే రూ.1600 కోట్లు పెట్టుబడులు, 2500 పైచిలుకు ప్రత్యక్ష ఉద్యోగాలు, మరో 500 మందికి ఉపాధి లభించి ఉండేది. పరిశ్రమ తరలిపోవడంతో నిరాశే మిగిలింది.

పేరొకటే.. ఇంటి పేర్లు తేడా !

● ఆత్మకూరు బరిలో ముగ్గురు పోటీ
● పార్టీ గుర్తుపై ఇద్దరు.. ఇండిపెండెంట్ ఒకరు

ఆత్మకూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేవారిలో రామనారాయణరెడ్డి పేరుతో ముగ్గురు ఉన్నారు. వీరిలో ఇద్దరు పార్టీ గుర్తుపై కాగా, ఒకరు ఇండిపెండెంట్. టీడీపీ తరుపున ఆనం రామనారాయణరెడ్డి సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్నారు. అనంతసాగరం మండలం బీ అగ్రహారం గ్రామానికి చెందిన ధనిరెడ్డి రామనారాయణరెడ్డి జాతీయ జనసేన పార్టీ తరపున పెన్‌స్టాండ్ గుర్తుపై పోటీలో ఉన్నారు. అలాగే చేజర్ల మండలం మడపల్లి గ్రామానికి చెందిన సాగసాయి రామనారాయణరెడ్డి ఇండిపెండెంట్‌గా గ్లాస్ గుర్తుపై పోటీలో ఉన్నారు. కాగా అక్షరాస్యులు సైతం ఈ పేర్లు చూసి గందర గోళానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ చేసిన దుర్మార్గపు ఆలోచన ఇదని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

- సంగం



అప్పట్లో డబ్బు ప్రభావం ఉండేది కాదు..

నేటి తరం రాజకీయాల్లో నీతి,నిబద్ధత లేదు. మా రోజుల్లో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ప్రజాసేవ చేశాం. 30ఏళ్ల రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేశా. 3 సార్లు కౌన్సిలర్‌గా పనిచేశా. ఏ ఎన్నికలైనా డబ్బు ప్రభావం ఉండేది కాదు. నేడు డబ్బు ఏరులై పారుతోంది. సామాన్యులు ఎన్నికలకు దూరంగా ఉండాల్సిందే. ఆరోజుల్లో కార్యకర్తలకు ఎంతో విలువుండేది. నాయకుడ్ని కార్యకర్త నడిపించే వాడు. నేడు కార్యకర్తలను కూలీలుగా మార్చా రు. కార్పొరేట్ రాజకీయాలు నడుస్తున్నాయి కార్యకర్తలు టికెట్ తెచ్చుకున్నవారిని అనుసరించడం తప్ప చేసేదేమి లేక సర్దుకుంటున్నారు.

- సయ్యద్ అరబ్ బాల్ఫి, మాజీ కౌన్సిలర్, కావలి

గీత దాటితే వేటు


నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో బరిలో ఉండేవారు ఎవరో తేలిపోయింది. ఇక ప్రచారాలు ఊపందుకోనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల కార్యకర్తలు నిబంధనలు మరచి పోయి అత్యుత్సాహం ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారానికి స్పష్టమైన గీత గీచింది. ఆ గీత దాటితే వేటు వేయనున్నది. అవేమిటంటే ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. ఆ అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. అనుమతి పొందిన వ్యక్తే వాహనం వాడాలి. ఇతరులు వాడితో చర్యలు తీసుకుంటారు. విద్యా సంస్థలు, వాటి మైదానాల్లో ప్రచారం చేయకూడదు. కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి. ప్రచారంలో టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు. అయితే వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు. దేవుళ్ల ఫొటోలు అభ్యర్థి ఫొటోతో కలిసి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించ కూడదు. వాహనాలపై మతపరమైన ఫొటోలు, అభ్యర్థి ఫొటో ఉండకూడదు. ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉండ కూడదు. రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్‌స్పీకర్లు వాడకూడదు. ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ ఓటరై ఉండాలి. ఊరేగింపు మార్గాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేయాలి. దిష్టిబొమ్మలు తగల బెట్టకూడదు. ఈ నిబంధనలు పాటించకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారు.

- వలేటివారిపాలెం



ఓటు వేయకుంటే జైలు, జరిమానా

● పలు దేశాల్లో అమలు
● హక్కు వినియోగం పౌరుల బాధ్యత



ఎన్నికల్లో పౌరులు తమ ఓటును వినియోగించుకోకుంటే, కొన్ని దేశాల్లో జరిమానా విధిస్తారు. మరికొన్ని దేశాల్లో నేరస్థులుగా పరిగణించి శిక్ష కూడా వేస్తారు. ఆస్ట్రేలియాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాల్సిందే. ఓటు వేయని వారికి ఆ దేశ కరెన్సీ ప్రకారం 20 డాలర్ల జరిమానా విధిస్తారు. ఆ మొత్తాన్ని నిర్దిష్ట గడువులోగా చెల్లించకపోతే 200 డాలర్ల వరకు అదనపు జరిమానా చెల్లించాలి. బెల్జియంలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోని వారికి 80 యూరోల వరకు, రెండోసారి ఓటు వేయనివారికి 200 యూరోల వరకు జరిమానా విధిస్తారు. వరుసగా నాలుగుసార్లు ఓటు హక్కు వినియోగించుకోని పక్షంలో పదేళ్ల వరకు జాబితా నుంచి పేరు తొలగిస్తారు. అంతేకాక వీరికి ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ పథకాల్లోనూ ప్రాధాన్యం ఇవ్వరు. బ్రెజిల్ దేశంలో ఓటు వేయని వారు ఫైన్ కట్టాలి. గ్రీసు, ఈజిప్టు దేశాల్లో ఓటు వేయని వారిపై ప్రత్యేక విచారణ చేపడతారు. సరైన కారణం చెబితే హెచ్చరించి వదిలేస్తారు. ఎలాంటి కారణం లేకుండా ఓటు వేయలేదని తేలితే జైలుశిక్ష విధిస్తారు. ఇటలీలో ఓటు వేయనివారి పేర్లను అందరికీ తెలిసేలా అధికారిక పత్రాల్లో ప్రచురిస్తారు. పెరూలో ఓటుకు దూరంగా ఉన్నవారి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తారు. ఇలా.. ఓటు వేయనివారికి ఒక్కో దేశంలో ఒక్కో రకమైన శిక్షలు, జరిమా నాలు ఉన్నాయి. ఏ శిక్షా లేకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశమున్న మన దేశంలో ఓటు వేయకపోవడం భావ్యమా ? ఓటర్లూ బాగా ఆలోచించి సరైన నాయకులను ఎన్నుకోవడం మనందరి కర్తవ్యం.

- పొదలకూరు

ఆత్మీయత అంతా ఓ నాటకం



అనుబంధం, ఆత్మీయత.. అంతా ఓ నాటకం... అన్నాడో సినీకవి. అనుబంధం సంగతి ఎలా ఉన్నా తాజా ఎన్నికల్లో ఆత్మీయత మాత్రం ఓ నాటకమేనన్నది తాజా రాజకీయ సంఘటనలను బట్టి తెలుస్తోంది. ఈ మాటల్లో నిజమెంతో తెలియాలంటే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఎత్తుగడలు చూస్తే చాలు. ఓవైపు అభ్యర్థి ఖర్చులపై ఎన్నికల కమిషన్ నిఘా, మరోవైపు పైసలు తీయకపోతే కార్యకర్తలు కరువై పోయే పరిస్థితి. ఇది పోటీలో ఉన్న వారికి మింగుడుపడ డంలేదు. అందుకే తాజాగా నాయకులు ఆత్మీయ సమావేశాలను ఎంచుకుంటున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తమతో వస్తున్న కార్యకర్తలందరికీ మద్యం, బిర్యానీ, నగదు ఇచ్చేందుకు పుట్టిన రోజులు, పెళ్లి రోజులు.. అని చెప్పి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశాల్లో నాయకులు తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. అనంతరం కార్యకర్తలకు మద్యం, బిర్యానీ డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఈ ఖర్చులన్నీ ఎన్నికల వ్యయం కింద రాకుండా జాగ్రత్తలు పడుతున్నారు.

● అలగానిపాడు నుంచి అంతర్జాతీయ స్థాయికి..
● నేడు పుచ్చలపల్లి జయంతి

ఆదర్శ పార్లమెంటేరియన్ సుందరయ్య !

కోవూరు, ఏప్రిల్30 : 'సాటి పార్లమెంటు సభ్యులు కొందరు.. కొత్తరకం కార్లు ఎక్కి రాయంచ నడకతో, మత్తేభయానంతో, ఠీవిఠీవిలు కుతూ, నాయకత్వపు నయగారం తొణికిసలాడుతూ.. పార్లమెంటు భవనంలో వెళ్తుండగా, సైకిలెక్కి పార్లమెంటు భవనం ముందు దిగి, స్టాండులో సైకిల్ పెట్టి, బీగం బిగిసిందో లేదో లాగి చూసుకొని, క్యారియర్‌కు కట్టిన కాయితాల ఫైలు పుచ్చుకొని, లోపలికి ప్రవేశించి తన స్థానంలో కూర్చొని నిష్టతో తన పనుల్లో లీనమయ్యే వ్యక్తి శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య.. అని తెలుసుకున్నప్పుడు అపరిచితులకు ఆశ్చర్యం కలుగుతుందేమోగానీ.. పరిచయస్తులకు మాత్రం ప్రతిదిన దృశ్యం' అంటూ 1960లో ఓ తెలుగువార పత్రికలో కథనం ప్రచురితమైంది. ప్రజా పోరాటాల రథసారథిగా, ప్రతిపక్షనాయకుడిగా సుందరయ్య చూపిన మార్గం ఇప్పటికీ ఆదర్శప్రాయం. ఆయన పాదముద్రలు దేశరాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన్ను ఎందరో స్మరించుకుంటున్నారు. నేడు (మే1న) ఆయన జయంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● అలగానిపాడు నుంచి ప్రస్థానం

కోవూరు తాలూకా అలగానిపాడులో 1918 మే 1న ధనిక రైతు కుటుంబంలో పుచ్చలపల్లి సుందరయ్య జన్మించారు. బాల్యంలోనే ఆయన వివేకానంద, రామతీర్థల బోధనలకు ఆకర్షితులయ్యారు. గాంధీ పిలుపుతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, కొమరరాజు లక్ష్మణరావు లాంటి సాహితీవేత్తల వికాసంతో సాంఘిక చైతన్యాన్ని పెంపొందించుకున్నారు. 14వ ఏటనే మద్రాసు కాంగ్రెస్ మహాసభలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తూ జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. 1930లో మద్రాసు లయోలా కాలేజీలో సోదరసమితిని స్థాపించారు. గాంధీజీ పిలుపుతో చదువుకు స్వస్తి పలికి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సత్యాగ్రహ శిబిరంలో పాల్గొన్నారు. దళనాయకుడిగా ఎంపికయ్యారు. దీంతో అప్పటి బ్రిటీష ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసి రెండేళ్ల జైలుశిక్ష విధించింది. బాలుడు కావడంతో సుందరయ్యను తంజావూరులోని బోర్డర్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన తరువాత అలగానిపాడు నుంచే ఆయన తన రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు.

● వేమన జయంతి నిర్వహణ

రాజకీయ కార్యక్షేత్రంగా అలగానిపాడు నుంచే ఆయన ఓనమాలు దిద్దుకున్నారు. మొట్టమొదటిసారిగా గ్రామంలో ఆయన వేమన జయంతిని నిర్వహించి, సవర్ణ హిందువులకు, దళితులకు కలిపి సహపంక్తి భోజనం ఏర్పాటుచేశారు. దీంతో ధనిక వర్గాలు ఆయనపై దౌర్జన్యానికి దిగాయి. గ్రామంలో బాలగంగాధర్ తిలక్ గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసి యువకుల్లో చైతన్యం కలిగించారు. లాభనష్టాల ప్రమేయం లేకుండా చౌకదుకాణం నిర్వహించి గ్రామస్థుల మన్ననలు పొందారు. అలగానిపాడు వ్యవసాయ కార్మిక సంఘం పేరుతో కూలీల సంఘం ఏర్పాటుచేశారు. ఆ సంఘమే జాతీయ స్థాయి వ్యవసాయ కార్మిక సంఘంగా తరువాత కాలంలో అభివృద్ధి చెందింది. భారత కమ్యూనిస్టు పార్టీని దక్షిణాది రాష్ట్రాల్లో బలోపేతం చేసేందుకు ఆయన ఎంతో కృషి సాగించారు. పార్టీ విభజనానంతరం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా 14 ఏళ్లపాటు పనిచేశారు. తెలంగాణ విప్లవ పోరాట రథసారథిగా తెలంగాణ సాయుధపోరాటాన్ని తీర్చిదిద్దారు. మొట్టమొదటి పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేతగా అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సైతం మెచ్చుకొనేలా ప్రసంగాలు చేశారు.



తెలుగువారి అభ్యున్నతికి కృషి

నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ధ్యేయంతో పుచ్చలపల్లి సుందరయ్య రచించిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' దిక్సూచిగా నిలుస్తోంది. తెలుగు ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు పథనిర్దేశం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య. తెలుగు జాతి వికాసానికి ఆయన రచించిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సి ఉంది.